V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

విశ్వంభర

అక్షరం సాక్షిగా..

గురువారం

05-09-2024

సంపుటి : 01 | సంచిక : 124 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

ఎమ్మెల్సీ పదవిని బాధ్యతగా భావిస్తా

- ప్రజా సమస్యలను చట్టసభల్లో లేవనెత్తి వాటి పరిష్కారానికి కృషి చేస్తా
- త్యాగరాయ గానసభలో జరిగిన ఆత్మీయ పౌర సన్మాన సభలో ప్రొ.కోదండరామ్

విశ్వంభర, హైదరాబాద్ : ఎమ్మెల్సీ పదవిని బాధ్యతగా భావి స్తానని తెలంగాణ రాష్ట్ర శాసన మండలి సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. రాష్ట్ర ప్రజల సమస్యలను చట్టసభల్లో లేవనెత్తి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు యం.నర్సయ్య ఆధ్వర్యంలో ప్రొఫెసర్ కోదండరామ్ కు ఆత్మీయ పౌర సన్మానం సభ బుధవారం త్యాగరాయ గానసభలో ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో కోదండ రామ్ మాట్లాడుతూ..పదవి అనేది సాధనమే కానీ అది అంతిమ లక్ష్యం కాదు అన్నారు. తెలంగాణ ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేయడంలో భాగంగా ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ తన వంతు ప్రయత్నాలు కొనసాగి స్తానని తెలిపారు. ప్రజల కోసం జీవితాలని అంకితం చేసిన రామ్ మనోహర్ లోహియా, కర్పూరి ఠాకూర్, గుమ్మడి నరసయ్య లాంటి మహనీయులను ఆదర్శం గా తీసుకొని ప్రజల కోసం వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. తెలంగాణ అభివృద్ధి కోసం అన్ని వర్గాలు, సమూహాలు ఉద్యమకారుల తో కలిసి ఎప్పటిలాగే పనిచేస్తానని వివరించారు. తెలంగాణ ఉద్యమం లో నడిచిన వారంతా తెలంగాణ జన సమితిలో ఉన్నారు కాబట్టి పార్టీ గొప్పగా నిలబడి ముందుకు సాగుతుందని అన్నారు. విలువలకు కట్టుబడి ఉద్యమం నుంచి పని చేస్తూ వస్తున్నామని అలాంటి వారితో కలిసి పనిచేసి రాష్ట్ర అభివృద్ధికి పా డుతానని తెలిపారు. విలువలకి కట్టుబడి పని చేసిన వారు దేశ రాజకీయాల్లో అనేకమంది ఉన్నారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. రాజకీయాల్లో ఉంటేనే మార్పు సాధ్యమని ప్రజల జీవనస్థితిగతులు మెరుగుపడతాయని భావించి తెలంగాణ జన సమితిని ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు.

ప్రొఫెసర్ జయశంకర్ సమకాలికుడు చంద్ర శేఖర్ మాట్లాడుతూ...జనంలో ఉండే వ్యక్తి జనం కోసం పనిచేసే వ్యక్తి కోదండరాం ఎమ్మెల్సీ రావడం అభి నందనీయమని అన్నారు. ఆయనకు సన్మానం అంటే మాకు జరిగినట్టుగా భావిస్తామని అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత తెలంగాణతో ముడిపడి ఉన్న వ్యక్తులు ఎవరు అని వెతికితే కోదండరాం ప్రము ఖంగా కనిపిస్తారని అన్నారు. ప్రజల కోసం పోరాడే వ్యక్తి ప్రభుత్వంలో ఉంటే ప్రజలకు ఎంతో మేలు జరు గుతుందని ఆయన అన్నారు.

సభాధ్యక్షత వహించిన జనసమితి హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నర్సయ్య మాట్లాడుతూ.. కోదండరా మ్ ను సన్మానించడం అంటే తెలంగాణ సమాజాన్ని, తెలంగాణ ఉద్యమకారులను సన్మానించడమేనని అన్నారు. సబ్బండ వర్గాల ఆత్మగౌరవం కోసం పనిచేసే కోదండరామ్ ను సన్మానించడం ఎంతో గొప్పగా ఉందని తెలిపారు.

ఈ సందర్భంగా ప్రొ. కోదండరామ్ ను వివిధ సంఘాల నాయకులు, ఉద్యోగస్తులు, జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ సభ్యులు, విద్యార్థి నాయకులు, పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు ఆయన్ను ఘనంగా సత్కరించారు.

సభకు ముందు లోయర్ ట్యాంక్ బండ్ కట్టమైసమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించి పెద్ద ఎత్తున ర్యాలీగా బయలుదేరి ఎన్టీఆర్ స్టేడియం, అశోక్ నగర్, జవహార్ నగర్, ఆర్టీసీ క్రాస్ రోడ్ నుండి వివిధ కళా బృందాలచే ర్యాలీగా త్యాగరాయ గానసభకు చేరుకు న్నారు. కళాప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమంలో టి.జే.ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బద్రు ద్దీన్, ప్రధాన కార్యదర్శి బట్టల రామచందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మానేపల్లి లక్ష్మణ్, కోశా ధికారి ఎస్.సురేష్ కుమార్, అధికార ప్రతినిధి నాకోటి రవికాంత్, ము షీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్ యాదవ్, నగర నాయకులు సయ్యద్ ఇస్మాయిల్, కే రాజు, సుధాకర్, అజయ్ గౌడ్, రవీందర్ యాదవ్, వెంకటయ్య, పుష్ప, శాంతాబాయి, అశ్వత్, ఎల్లప్ప, హనుమంతు గౌడ్, మాణిక్యం, సుధాకర్, పవన్, గోవింద్ తదిత రులు పాల్గొన్నారు.

విద్యాజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బీటెక్ 2వ సంవత్సరం చదువుతున్న పి నాగసాయి మణికంఠకు బుధవారం మణిదీప్ ఛారి-టబుల్ ట్రస్ట్ ద్వారా ట్రస్ట్ చైర్మన్ మణిదీప్ కళాశాల ఫీజు కోసం రూ. 20000/- ఆర్థిక సహాయం అందించారు.

- విశ్వంభర, హైదరాబాద్

అలుగు పారుతున్న చేగుంట చెరువు

విశ్వంభర, చేగుంట : చేగుంట మండల కేంద్రంలోని ఊర చెరువు భారీ వరద నీటితో ప్రవహిస్తుంది బుధవారం ఉదయం నుంచి మత్తడి పారడంతో గ్రామస్తులు నీటి ప్రవాహాన్ని చూడడానికి తరలి వెళ్తున్నారు. అలాగే మం డలంలోని వివిధ గ్రామాల్లో భారీ వర్షాలకు కుంటలు నిండి వరదనీటితో ప్రవహిస్తున్నాయి. చెరువులలోకి 95 శాతం వరద నీరు చేరింది భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. చెరువు కుంటలు అలుగు పారుతున్న సమయంలో చెరువు కుంటలకు వద్దకు వెళ్ళ రాదని రెవెన్యూ అధికారులు ఇరిగేషన్ అధికారులు సూచిస్తున్నారు. వర్షాల కారణంగా ఆయా గ్రామాల్లో పాత ఇల్లు దెబ్బతిన్నాయి పాత ఇళ్లలో నివాసం ఉండరాదని అధికారులు సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వం పేరు మార్చి

బీఆర్ఎస్ విధానాలనే అమలుపరుస్తోంది

- ప్రతి మహిళకు రూ.2500 రూపాయలు ఇవ్వాలి
- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్

విశ్వంభర, నల్లగొండ : కాంగ్రెస్ పార్టీ 2023 డిసెంబర్ ఎన్నికల సందర్భంగా మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రతి మహిళకు 2500 రూపాయలు ఇస్తానన్న హామీని నిలబెట్టుకోవా లని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు.స్థానిక దొడ్డి కొమురయ్య భవన్ లో బుధవారం ఐద్వా నల్లగొండ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షురాలు పొలబోయిన వరలక్ష్మి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మల్లు లక్ష్మి మాట్లాడుతూ మహాలక్ష్మి పథకంలో భాగంగా మహి ళలకు ఆర్టీసి ఉచిత ప్రయాణం, గ్యాస్ సిలిండర్ సబ్సి డీని అమలు చేయడాన్ని స్వాగతిస్తూనే ఆ పథకంలో భాగమైన ప్రతి మహిళకు 2500 రూపాయల నగదును అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతున్నా నేటికీ అమలు చేయలేదు. వేగవంతంగా ఈ పథకా న్ని అమలు చేయడానికి ప్రభుత్వం కార్యచరణ ప్రక టించాలని డిమాండ్ చేశారు.వర్షాభావ పరిస్థితుల వల్ల విష జ్వరాలు వేగవంతంగా విస్తరిస్తున్నాయని, ప్రభుత్వం తక్షణమే హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించి చికెన్ గునియా, డెంగ్యూ లాంటి వ్యాధులకు అన్ని ప్రైవేటు దావకానాల్లో ఉచిత వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్, ప్రైవేటు దావకానాలు దోపిడీ విష జ్వరాల పేరుతో విపరీతంగా దోపిడీ పెరిగిపోయిందని,అధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వారు అన్నారు.ప్రభుత్వ దావకానాలో తీవ్రమైన బెడ్స్ కొరత ఉందని విష జ్వరాలపై రోజురోజుకు సమీక్ష సమావేశాలు నిర్వహించి నివారణకు కృషి చేయాల న్నారు. సంక్షేమ హాస్టల్ లో కనీసం కూడా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితుల గురించి పట్టించుకోవడంలేదని వారన్నారు. కనీస మౌలిక సౌకర్యాల కల్పనలో పూర్తిగా వైఫల్యం చెందారని అన్నారు.హాస్టల్స్ లో రోజువారీగా వైద్యులు పరీక్షలు నిర్వహించాలన్నా రు.ఈ జిల్లా కమిటీ సమావేశంలో జిల్లా కార్యదర్శి పాలడుగు ప్రభావతి,జిల్లా సహాయ కార్యదర్శి కొండ అనురాధ,జిల్లా సహాయ కార్యదర్శి జిట్ట సరోజ జిల్లా ఉపాధ్యక్షురాలు జిల్లా సహాయ కార్యదర్శి దైద జాన కమ్మ తుమ్మల పద్మ జిల్లా సహాయ కార్యదర్శి చాన బోయిన నాగమణి జిల్లా సహాయ కార్యదర్శి భూతం అరుణకుమారి జిల్లా సహాయ కార్యదర్శి పాదూరి గో వర్ధన జిల్లా సహాయ కార్యదర్శి కారంపొడి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

విశ్వంభర

అక్షరం సాక్షిగా..

గురువారం
05-09-2024

సంపుటి : 01 | సంచిక : 124 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



ఉప్పొంగుతున్న గోదావరి

భద్రాచలం వద్ద పెరుగుతున్న నీటి మట్టం

మొదటిప్రమాద హెచ్చరిక జారీ

విశ్వంభర, ఖమ్మం: తెలంగాణ వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో పాటు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదనీటి వల్ల భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. బుధవారం సాయంత్రం మిగతా5లో...

బంగాళాఖాతంలో అల్పపీడనం

తెలుగు రాష్ట్రాలకు మరో ముప్పు

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : తెలుగు రాష్ట్రాలకు మరో ముప్పు పొంచి ఉన్నట్లు తెలుస్తోంది. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని వాతావరణ నిపుణులు తెలిపారు. దీని ప్రభావంతో మరోసారి భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు. ఏపీలోని గోదావరి జిల్లాలతో పాటు విజయవాడలో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. తూర్పు, ఉత్తర తెలంగాణలోనూ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయన్నారు. కాగా ఇప్పటికే పలు జిల్లాల్లో వర్షాలు ప్రారంభమయ్యాయి.

ఎమ్మెల్యేలు పార్టీ మారితే పెన్షన్ కట్!

- హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం కీలక నిర్ణయం
- ఎమ్మెల్యేల పింఛన్లు, అలవెన్సుల సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం
- ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటును ఎదుర్కొన్న ఎమ్మెల్యేలకు ఈ కొత్త నిబంధన వర్తింపు

05

అమెరికాలో రోడ్డు ప్రమాదం

నలుగురు భారతీయులు మృతి

మృతుల్లో ముగ్గురు హైదరాబాదీలు

డల్లాస్‌లో కారును ఢీకొన్న ట్రక్కు

కేటీఆర్ సంతాపం..

05

సింగపూర్‌లో ఘన స్వాగతం.. ఢోలు వాయించిన మోదీ

భారత్-బ్రూనై మధ్య విమాన సర్వీసులు

ఇరు దేశాల సంస్కృతి, సంప్రదాయాలు, ప్రజల భావోద్వేగాలను పరస్పరం గౌరవించుకుంటాం

బ్రూనై సుల్తాన్ హాజీ హసనల్ బోల్కియాతో నరేంద్రమోదీ భేటీ

ఢిల్లీ: బ్రూనై పర్యటన సందర్భంగా ఆ దేశ సుల్తాన్ హాజీ హసనల్ బోల్కియాతో భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ భేటీ అయ్యారు. రక్షణ, వాణిజ్యం, ప్రాంతీయ సహకారం వంటి ద్వైపాక్షిక అంశాలపై ఇరువురు సుదీర్ఘ చర్చలు జరిపారు. మిగతా5లో...

వరద ప్రాంతాల్లో ఏరియల్ సర్వే చేయనున్న కేంద్ర బృందం

కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డిల వినతి

సానుకూలంగా స్పందించిన హోంమంత్రి అమిత్ షా

05

ఎలాంటి అవసరమొచ్చినా అండగా ఉంటాం

100 ఫైరింజన్లు, 2,100 మంది సిబ్బందితో బురద తొలగింపు పనులు

విజయవాడకు బుడమేరే ప్రధాన సమస్య..

సాయం చేయకపోగా నిందలేస్తారా?

ఏపీకి రావాలని అమిత్ షాను కోరా

మీడియాతో మాట్లాడిన సీఎం చంద్రబాబు

విశ్వంభర, విజయవాడ:

వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు. విజయవాడలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎక్కడ ఎలాంటి అవసరమొచ్చినా తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బురద తొలగింపు పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. 62 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2,100 మంది పారిశుద్ధ్య సిబ్బందిని మిగతా11లో...

కేసీఆర్ లాగా విదేశీ కుట్ర అనలేదు.. ఫామ్ హౌస్ లో కూర్చోలేదు

- చినుకు పడిన క్షణం నుంచి ప్రజల్లోనే ఉన్నాం
- మా ముందస్తు చర్యల వల్ల వీలైనంత ప్రాణ నష్టం తగ్గించగలిగాం
- పదేండ్లలో డిజాస్టర్ మేనేజ్మెంట్ ను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

2

ప్రమాదాల్లో నిపోతున్నారు హెల్మెట్లపై డిస్కౌంట్ ఇవ్వొచ్చు కదా

11

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి

తెలంగాణ రుణం తీర్చుకునే సమయమిదే

- కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలి
- తక్షణం రూ.2 వేల కోట్లు విడుదల చేయాలి
- సీఎం నేతృత్వంలో త్వరలో కేంద్రప్రభుత్వ పెద్దలను కలుస్తాం
- మంత్రి శ్రీధర్ బాబు

11

వరద బాధితుల కోసం వెల్లువెత్తుతున్న విరాళాలు

రెండు తెలుగు రాష్ట్రాలకు రూ.6 కోట్ల విరాళం ప్రకటించిన పవన్‌కల్యాణ్

రూ.2 కోట్ల విరాళం ప్రకటించిన ప్రభాస్.

చిరంజీవి, రామ్ చరణ్, అల్లు అర్జున్ రూ.కోటి చొప్పున విరాళం

నెల జీతాన్ని విరాళంగా ప్రకటించిన బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: భారీ వర్షాలు, వరదల వల్ల నష్టపోయిన తెలుగు రాష్ట్రాల బాధితులను ఆదుకునేందుకు సినీ రాజకీయ ప్రముఖులు ముందుకొస్తున్నారు. భారీగా విరాళాలు ప్రకటిస్తున్నారు. మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ తెలంగాణకు రూ.50లక్షలు, ఆంధ్రప్రదేశ్‌కు రూ.50లక్షలు చొప్పున మొత్తం కోటి రూపాయలను విరాళంగా అందజేయనున్నట్లు ప్రకటించారు. రెబల్ స్టార్ ప్రభాస్ రూ.2 కోట్ల విరాళం ప్రకటించారు. చిరంజీవి రూ.కోటి, బాలకృష్ణ రూ.కోటి, అల్లు అర్జున్ రూ.కోటీ, మహేశ్‌బాబు రూ.కోటి, ఎన్టీఆర్ రూ.కోటి, సిద్ధూ జొన్నల గడ్డ రూ.30 లక్షలు, విష్వక్‌సేన్ రూ.10 లక్షలు, వెంకీ అట్లూరి రూ.10 లక్షలు, మిగతా11లో...



నేటి చికెన్ ధరలు

ఫామ్ ధర ₹ 99	రిటైల్ ₹ 121
స్కిన్ ₹ 175	స్కిన్ లెస్ ₹ 200

కల్లెడలో ఎల్లెడలా సంతోషం

పారాలింపిక్స్‌లో కాంస్యం సాధించిన దీప్తి గ్రామంలో సంబురాలు

11

నిఖార్సయిన తెలంగాణ వాది.. ఉద్యమ రథ సారధి ప్రొ.కోదండరాం

రాజనీతి బోధకుడి నుంచి రాజకీయ నాయకుడిగా ఎదిగి ఎమ్మెల్సీగా పెద్దల సభకు వెళ్లిన ప్రజానాయకుడు

తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ తో సమానంగా వినపడిన పేరు. ఉద్యమ సమయంలో ఆయన ఏ పిలుపు నిచ్చినా ప్రతి పిలుపుకు ప్రజల నుంచి విశేష స్పందన లభించేది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడాలని ప్రజల స్వప్నం సాకారం కావడం వెనుక కీలకంగా వ్యవహరించిన వ్యక్తులలో వారి పాత్ర విస్మరించలేనిది.ఆయనే కోదండరాం సార్ గా సుపరిచితుడైన ముద్దసాని కోదండరాం. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమ రథసారథిగానే కాక ప్రొఫెసర్ గా ఆయన ఎంతో మంది విద్యార్థులకు, నిరుద్యోగులకు ఆదర్శంగా నిలిచారు.ప్రొఫెసర్ కోదండరాం గురించి పెద్దగా పరిచయం అక్కర్లేదు.. తెలంగాణ రాష్ట్రానికి జాతిపితగా కేసీఆర్ ను అభివర్ణిస్తూ ఆయన అభిమానులు ఎంతైనా ఊదరగొట్టవచ్చు గాక.. కానీ కేసీఆర్ తో సమానంగా రాష్ట్ర సాధనకు అవసరమైన కీలక తరుణంలో నాయకత్వం వహించిన వ్యక్తి ప్రొఫెసర్ కోదండరాం.అన్ని పార్టీల సమన్వయంతో సంయుక్త కార్యాచరణ సమితి ఏర్పాటు చేసి, దానికి సారథ్యం వహిస్తూ రాజకీయ లబ్ధిని కోరుకునే పార్టీల వ్యవహారాలను సమన్వయం చేసుకుంటూ.. ఉద్యమాన్ని ముందుకు నడిపిన సారధి ఆయన! నేడు ఆయన 70వ పుట్టినరోజు సందర్భంగా విశ్వంభర ప్రత్యేక కథనం..

ముద్దసాని కోదండరాం స్వగ్రామం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నెన్నెల మండలం జోగాపూర్. 1955 సెప్టెంబర్ 5న ముద్దసాని వెంకటమ్మ, ఎం.జనార్దన్ రెడ్డి దంపతులకు జన్మించారు. హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో డిగ్రీ, ఓయూలో పీజీ (పొలిటికల్ సైన్స్), జేఎన్యూలో ఎంఫిల్ పూర్తి చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీహెచ్డీకోసం చేరగా.. 1981లో ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఉద్యోగం రావడంతో పీహెచ్డీ మధ్యలో ఆపేశారు. వృత్తిరీత్యా ఉస్మానియా యూనివర్సిటీలో రాజనీతి శాస్త్ర అధ్యాపకులు అయిన కోదండరాం పౌరహక్కుల నేతగాను మానవ హక్కుల పరిరక్షణ కోసం పోరాడారు.హైదరాబాద్ జనరల్ సెక్రటరీగా పౌరహక్కుల ఉద్యమంలోనూ కోదండరాం పని చేశారు.ఆదివాసీల సమస్యలపై దివంగత హక్కుల నేత బాలగోపాల్, ప్రొఫెసర్ బియ్యాల జనార్ధన్రావుతో కలిసి పని చేశారు. ఓయూలో ప్రొఫెసర్ గా సుదీర్ఘ కాలం పనిచేసిన కోదండరాం..దివంగత ప్రొఫెసర్ జయశంకర్, ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ సహా అనేక మంది ప్రముఖ తెలంగాణవాదులతోనూ కలిసి పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ సివిల్ లిబర్టీస్ కమిటీ (ఏపీసీఎల్సీ) రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా, ఆహార భద్రత చట్టం కేసు విషయంలో సుప్రీంకోర్టు కమిషనర్కు సలహాదారుగా సేవలు అందించారు.1996 నుంచే తెలంగాణ సమస్యలపై అనేక సెమినార్లు నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ స్థాపించిన తెలంగాణ విద్యా వంతుల వేదిక (టీవీవీ)కు 2004 లో రాష్ట్ర అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు.

తెలంగాణ ఉద్యమ రథసారథిగా కోదండరాం

తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రధానపాత్ర పోషించిన వ్యక్తుల్లో ప్రొఫెసర్ కోదండరాం ఒకరు. తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ.. జేఏసీ కన్వీనర్గా ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం సాగిన ఉద్యమంలో ఆయన పాల్గొన్నారు.2009 డిసెంబర్ 24న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై యూపీఏ ప్రభుత్వం చేసిన ప్రకటన తర్వాత తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజాక్) ఏర్పాటైంది. దీనికి కోదండరాం కన్వీనర్గా వ్యవహరించారు. ఉద్యమ సమయంలో రాజకీయ జేఏసీ చైర్మన్ గా అన్ని పార్టీలను తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఏకం చేయడంలో క్రియాశీలంగా పని చేశారు. తెలంగాణ జేఏసీ కన్వీనర్గా తెలంగాణ ఉద్యమాన్ని పల్లెపల్లెకు తీసుకెళ్ళడంలో, సబ్బండ వర్ణాలను తెలంగాణ ఉద్యమంలో పాల్గొనేలా చేయడంలో తన వంతు పాత్ర పోషించారు.

ప్రొఫెసర్ కోదండరాం తెలంగాణ ఉద్యమ సమయంలో ఈ పేరు చెబితే చాలు అనే సమైక్యాంధ్రులు గడగడలాడిపోయే వారు.ఆయన ఎప్పుడు ఏ పిలుపునిస్తారో అని నాటి ఉమ్మడి రాష్ట్ర పాలకులు కూడా భయపడేవారు. తెలంగాణ ఉద్యమ కాంక్షను బలంగా వినిపించేందుకు ప్రొఫెసర్ కోదండరాం ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు జరిగాయి. కోదండరాం పిలుపునిచ్చిన ప్రతి ఆందోళనలో వేల సంఖ్యలో తెలంగాణ వాదులు పాల్గొని తమ ఆకాంక్షను పాలకులకు తెలిపారు. టీజాక్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం మిలియన్ మార్చ్, సాగరహారం, సడక్ బంద్లకు పిలుపునిచ్చారు.మిలియన్ మార్చ్, సకల జనుల సమ్మె, సాగర హారం ఇలా ఆయన ఇచ్చిన పిలుపులు విజయవంతం అయ్యాయి. ఆయన పిలుపుకు తెలంగాణ వాదులు కదిలేవారు. రాజకీయపార్టీలు తెలంగాణకు మద్దతిచ్చేలా కూడా ఒత్తిడి తీసుకురావడంలో సఫలమయ్యారు.

తెలంగాణ జనసమితి ఏర్పాటు..

తెలంగాణ రాష్ట్రం కోసం టీఆర్ఎస్ ఏర్పడిన నాటి నుంచి తెలంగాణ ఏర్పడే సమయం వరకు కోదండరాం కు , బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు చిన్న చిన్న అభిప్రాయబేధాలు ఉన్నా సన్నిహిత సంబంధాలు ఉండేవి.రాష్ట్ర ఆవిర్భావం తర్వాత టీఆర్ఎస్ (ఇప్పటి బీఆర్ఎస్) విధానాలతో విభేదించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వ నిర్ణయాలపై కోదండరాం గళమెత్తడం షురు చేశారు. ముఖ్యంగా నిరుద్యోగ అంశం, రైతుల అంశాలపై పోరటాలకు పిలుపు నిచ్చారు. ఆ తర్వాత తానే స్వయంగా కేసీఆర్ పై పోరాటం కోసం ప్రత్యేకంగా తెలంగాణ జన సమితి అనే రాజకీయ పార్టీనీ కూడా స్థాపించారు. పార్టీ పెద్దగా జనాల్లోకి వెళ్లలేదు. నామా మాత్రంగానే పార్టీ కొనసాగింది. జనసమితి తరుపున ఎన్నికల్లో పోటీ చేసిన ఘోర పరాభవాన్ని చూసింది. స్వయంగా కోదండరాం కూడా ఎన్నికల్లో ఓటమి చెందడం అప్పట్లో పెద్ద ఎత్తున చర్చ జరిగింది.తెలంగాణలో కేసీఆర్ నాయకత్వంలో టీఆర్ఎస్ ప్రభుత్వం రెండో పర్యాయం అధికారంలో వచ్చినా కోదండరాం మాత్రం తన ఉద్యమ పంథాను వీడలేదు. సందర్భం దొరికినప్పుడల్లా కేసీఆర్ ప్రభుత్వంపై విరుచుకుపడేవారు. అదే సమయంలో కేసీఆర్ సర్కార్ కూడా కోదండరాంను తీవ్ర నిర్బంధాలకు గురి చేసింది. కోదండరాం ను బయటకు వెళ్లకుండా తీవ్రంగానే కట్టడి చేసింది. కోదండరామ్ పై అనుక్షణం నిఘా కూడా ఉంచింది. కొన్ని సందర్భాల్లో కోదండరామ్ ను హౌస్ అరెస్ట్ చేయడమే కాకుండా ఇంటి లోపల ఉన్న కోదండరామ్ ఇంటి తలుపులు బద్దలు కొట్టీ మరీ అరెస్ట్ చేసిన నేపథ్యం ఉంది. ఐనా కోదండరాం మాత్రం తన పోరాటాన్ని మాత్రం ఆపలేదు. ఇలా కేసీఆర్,కోదండరామ్ మధ్య రాజకీయంగా ,వ్యక్తిగతంగా పూడ్చులేని అగాధం ఏర్పర్చింది.

ఎమ్మెల్సీగా పదవీ బాధ్యతలు

అయితే, కేసీఆర్ కు వ్యతిరేకంగా పోరాడుతున్న కోదండరాం కాంగ్రెస్ కు దగ్గరయ్యారు. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కోదండరామ్ ఆధ్వర్యంలోని జనసమితి కాంగ్రెస్ రెండు కలిసి ఒక అవగాహనతో ఎన్నికల్లో పోటీ చేశాయి.అంతే కాదు ఎన్నికల్లో ఘన విజయం సాధించాయి. కాంగ్రెస్ గెలుపుతో కోదండరాంకు మంచి అవకాశం వస్తుందని అందరూ భావించారు. అందరూ అనుకున్నట్లుగానే కోదండరాం ను గవర్నర్ కోటా రేవంత్ సర్కార్ ఎమ్మెల్సీగా నామినేట్ చేసింది. కానీ కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఎమ్మెల్సీగా పదవీ బాధ్యతలు చేపట్టే అవకాశం ఆలస్యమైంది. కోదండరాం ఎమ్మెల్సీగా ఈ మధ్యనే ప్రమాణ స్వీకారం చేశారు. బాధ్యతలు స్వీకరించారు. ప్రొఫెసర్ కోదండరాం రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల తర్వాత తొలిసారిగా చట్టసభలోకి ప్రవేశించారు. అక్కడ కూడా తన ప్రత్యేకతను, ఆదర్శాలను ఆయన నిరూపించుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ గవర్నర్ కోటాలో నియమించడంతో ఎమ్మెల్సీ అయిన కోదండరాం తనకు ప్రభుత్వం కల్పించే వ్యక్తిగత భద్రత ఏర్పాట్లు ఏవి వద్దని కుండబద్దలు కొట్టి చెప్పారు.తాను ప్రజల మనిషిని అని ప్రజల మధ్య తిరుగాడే వ్యక్తినని ప్రజలకు తనకు మధ్య దూరం పెంచేలాగా వ్యక్తిగత భద్రతా సిబ్బంది ఉండడం తగదని ఆయన చెప్పుకొచ్చారు. ప్రజలు తన వద్దకు వచ్చి వినతి పత్రాలు ఇవ్వదలుచుకుంటే ఈ వ్యక్తిగత భద్రతా సిబ్బంది అడ్డంగా ఉంటారని కూడా ప్రొఫెసర్ కోదండరాం చెప్పారు.ఇలాంటి మాట చెప్పగల నాయకుడు మరొకరు మనకు ఉన్నారా అనిపిస్తుంది? ప్రభుత్వం ఏర్పాటు చేసిన సెక్యూరిటీని వద్దని తిప్పి పంపడం ప్రొఫెసర్ కోదండరాం ప్రజా నాయకులకు చూపిస్తున్న ఆదర్శ మార్గంగా మనం భావించవచ్చు.నిజాయితీ పరుడు, నిరాడంబరుడు, నిగర్వి, నిఖార్సయిన తెలంగాణ వాది.. ప్రజానేత కోదండరాం సార్ కి విశ్వంభర తెలుగు దినప్రతిక పుట్టినరోజు సందర్భంగా అభినందనలు తెలుపుతోంది..

-పి.వెంకటరమణ గుప్త,
న్యూస్ నెట్వర్క్ (విశ్వంభర)
సెల్: 9550839444

ఆచార్యదేవోభవ!

***నేడు ఉపాధ్యాయ దినోత్సవం**

దేశ భవిష్యత్తును తరగతి గది నాలుగ్గోడల మధ్య నిర్మించి, శిష్యులు హిమాలయాలంత ఉన్నతంగా ఎదిగి, ఆకాశయానంలో అంతరిక్షాన్ని పరిశోధించినా, తరగతి గదిలో నుండి తొంగి చూస్తూ నిత్య విద్యార్థిగా ఉండే మహనీయుడే ఉపాధ్యాయుడు.దేవుడు-గురువు ఇద్దరూ ఒకేసారి ప్రత్యక్షమైతే నేను గురువుకే పాదాభివందనం చేస్తాననడం ఉపాధ్యాయునికిచ్చే గౌరవం. ఆ గౌరవాన్ని నేడు ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకునే సర్వేపల్లి రాధాకృష్ణన్ కు ఇవ్వడమే మనం ఉపాధ్యాయులందరికీ ఇచ్చే నిజమైన గౌరవం. ఒక తత్వశాస్త్ర ఉపాధ్యాయుడు బదిలీపై తమ స్థానం నుండి (మైసూరు విశ్వవిద్యాలయం నుండి) కలకత్తా విశ్వవిద్యాలయంలో బోధించడానికి వెళ్తున్నారు. తన ప్రియతమ విద్యార్థులందరూ కన్నీటి పర్యంతమయ్యారు. తను ప్రయాణించే బగ్గీకి ఉన్న గుర్రాన్ని విదిలించి, తను ప్రయాణించాల్సిన గమ్యస్థానం వరకు తమ భుజస్కంధాలపై ఆ గుర్రపు బగ్గీని లాగి తమ గురుభక్తిని చాటుకున్నారు. ఆ గురువు పేరు సర్వేపల్లి రాధాకృష్ణన్,

సర్వేపల్లి రాధాకృష్ణన్ మద్రాసుకు 64 కి.మీ. దూరంలోని తిరుత్తణిలో వీరాస్వామి, సీతమ్మలకు 1888 సెప్టెంబరు 5వ తేదీన జన్మించారు. చిన్నప్పటి నుండే విద్యాసక్తిని కల్గి ఉన్న రాధాకృష్ణన్ ప్రాథమిక విద్యను తిరుపతి, తిరుత్తణి, నెల్లూరులలో పూర్తి చేశారు. రాయవెల్లూరు అమెరికన్ మిషనరీ కాలేజీలో బి.ఎ, ఎం.ఎ, ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. 21 సంవత్సరాలకే మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో ప్రొఫెసర్ గా తత్వశాస్త్రంలో ప్రతిభచూపే, మైసూరువిశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్గా, కలకత్తా విశ్వవిద్యాలయంలో, ఆచార్యునిగా డాక్టర్ అశుతోష్ ముఖర్జీ, రవీంద్రనాథ్ ఠాగూర్ల కోరిక మేరకు చేరారు. అనతికాలంలోనే విద్యార్థులతో మమేకమైపోయారు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే రాధాకృష్ణన్ తరగతిలో బోధిస్తున్నప్పుడు, ఇతర తరగతుల విద్యార్థులందరూ తమకు సంబంధించింది కాకపోయినా వచ్చి కూర్చుని క్లాసులు వినేవారు. 1931లో డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి తర్వాత ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ చేశారు. 1931లో ఆక్స్ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ప్రాచ్యమతాల గౌరవాధ్యక్షులుగా, చైనా, అమెరికాల్లో పర్యటించి ఎన్నో ప్రసంగాలు ఇచ్చారు. 1946లో భారత రాజ్యాంగ పరిషత్ సభ్యుడిగా ఉన్నాడు. 1947లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తేజితపూరిత ప్రసంగంతో భారతీయులలో ఆత్మవిశ్వాసం నింపారు. 1949లో ఉన్నత విద్యా సంస్కరణల కోసం రాధాకృష్ణన్ కమిటీ అధ్యక్షుడిగా,యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ అధ్యక్షుడిగా విద్యా బోధనలో సంస్కరణలు తెచ్చారు.1952 నుండి 1962 వరకు ఉపరాష్ట్రపతిగా ఉన్న రాధాకృష్ణన్ 19620 రాష్ట్రపతి అయ్యారు.అప్పుడు కొందరు శిష్యులు తన పుట్టిన రోజును జరపాలని తన దగ్గరకు వస్తే,తన పుట్టిన రోజును 'ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకొంటే తనకు ఆదే సంతోషం అని చెప్పారు. అప్పటి నుండి అది అమలులోకి వచ్చింది.

ఒక ప్రెసిడెన్సీ పాఠశాల ఉపాధ్యాయుడిగా జీవితం ప్రారంభించిన ఒక వ్యక్తి, ఉపరాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా ఎన్నో బిరుదులు, సత్కారాలు, డాక్టరేట్లు పొంది చివరకు భారతరత్నగా అవతరించడమంటే అది విద్యకున్న గొప్పతనం, ఉపాధ్యాయుడిగా తనకున్న అపార విజ్ఞానం. అందుకే రాధాకృష్ణన్ రాష్ట్రపతిగా కన్నా ఉపాధ్యాయుడిగానే గర్వపడుతానన్నారు.

దురదృష్టవశాత్తు నేడు సమాజంలో విద్య వ్యాపారంగా మారిపోయింది. విద్యార్థులు ఉపాధ్యాయుల్ని గౌరవించే తీరుమారింది. మానవ విలువలు తగ్గిపోతున్నాయి. సమాజం బాగు పడాలంటే మళ్ళీ రాధాకృష్ణన్ పోషించిన పాత్రను ఉపాధ్యాయులు పోషించాలి. లేచింది మొదలు,చదువూ, ర్యాంకులు, ఐఐటి, మెడిసిన్, తప్ప మరో మాట లేదు,ఈ పద్ధతి మారాలి. ఉపాధ్యాయులు విలువల్ని చిన్నతనం నుండి తరగతి గదిలో నేర్పాలి.ఒక ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలి. తద్వారా విద్యార్థుల జీవితాల్లో దేశ అభివృద్ధిలో వెలుగులు నింపే కలల్ని నిజం చేయాలి. ఫొటోలు -క్లిప్పింగులు- జోడించి ఉత్తమ ఉపాధ్యాయులుగా చలామణి అయినంతకాలం విద్య కూడా వ్యాపారంతో పాటు రాజకీయం కూడా అవుతుంది. నిజాయితీగా ఆత్మసాక్షిగా విద్యార్థుల భవిష్యత్ కోసం జీవితాల్ని త్యాగం చేసిన ఉపాధ్యాయులు ఉన్నారు. నేటి విద్యాతరానికి ఉపాధ్యాయుడు చేసే మేలు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం కాకుండా ఉత్తమ సమాజ నిర్మాణం కోసం చేసినప్పుడే సమాజం పురోగమిస్తుంది. అదే మనం రాధాకృష్ణన్కు ఇచ్చే నిజమైన గౌరవం.

-డాక్టర్ మెంతబోయిన సైదులు
-9010910956

జ్యోతిశ్శాస్త్ర ఘనాపాఠి భమిడిపాటి

“ కాలచక్రంతో పాటు గ్రహగతులనూ, జ్యోతిశ్శాస్త్రాన్నీ కూలంకషంగా అధ్యయనం చేసి అక్షరాలకూ, సంఖ్యలకూ బ్రహ్మముడులు వేస్తూ ఒక వ్యక్తి పేరులోంచి వారు పుట్టిన సమయాన్ని వెలికి తీసేందుకు తెలుగు భాషలోని అసంఖ్యాక గుణింతాలతో కూడిన ఒక నిర్దిష్ట సూత్రం రూపొందించి దాని ఆధారంగా జాతకాలను అధ్యయనం చేస్తూ జ్యోతి శ్శాస్త్రంలో ఓ వినూత్న ధోరణిని ప్రవేశపెట్టి ఆ శాస్త్రం విలువను ప్రపంచానికి అందిస్తూ ఎందరికో భవిష్యన్మార్గదర్శకం చేసింది ఒక ఆంధ్రుడేనే విషయం చాలా మందికి తెలియదు.అప్పటి వరకూ అనుసరిస్తున్న గణన పద్ధతిలో కచ్చితత్వం సరిగా లేక, లోప భూయిష్టమై, తప్పుల తడకలతో నడకలు సాగిస్తున్న ప్రపంచ కాలచక్ర గతులు సరిచేసే నిమిత్తం 45 బి.సి నుంచి 5,555 ఎ.డి వరకూ ఆంగ్ల క్యాలెండర్ను సరిదిద్ది సరికొత్త భమిడిపాటి కేలెండర్ను రూపొందించిన మేటి విజ్ఞానవేత్త మన తెలుగుబిడ్డ కావడం నిజంగా గర్వకారణం.

6 వేల సంవత్సరాల క్యాలెండర్ రూపకర్త...150 చిత్రాల కథా రచయిత

సూర్యుని చుట్టూ భూమి చేసే భ్రమణానికి పట్టే సమయం 365.25 రోజులంటూ ప్రపంచం అప్పటి వరకూ నమ్ముతున్న సూత్రాలను తిరగరాసి, ఈ భ్రమణానికి 365.2422 రోజులు పడుతుందంటూ గణిత సూత్రాల ఆధారంగా కచ్చితంగా నిరూపించి నిర్ధారించిన మహా శాస్త్రవేత్త, సాటిలేని జ్యోతిశ్శాస్త్ర మేటి ఘనా పాటి భమిడిపాటి రాధాకృష్ణ. భాషా వ్యాకరణ, ఖగోళ, గణితశాస్త్ర సూత్రాలతో అనుసంధానమై నిర్దిష్ట ఫలితాలను నిక్కచ్చిగా అందించే విజ్ఞాన గని అని నిరూపించి, తన వాస్తవిక దృక్పథాన్ని నిరూపించు కున్న వ్యక్తిత్వం ఆయన సొంతం. రాధాకృష్ణ వ్యాకరణ, ఖగోళ, గణిత శాస్త్రాలను అనుసంధానించి అధ్యయనం చేయడం ద్వారా జ్యోతిశ్శాస్త్ర మూలాలను మర్ధించి అసామాన్య జ్యోతిశ్శాస్త్రవేత్తగా ప్రశంసా పాత్రులయ్యారు. జ్యోతిశ్శాస్త్రంలో పూర్వం నుంచీ ఉన్న ఆ శాస్త్ర గ్రంథాలైన సారావళి, బృహజ్జాతకం, పరాశర గ్రంథం, జాతక మార్తాండ, జాతక సర్వస్వం, జాతక చంద్రిక, కేరళీయం ఇత్యాది గ్రంథాల్లో నిర్దిష్ట అంశంపై పరస్పర విరుద్ధమైన ఫలితాలు పేర్కొనబడడం రాధాకృష్ణ గమనించారు. అనంతరం వాస్తవిక దక్పథంతో ఈ శాస్త్ర గ్రంథాల నిగ్గు తేల్చేందుకు 40 ఏళ్ల పైబడిన వారికి చెందిన 2,600 జాతకాలు, 72 మంది కవలల జాతకాలు సేకరించి పరిశోధించారు. ప్రస్తుతం వాడుకలో ఉన్న ఇంగ్లీషు కాలెండర్లో తప్పు ఉందని రుజువు చేసి, దానిని సరి చేసుకొనే విధానాన్ని సూచిస్తూ 1990లో "ది భమిడిపాటి కేలెండర్"ను ఆంగ్లంలో పుస్తక రూపంలో ప్రచురించారు. జపాన్, లండన్ లాంటి విదేశాల్లో ఈ క్యాలెండర్ విడుదలై, విక్రయమై సంచలనం సష్టించింది. ప్రపంచంలో ఇటువంటి ప్రయత్నం ఇదే తొలిసారి కాగా అయన అపూర్వ కృషి... విజ్ఞులు, విమర్శకుల మన్ననలందుకుంది. ఇది ఆంధ్రులందరికీ గర్వకారణం.

తన మరణాన్ని సూచించేలా అన్యాపదేశంగా సెప్టెంబర్ 4వ తేదీన ఈ లోకాన్ని వదులుతానని ముందుగానే తన డైరీలో రాసుకున్న రాధాకృష్ణ రాతలు ఆయన నుదుటి మీద గీతలేనన్న వాస్తవాన్ని ఎవరూ ఊహించ లేకపోవడం గమనార్హం.

భమిడిపాటి రాధాకృష్ణ 24-11-1929 వ తేదీన రాజమండ్రిలో జన్మించారు. అక్కడే శ్రీ వీరేశలింగం ఉన్నత పాఠశాల లోను, తరువాత రాజమండ్రి ఆర్ట్స్ కళాశాలలోను విద్యాభ్యాసం చేసి, 1949లో బీ.ఎస్సీ పట్టభద్రు లయ్యారు. తండ్రి శ్రీ కామేశ్వరరావు ఖ్యాతిగాంచిన హాస్య రచయిత కాగా... ఆయన రచనాభినివేశాన్ని తన జీన్స్లోనూ జీర్ణించుకున్నారు రాధాకృష్ణ. భమిడిపాటి రాధాకృష్ణ (నవంబరు 24, 1929 - సెప్టెంబరు 4, 2007) లబ్ధ ప్రతిష్ఠులైన నాటక, సినీ కథా రచయిత, జ్యోతిష శాస్త్ర పండితుడు, సంఖ్యాశాస్త్ర నిపుణుడు. అయన హాస్య రచయిత. "హాస్య బ్రహ్మ" భమిడిపాటి కామేశ్వరరావు కుమారుడు.

బహుముఖ ప్రజ్ఞాశాలి...

రాధాకృష్ణ బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన మొదటి రచన భజంత్రీలు నాటిక. దీన్ని మొదటిసారిగా 25-2-1950 వ తేదీన రాజమండ్రిలో ఆర్ట్స్ కాలేజి పూర్వ విద్యార్థి వార్షికోత్సవ సందర్భంలో ప్రదర్శించారు. అయన 3 నాటకాలు, 6 నాటికలు రచించగా ప్రతీ ఒక్కటీ వెయ్యి ప్రదర్శనలకి పైగా ప్రదర్శితమై నాటకరంగ ఖ్యాతిని ఇనుమడింప చేశాయి. అవి కన్నడ, తమిళ, హిందీ భాషల్లోకి అనువాదం అయినాయి. "ఇదేమిటి, కీర్తిశేషులు, మన స్తత్వాలు, భజంత్రీలు, దంత వేదాంతం" వంటి నాటికలు, నాటకాలు వ్రాశారు.

సినీ రంగంలోనూ తనదైన ముద్ర

రావుగోపాల రావు 'కీర్తిశేషులు' లోని ఒక పాత్ర ధరించడం ద్వారా గుర్తింపు తెచ్చుకుని రాధాకృష్ణ సినీ పరిశ్రమలోనూ అడుగు పెట్టారు..28-1-1952న రాజమండ్రిలో జరిగిన సన్మాన సభలో, ఆ సభకి అధ్యక్షత వహించిన అక్కినేని నాగేశ్వర రావు ఆధ్వర్యాన, రాధాకృష్ణకు "దృశ్య కావ్య ధురీణ" అనే గౌరవ పురస్కారం జరిపారు. నిర్మాత దుక్కిపాటి మధుసూదన రావు ప్రోద్భలంతో సినీ రంగంలోకి ప్రవేశించి 150 సినిమాలకు కథలందించారు. ఇందులో కె.విశ్వనాథ్ తొలి చిత్రమైన "ఆత్మగౌరవం" కూడా ఉంది. బ్రహ్మచారి, కథానాయకుడు, కీర్తిశేషులు, మరపురాని కథ, విచిత్ర కుటుంబం, పల్లెటూరి బావ, ఎదురులేని మనిషి, గోవుల గోపన్న, సీతారామ కళ్యాణం, నారీనారీ నడుమ మురారి, కాలేజీ బుల్లోడు వంటి వాటితో సహా తెలుగు పలు చిత్రాలకు కథలు వ్రాశారు. ఎన్టీఆర్, ఏఎన్నార్ లకు ఆయన సన్నిహితులు. 1994 తర్వాత క్రమంగా ఆయన సినిమా రంగానికి దూరమయ్యారు. తనకు ఎంతో ఇష్టమైన గణిత రంగంపై మక్కువ చూపారు. భమిడిపాటి రాధాకృష్ణ క్యాలెండర్ పేరిట క్రీస్తుపూర్వం 45 నుంచి క్రీస్తుశకం 5555 వరకు అంటే ఆరు వేల సంవత్సరాల క్యాలెండర్ రూపొందించారు. జ్యోతిష రంగంలో కూడా ఆయనకు పట్టు ఉంది. సంఖ్యాశాస్త్ర పరంగానే కాకుండా చిన్నారుల నామకరణ సమయంలో బియ్యంలో రాసే అక్షరాలను బట్టి కూడా ఆయన జాతకాలు చెబుతారనే పేరు సంపాదించు కున్నారు. ఆయన 79 సంవత్సరాల వయస్సులో రాజమండ్రిలో మరణించారు. భజంత్రీలు, దంత వేదాంతం; కీర్తిశేషులు; మన స్థత్వాలు; తరం-అంతరం; తదితర నాటకాలను ఆయన రచించారు. ఆత్మ గౌరవం (1965) (డైలాగ్స్ రచయిత); మరపురాని కథ (1967); కథానాయకుడు (1969); అల్లుడే మేనల్లుడు (1970); ఆడ జన్మ (1970); బొమ్మా బొరుసా (1971); రామ రాజ్యం (1973); ఆడపిల్లల తండ్రి (1974); అల్లుడొచ్చాడు (1976); పొగరు బోతు (1976); మనిషి రోడ్డున పడ్డాడు (1976);సాహస వంతుడు (1978); షోకిల్లా రాయుడు (1979); నారి నారి నడుమ మురారి తదితర చిత్రాలకు సంభాషణలు రాశారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

అమెరికాలో రోడ్డు ప్రమాదం..

హ్యూస్టన్/హైదరాబాద్: అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో గత శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన నలుగురిని భారతీయులుగా పోలీసులు గుర్తించారు. డల్లాస్ సమీపంలో ఓ హైవేపై ఆగి ఉన్న ఎస్‌యూవీని వెనుక నుంచి వేగంగా వచ్చిన ట్రక్కు ఢీకొట్టింది. దీంతో కారు పూర్తిగా మంటల్లో దగ్ధమైపోయింది. ఘటన జరిగినప్పుడు కారులో ఉన్న నలుగురు మరణించారు. వీరి మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయి. దీంతో డీఎన్ఏ, ఇతర ఆధారాల ద్వారా నాలుగు రోజులకు పోలీసులు మృతులను గుర్తించారు. హైదరాబాద్‌కు చెందిన ఆర్యన్ రఘునాథ్ ఒరంపట్టి, ఫరూఖ్ షేక్, లోకేశ్ పలచర్ల, తమిళనాడుకు చెందిన దర్శిని వాసుదేవ్ ఈ ప్రమాదంలో మరణించినట్టు కొల్లిన్ కౌంటీ షెరిఫ్ కార్యాలయం ధ్రువీకరించింది. కార్‌పూలింగ్ యాప్ ద్వారా వీరు ప్రమాదం జరిగిన కారు ఎక్కినట్టు తెలుస్తున్నది.బెంటన్‌విల్లేకు వెళ్లేందుకు శుక్రవారం కార్‌పూలింగ్ యాప్ ద్వారా రైడ్ బుక్ చేసుకున్న నలుగురు భారతీయులు ఒకే క్యాబ్‌లో ప్రయాణించారు. ఒక లారీ వేగాన్ని కంట్రోల్ చేసుకోలేక ముందున్న వారి ఎస్‌యూవీని ఢీకొట్టింది. ముందున్న వాహనాలను ఆ కారు ఢీకొనడంతో మంటలు చెలరేగాయి. నలుగురు భారతీయులు ఆ కారులో చిక్కుకుని కాలి మరణించారు.ఆర్యన్, ఫరూఖ్ ఇటీవలే టెక్సాస్ యూనివర్సిటీలో ఎంఎస్ పూర్తి చేసుకున్నారు.బెంటన్‌విల్లేలో నివసిస్తున్న ఆర్యన్, స్నేహితుడు ఫరూక్ షేక్‌తో కలిసి డల్లాస్‌లోని బంధువు ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదంలో వారిద్దరూ మరణించాడు. ఆర్యన్ తండ్రి సుభాష్ చంద్రారెడ్డికి హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో మ్యాక్స్ అగ్రి జెనెటిక్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ ఉంది. రాయచోటికి చెందిన ఈ కుటుంబం హైదరాబాద్‌లోని నిజాంపేటలో స్థిరపడింది. లోకేశ్ చదువు పూర్తి చేసుకొని ఉద్యోగం చేస్తున్నాడు. భార్యను కలిసేందుకు బెంటన్‌విల్లేకు వెళ్తున్న లోకేష్ ఈ ప్రమాదంలో చనిపోయాడు. అలాగే ఆర్లింగ్టన్‌లోని టెక్సాస్ విశ్వవిద్యాలయంలో మాస్టర్స్ గ్రాడ్యుయేట్ అయిన తమిళనాడుకు చెందిన దర్శిని తన బంధువును కలిసేందుకు బెంటన్‌విల్లేకు వెళ్తూ ఈ ప్రమాదంలో మరణించింది. వీరి మరణ వార్త తెలియడంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొన్నది. తమ వారి మృతదేహాలను భారత్‌కు రప్పించేందుకు చొరవ చూపాలని బాధిత కుటుంబాలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరాయి.మృతదేహాలను గుర్తించలేనంతగా కాలిపోయారు. డీఎన్ఏ పరీక్ష ద్వారా మృతదేహాలను గుర్తించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

కేటీఆర్ సంతాపం..

అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తెలంగాణ యువకులు, తమిళనాడుకు చెందిన యువతి మరణించడంపై కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఆర్యన్ రఘునాథ్, ఫరూక్ షేక్, లోకేశ్ పాలచర్ల, దర్శిని వాసుదేవన్ (తమిళనాడు) మరణవార్త తనను ఎంతగానో బాధించిందని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వరద ప్రాంతాల్లో ఏరియల్ సర్వే చేయనున్న కేంద్ర బృందం

కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డిల వినతి

సానుకూలంగా స్పందించిన హోంమంత్రి అమిత్ షా

విశ్వంభర ,తెలంగాణ బ్యూరో : భారీ వర్షాలతో ఏపీ, తెలంగాణలో భారీగా నష్టం వాటిల్లిన నేపథ్యంలో వెంటనే ఏరియల్ సర్వే చేయించాలని కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి.. కేంద్ర హోం మంత్రి అమిత్ షా దృష్టికి తెచ్చారు. దీనిపై అమిత్ షా సానుకూలంగా స్పందించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఏరియల్ సర్వేకు కేంద్రం సిద్ధమైంది. అధికారికంగా కేంద్రం ఉత్తర్వులు జారీ కానున్నట్లు తెలుస్తోంది. కేంద్ర మంత్రి ఆధ్వర్యంలోని ఉన్నతాధికారుల బృందం తెలుగు రాష్ట్రాల్లోని దెబ్బతిన్న ప్రాంతాల్లో ఏరియల్ సర్వే చేయనుంది.

వరద నష్టంపై తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర హోంశాఖ లేఖ

తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కేంద్ర హోంశాఖ లేఖ రాసింది. తెలంగాణలో వరద నష్టం వివరాలు నిర్ణీత ఫార్మాట్లో తక్షణమే పంపాలని కేంద్ర హోమ్ శాఖ సూచించింది. 1345 కోట్ల రూపాయల ఎస్‌డీఆర్ఎఫ్ నిధులు ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్నాయని కేంద్రం వెల్లడించింది. వరదల్లో సాయం చేసినందుకు ఇప్పటికే 12 ఎన్‌డీఆర్ఎఫ్ దళాలు, రెండు హెలికాప్టర్లు పంపించినట్లు కేంద్ర హోం శాఖ వెల్లడించింది. ఎస్డీఆర్ఎఫ్ నిధికి కేంద్రం వాటా నిధుల విడుదలకు తక్షణమే వివరాలు పంపాలని కేంద్రం ఆదేశించింది. జూన్‌లో 208 కోట్ల రూపాయల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి వినతి రాలేదని ఈ సందర్భంగా కేంద్రం తెలిపింది. ఇది వరకు ఖర్చు చేసిన వాటి యుటీలైజేషన్ సర్టిఫికెట్స్, వరద నష్టం వివరాలు పంపాలని కోరింది. వరద నష్టం వివరాలను ఎప్పటికప్పుడు రోజువారీగా పంపాలని తెలంగాణ ప్రభుత్వం ప్రధాన కార్యదర్శికి రాసిన లేఖలో కేంద్ర హోంశాఖ కోరింది.

ఎమ్మెల్యేలు పార్టీ మారితే పెన్షన్ కట్..!

శిమ్లా: పార్టీ ఫిరాయింపులపై హిమాచల్ ప్రదేశ్ లోని కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీలు మారిన ఎమ్మెల్యేలకు పెన్షన్ సదుపాయాన్ని నిలిపివేయనుంది. దీనికి సంబంధించిను సవరణ బిల్లుకు రాష్ట్ర శాసనసభ బుధవారం ఆమోదం తెలిపింది. ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటును ఎదుర్కొన్న ఎమ్మెల్యేలకు ఈ కొత్త నిబంధన వర్తించనుంది.ఫిరాయింపులను అరికట్టేందుకు హిమాచల్ ప్రదేశ్ శాసనసభ (సభ్యుల పించన్లు, అలవెన్సులు) సవరణ బిల్లు - 2024ను రాష్ట్ర ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. దీనిపై సుదీర్ఘంగా చర్చించిన అనంతరం బుధవారం ఓటింగ్ నిర్వహించి ఈ బిల్లును శాసనసభ ఆమోదించింది. "ఏదైనా ఒక సమయంలో ఫిరాయింపు నిరోధక చట్టం కింద అనర్హత వేటును ఎదుర్కొన్న శాసనసభ్యులు ఇకపై పింఛను పొందే వెసులుబాటు ఉండదు" అని ఈ బిల్లులో పేర్కొన్నారు.హిమాచల్ ప్రదేశ్ చట్టాల ప్రకారం.. ఐదేళ్ల కాలం పాటు ఎమ్మెల్యేగా పనిచేసిన శాసనసభ్యులకు నెలకు రూ.36వేల పింఛను ఇస్తున్నారు. ఐదేళ్లకు మించి పదవీకాలం ఉన్న ఎమ్మెల్యేలకు ప్రతి ఏడాదికి రూ.వెయ్యి చొప్పున అదనంగా పెన్షన్ అందజేస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన రాజ్యసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ కు చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు బీజేపీ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేశారు. ఆ తర్వాత బడ్జెట్ సమావేశాల సమయంలోనూ పార్టీ విప్పు కాదని వీరు సభలకు హాజరుకాలేదు. దీంతో పార్టీ ఫిరాయింపుల చట్టం కింద వారిపై అనర్హత వేటు పడింది. అనంతరం జరిగిన ఉప ఎన్నికల్లో వీరిలో ఇద్దరు మళ్లీ విజయం సాధించి సభలో అడుగుపెట్టారు. మిగతా నలుగురు ఓటమిపాలయ్యారు.

ఉప్పొంగుతున్న గోదావరి

(మొదటి పేజీ తరువాయి)

4గంటలకు 44.1 అడుగుల నీటిమట్టం నమోదైంది. దీంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ ప్రకటించారు. మత్స్యకారులు, పడవలు నడిపేవారు వాగులు వంకల వద్దకు వెళ్లవద్దని సూచించారు. భద్రాచలం వద్ద గోదావరి కరకట్టపై రాకపోకలు నిలిపివేశారు. ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు ఇంకా వస్తున్నందున భద్రాచలం వద్ద నీటిమట్టం పెరుగుతుందని కేంద్ర జలవనరులశాఖ అధికారులు చెబుతున్నారు. భద్రాచలం వద్ద నీటిమట్టం పెరగడంతో స్నానగట్టాల ప్రాంతంలోని చాలా మెట్లు వరద నీటిలో మునిగిపోయాయి. ఇంకా నీటిమట్టం పెరిగితే రహదారులపైకి వరద నీరు చేరే అవకాశం ఉంది.

మంథని వద్ద గోదావరి ఉగ్రరూపం

పెద్దపల్లి జిల్లా మంథని మండలం సిరిపురం వద్ద నిర్మించిన పార్వతి బ్యారేజ్‌కు నాలుగు రోజులుగా ఇన్‌ఫ్లో పెరుగుతోంది. మంథని గుండా ప్రవహించే గోదావరి నది, బొక్కల వాగు, నల్ల వాగుల నుంచి వస్తున్న ప్రవాహంతో సమీపంలోని పంట పొలాలు నీట మునిగిపోయాయి. గోదావరి, బొక్కల వాగులు ప్రమాదకర స్థితిలో ప్రవహిస్తున్నాయి. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో పాటు, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి కూడా నీటిని భారీగా విడుదల చేయడంతో సిరిపురం వద్ద నిర్మించిన పార్వతి బ్యారేజ్‌కు 4,24,915 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. దీంతో అప్రమత్తమైన అధికారులు ప్రాజెక్టు 74 గేట్లు ఎత్తిపెట్టి వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు విడుదల చేస్తున్నారు. మంథని వద్ద పుష్కర ఘాట్లను తాకుతూ ప్రవాహం కొనసాగుతోంది. మండలంలోని పోతారం, ఖానాపూర్, అమ్మగారి పల్లి కాన్సాయిపేటలో వందలాది ఎకరాల్లో పంట పొలాలు గత మూడు రోజులుగా వరదనీటిలో ఉండిపోయాయి. కమాన్‌పూర్ మండల కేంద్రంలోని గుండారం చెరువు మత్తడి పోస్తోంది.

మంథని వద్ద గోదావరిని పరిశీలించిన మంత్రి శ్రీధర్ బాబు

సుందిళ్ల బ్యారేజ్ నుండి నీటిని కిందికి వదలడంతో పశువుల కాపర్లు, చేపలు పట్టేవారు గోదావరిలోకి వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఉదయం మంథని వద్ద గోదావరి ఉధృతిని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పరిశీలించారు.ఎలాంటి ప్రాణనష్టం, పంటనష్టం జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కట్టలు బలహీనంగా ఉన్న చెరువులపై దృష్టి ఉంచాలని కల్వర్టులను తనిఖీ చేయాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో ఇటీవల కురిసిన వర్షాలతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రాజెక్టులకు ఎగువ నుంచి వరద నీరు వచ్చి చేరుతోంది. వరదల కారణంగా పలు ప్రాంతాల్లో జనజీవనం అస్తవ్యస్తమైంది. జనావాసాల్లోకి వరదనీరు చేరి ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు.

కేసీఆర్ లాగా విదేశీ కుట్ర అనలేదు.. ఫామ్ హౌస్ లో కూర్చోలేదు

విశ్వంభర, హైదరాబాదు : ఆనాడు 2022 లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వచ్చిన భారీ వర్షాలు, వరదలు నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి వారి వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికి వర్షాలు క్లౌడ్-బరస్ట్, విదేశీ కుట్ర అంటూ మతిలేని ప్రకటనలు చేసిన బీఆర్ఎస్ నాయకులకు ఇప్పుడు తమ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక అర్హత ఎక్కడిదని రెవెన్యూ శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రశ్నించారు. విదేశీ కుట్ర అని ఫార్మ్ హౌస్ దాటని బీఆర్ఎస్ పార్టీ పెద్దలు ఈరోజు వరదల గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఆనాడు ప్రకృతిపరంగా కురిసిన వర్షాలను కూడా కుట్రకోణంలో చూసిన ఆ పెద్దమనిషి, ఆయన అల్లుడు హరీశ్‌రావు కూడా ఇప్పుడు వచ్చిన వర్షాలను కుట్ర కోణంలోనే చూస్తున్నారా అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. వరదలపై మంగళవారం ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ నేత మాజీ మంత్రి హరీష్ రావు చేసిన వ్యాఖ్యలను రెవెన్యూ శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. “వరదల్లో కారు కొట్టుకుపోయి చనిపోయిన సైంటిస్టు నునావత్ అశ్విని కుటుంబాన్ని మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి క్యాబినెట్ సహచర మంత్రులం పరామర్శించి, భరోసా కల్పించాం. కనీసం చనిపోయిన కుటుంబాలను పరామర్శించాలన్న సోయి కూడా బీఆర్ఎస్ పెద్దలకు లేకపోవడం దురదృష్టకరం. జైలు నుండి వచ్చిన బిడ్డను ఆశీర్వదించడానికి ప్రతిపక్ష నేత కేసీఆర్ కు సమయం ఉంటుంది కానీ, వరద కష్టాల్లో ఉన్న ప్రజలను పరామర్శించడానికి గడప దాటడం లేదు. పదేండ్ల పాలన అనుభవంతో ప్రతిపక్ష నేత కేసీఆర్ ఒక సలహానైనా, సూచననైనా చేస్తారని భావించామని, కానీ ఆయన పెదవి కూడా విప్పకపోవడం దురదృష్టకరం. ఇంకా ఆయన కుమారుడు కేటీఆర్ అమెరికాలో ఉండి, ఇక్కడ ఏమి జరుగుతుందో తెలియకుండా, అజ్ఞానంతో ఇష్టం వచ్చినట్లు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఆయన ఎందుకు అమెరికా వదిలి రావడం లేదు ? అధికార పార్టీని తిట్టడమే ప్రతిపక్ష పార్టీ పని అన్నట్టుగా మా మీద దాడి చేస్తున్నారు. ఓటు వేసిన వేలుకు సిరా చుక్క కూడా తొలిగిపోయిందో లేదో అప్పటినుంచే దాడి మొదలుపెట్టారు. పది సంవత్సరాలలో విపత్తుల నిర్వహణ (డిజాస్టర్ మేనేజ్మెంట్) విభాగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ఒక్క నాడైనా ప్రకృతి విపత్తులమీద సమావేశం నిర్వహించారా ? దాన్ని బలోపేతం చేయాలన్న ఆలోచన చేశారా ? దాన్ని బలోపేతం చేసి ఉంటే ఈరోజు ఈ పరిస్థితి వచ్చేదా? కొంతలో కొంతైనా ముప్పు తగ్గేది కదా ! ముఖ్యంగా ఖమ్మంజిల్లాకు సంబంధించి నాతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అందరం కలిసి సమన్వయంతో పని చేయడం వల్లే ప్రాణ నష్టాన్ని, కనిష్ట స్థాయికి తగ్గించగలిగాం. ప్రజలను ఆదుకోవడానికి అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ, కోడి పిల్లలను కాపాడినట్టు జిల్లా ప్రజలను రక్షిస్తూ వచ్చాం. మరోవంక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా స్వయంగా ఖమ్మం జిల్లాలో పర్యటించి, పరిస్థితిని పూర్తిస్థాయిలో అంచనా వేసేందుకు అక్కడే రాత్రిపూట బసచేసి మరీ ప్రజలను ఆదుకున్నారు. ప్రజలకు తక్షణావసరాలను అందించారు. గతంలో ఖమ్మం జిల్లాలో వరదలు వస్తే పదివేలు చొప్పున సహాయం చేస్తామని చెప్పి చేతులెత్తేసినవారు ఇప్పుడు యాభై వేలు ఇవ్వాలని డిమాండ్ చేయడం విచిత్రంగా ఉంది. ఇదంతా ఇంకా ప్రజలు మరచిపోలేదు. బీఆర్ఎస్ బురద రాయకీయాలను మేము పట్టించుకోవడం లేదు. మాకు ప్రజలు ముఖ్యం. వారి రక్షణ ముఖ్యం. రాష్ట్రంలో చివరి బాధితుడికి కూడా ప్రభుత్వ సహాయం అందేటట్టు చూడటమే మాధ్యేయం" అని పొంగులేటి అన్నారు.

భారత్-బ్రూనై మధ్య నేరుగా విమాన సర్వీసులు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ప్రధాని మోదీ కీలక ప్రకటన చేశారు. త్వరలో ఇరు దేశాల మధ్య నేరుగా విమాన సర్వీసులను ప్రారంభించనున్నట్లు తెలిపారు.బుధవారం ఉదయం సుల్తాన్ అధికారిక నివాసం ఇస్తానా నురుల్ ఇమాన్కు చేరుకున్న ప్రధాని మోదీకి బోల్కియా , ఆయన కుటుంబ సభ్యులు ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు నేతలు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ.. "భారత యాక్ట్ ఈస్ట్ పాలసీ, ఇండో-పసిఫిక్ విజన్లో బ్రూనై మాకు ముఖ్య భాగస్వామి. ఇరు దేశాల సంస్కృతి, సంప్రదాయాలు, ప్రజల భావోద్వేగాలను పరస్పరం గౌరవించుకుంటాం. ఈ పర్యటనతో రెండు దేశాల మధ్య వ్యూహాత్మక, ద్వైపాక్షిక భాగస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని విశ్వసిస్తున్నా" అని మోదీ వెల్లడించారు. ఈ భేటీ సందర్భంగా ఇరు దేశాల మధ్య పలు ఒప్పందాలు జరిగినట్లు భారత విదేశాంగ శాఖ అధికారులు వెల్లడించారు. రెండు దేశాల మధ్య త్వరలోనే నేరుగా విమాన సర్వీసులను ప్రారంభించేందుకు అంగీకారం కుదిరినట్లు తెలిపారు. ఈ ఏడాది చివరి నాటికి చెన్నై నుంచి బ్రూనై రాజధానికి విమాన సర్వీసులను ప్రారంభించేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ద్వైపాక్షిక పర్యటన నిమిత్తం బ్రూనైకు భారత ప్రధాని వెళ్లడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక బంధానికి 40 ఏళ్లయిన సందర్భంగా మోదీ ఈ పర్యటన చేపట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. పర్యటనలో భాగంగా అక్కడి ప్రవాస భారతీయులతో ప్రధాని మంగళవారం ముచ్చటించారు. భారత హైకమిషన్ నూతన కార్యాలయ ప్రాంగణాన్ని మోదీ ప్రారంభించారు. బ్రూనై పర్యటన ముగించుకుని రెండు రోజుల పర్యటన నిమిత్తం సింగపూర్ వెళ్లారు.బుధవారం మధ్యాహ్నం సమయంలో సింగపూర్ ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ అయ్యారు. ఈ సందర్భంగా మోదీకి ఘన స్వాగతం లభించింది. ప్రవాస భారతీయులు మోదీకి గ్రాండ్ వెల్‌కమ్ పలికారు. మోదీకి ఓ మహిళ రాఖీ కూడా కట్టింది. ఈ సందర్భంగా అక్కడ బస చేస్తున్న హోటల్ వద్ద మోదీ ఢోలు వాయించారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.

హైడ్రా పేరుతో ఘరానా మోసం

హైడ్రా పేరుతో రూ: 20 లక్షలు చీటింగ్ చేసిన ఫిజియోథెరపీ డాక్టర్ బండ్ల విప్లవ్ సిన్హా..

విశ్వంభర న్యూస్ సంగారెడ్డి: డికాయ్ ఆపరేషన్‌లో నిందితున్ని రెడ్ హాండెడ్‌గా పట్టుకున్న సంగారెడ్డి జిల్లా పోలీసులు.. వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ రూపేష్. సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బండ్ల విప్లవ్ సిన్హా తండ్రి వీరయ్య, వయసు 42 సం, అమీన్ పూర్ మండలం, సంగారెడ్డి జిల్లాలో నివాసం ఉంటూ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ గా విధులు నిర్వహిస్తున్నారు.. ఇతని సొంత గ్రామం ఖమ్మం పట్టణం మరియు జిల్లా గత ఏడు సంవత్సరాలుగా అమీన్ పూర్ లో అద్దె ఇంట్లో నివాసం ఉండేవాడు. అమీన్ పూర్ చుట్టుపక్కల ఉండే వ్యక్తుల మాదిరిగా ఖరీదైన ఇళ్లలో ఉంటూ విలాసవంతమైన జీవితం గడపాలని నిర్ణయించుకుని, అమీన్ పూర్ చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలించగా ఇక్కడ ఎక్కువగా నాన్ లోకల్ వారు ఉండి మరియు ప్రభుత్వ స్థలాల్లో, మరియు బఫర్ జోన్ లలో అక్రమ ఇండ్ల నిర్మాణాలను చేపట్టడం గమనించి, వారిని ఎలాగైనా బెదిరిస్తే వారి వద్ద నుండి అధికంగా డబ్బులు వసూలు చేయవచ్చని నిర్ణయించుకొని అతని ఇంటికి సోషల్ వర్కర్ ఆక్టివిస్ట్ అని ఫ్లెక్సీ బోర్డు పెట్టుకున్నాడు. అప్పటినుండి చుట్టుపక్కల ప్రాంతాల్లో, చెరువులు, కుంటలకు ఆనుకొని మరియు ప్రభుత్వ స్థలంలో ఎవరైనా ఇల్లు కడితే అట్టి ఇంటి యజమానులు బిల్డర్ల వద్దకు వెళ్లి వారిని బెదిరించి, వారి గురించి పేపర్ లో రాయిస్తాను అని కలెక్టర్ రెవెన్యూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని బెదిరించి వారి వద్ద నుండి డబ్బులు వసూలు.చేయడం ప్రారంభించాడు. గత కొంతకాలంగా నిందితుడు బండ్ల విప్లవ్ సిన్హా నివాసం ఉండే సాయి విల్లాస్, ఫ్యూజన్ స్కూల్ వెనకాల అమీన్ పూర్ చెరువు నుండి వచ్చే నాళాకు అనుకొని ప్రాజెక్టు ఎల్.ఎల్.పి. పేరుతో ఒక పెద్ద నిర్మాణ సంస్థ విల్లా నిర్మాణాలు చేపట్టారు. అట్టి ప్రాజెక్టుకు వెళ్లేదారి అమీన్ పూర్ చెరువు మధ్యలో నుండి ఉంది. నిందితుడు అట్టి వ్యక్తుల వద్దకు వెళ్లి మీరు వేసిన రోడ్డు నాళా ప్రవాహానికి అడ్డు వస్తుంది, ఈ ప్రాజెక్టు అక్రమంగా నిర్మిస్తున్నారని చెప్పి వారిని ఇబ్బంది పెట్టడానికి ప్రయత్నించాడు. నాడు హైడ్రా కమిషనర్ రంగనాథ్ అమీన్ పూర్ కు వచ్చి వెళ్ళిన తరువాత ఆ రోజు రాత్రి నిందితుడు ప్రాజెక్టు ఎల్.ఎల్.పి. రాజేందర్ కు వాట్స్ ఆప్ కాల్ చేసి వారి ప్రాజెక్టు పక్కన గల ఇరిగేషన్ నాళ గురించి కలిసి మాటాడాలి అని అన్నాడు. దానికి అతను సరే అన్నాడు. 18తేదీన మధ్యాహ్నం పిస్తా హౌస్, అశోక్ నగర్ దగ్గర కలుద్దాం అని వాట్స్ ఆప్ ద్వారా మెసేజ్ చేశాడు. అతను దానికి అంగీకరించి ఆ రోజు కలవడం జరిగింది. అక్కడ నిందితుడు రంగనాథ్ సార్ తో దిగిన ఫోటోస్ చూపించి, రంగనాథ్ సారుకి చాలా దగ్గర అని, అమీన్ పూర్ గురించి ఏదైనా నన్నే అడుగుతాడు అని చెప్పి, ప్రాజెక్టు జోలికి రావోద్దు అంటే నాకు 20 లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేసి, చివరగా 16 లక్షలు ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేశాడు. దానికి వారికి అన్నీ రకాలుగా సహాయంగా ఉంటానని లేకపోతే రోజు న్యూస్ పేపర్ లలో తప్పుగా రాయిస్తానని బెదిరించాడు. ఆ తరువాత కూడా రెండు మూడు సార్లు వాట్స్ ఆప్ ద్వారా మెసేజ్‌లు చేశాడు. ఆ తరువాత మళ్ళీ 25తేదీన గచ్చిబౌలి టీఎన్జీవో కాలనీ నందు కలుద్దాం అనగా ఆరోజు అక్కడ అతను, పార్టనర్ తో వచ్చి కలిసాడు. ఆ రోజు అడిగిన డబ్బులు ఇవ్వకుంటే రోజు పేపర్ లో ప్రాజెక్టు గురించి అసత్య ప్రచారం చేయిస్తానని, అదే విధంగా హైడ్రాకు ఫిర్యాదు చేస్తానని, డబ్బులు ఇస్తే పేపర్ లో రాకుండా మరియు హైడ్రా ఏమి చేయకుండా చూసుకుంటనని బెదిరించాడు. 03 తేది రాజేంద్రనాథ్, మంజునాథ్ రెడ్డి మరియు మరొక ఇద్దరు కలిసి నిందితుడు బండ్ల విప్లవ్ సిన్హా ఇంటికి వచ్చి అతను అడిగిన డబ్బులలో రాజేంద్రనాథ్ 2 లక్షల రూపాయలను అడ్వాన్స్ గా ఇవ్వగా, డికాయ్ ఆపరేషన్ లో ఉన్న టాస్క్ ఫోర్స్, అమీన్ పూర్ పోలీస్ వారు అట్టి డబ్బుతో సహ నిందితున్ని పట్టుకొని, క్రైమ్ నెంబర్ 563/2024 సెక్షన్ 308 (5) బి.యన్.యస్. ఆక్ట్ ప్రకారం అమీన్ పూర్ పోలీసు స్టేషన్ నందు కేసు నమోదు చేసి, నిందితున్ని రిమాండ్ కు పంపించడం జరిగిందన్నారు. జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఎవరైనా హైడ్రా పేరుతో, బెదిరింపులకు పాల్పడితే అట్టి వ్యక్తుల గురించిన సమాచారాన్ని నేరుగా నా నెంబర్ 8712656777 కు ఫోన్ ద్వారా గాని వాట్స్ ఆప్ ద్వారా గాని సమాచారం అందించాలని, అట్టి వ్యక్తులపై చట్ట రిత్యా కఠిన చర్యలు తీసుకోవడం అన్ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ. ఎ.సంజీవరావ్, అమీన్ పూర్ ఇన్స్పెక్టర్ సదా నాగరాజు, సిసియస్ ఇన్స్పెక్టర్ మల్లేశం, యస్. బి. ఇన్స్పెక్టర్ విజయ్ కృష్ణ పాల్గొన్నారు.

డ్రైనేజీలకు పునరుద్ధరణకు నిధులు కేటాయించాలి

విశ్వంభర, మహబూబాబాద్: భారీ వర్షాల ప్రభావంతో మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులా, కాలనీలు, తండాలలో ధ్వంసమైన అంతర్గత రోడ్లు డ్రైనేజీ కాలువల పునరుద్ధరణకు నిధులు కేటాయించాలి తక్షణ చర్యలు చేపట్టాలి సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి డిమాండ్ చేశారు. బుదవారం మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 25 వ వార్డు ధర్మన్న కాలనీలో సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి దెబ్బతిన్న రోడ్లను డ్రైనేజీలను పరిశీలించారు. ఈ సందర్భంగా బి అజయ్ సారధి రెడ్డి మాట్లాడుతూ భారీ వర్షాల ప్రభావంతో మహబూబాబాద్ లోని అన్ని వార్డుల్లో రోడ్లు సీసీ డ్రైనేజీ కాలువలు ధ్వంసం అయ్యాయని తెలిపారు. రోడ్లన్నీ జలమయంగా మారిపోయాయని పేర్కొన్నారు. కాలువలు అస్తవ్యస్తంగా తయారయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 36 వార్డులలో దెబ్బతిన్న అంతర్గత రోడ్లు సీసీ డ్రైనేజీల పునరుద్ధరణకు నిధులు కేటాయించి తక్షణమే చర్యలు చేపట్టాలని తెలిపారు. ముఖ్యంగా మంగళవారం మానుకోటకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ వర్షాల నేపథ్యంలో నష్ట నివారణకై రివ్యూ మీటింగ్ జరిపి నష్ట నివారణకు అధికారులు ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో ప్రాంతాలకు వెళ్లి పరిశీలించాలని తెలిపారు. వెంటనే సంబంధిత అధికారులు నష్టం ఎంత జరిగిందో తెలుసుకొని రాష్ట్ర ప్రభుత్వానికి తెలిపి నిధులు కేటాయించి, వెంటనే ధ్వంసమైన రోడ్లను పునరుద్ధరణ చేసి కొత్త రోడ్లు కొత్త సీసీ డ్రైనేజీలు నిర్మించాలన్నారు. ధర్మన్న కాలనీలో ఎక్కువగా రోడ్లు ధ్వంసం అయ్యాయని జలమయం గా మారాయన్నారు. ధర్మన్న కాలనీకి వెంటనే అధికారులు సందర్శించి అంతర్గత రోడ్లు, డ్రైనేజీలకు నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెరుగు కుమార్, మంద శంకర్, మాలోతు రవీందర్, తండా శ్రీనాథ్, మంచినీళ్ల రాకేష్, బయ్య శ్రీను, బొమ్మెర మధు, భాష పృథ్వి, రమా హర్షం, పద్మ, గంగా, సమ్మక్క , శ్రీలత, కాలనీవాసులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న ప్రాంతాలను సందర్శించిన మాజీ ఎంపీ మాలోత్ కవితమ్మ

విశ్వంభర, మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం ఆలేరు గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో వరదల తాకిడికి చెరువు కట్ట తెగి పంటపొలాలు, విద్యుత్ స్తంభాలు పూర్తిగా దెబ్బతినగా చెరువు కట్టను మహబూబాబాద్ మాజీ ఎంపీ, జిల్లా అధ్యక్షులు మాలోత్ కవితమ్మ సందర్శించారు.భారీ వర్షాల నేపథ్యంలో పూర్తిగా దెబ్బతిన్న చెరువు కట్టకు త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేసారు. త్వరితగతిన కట్టను ఏర్పాటు చేసి రైతుల పంటపొలాలు దెబ్బతినకుండా ఉంటాయని అధికారులతో మాట్లాడారు. వరదల వలన విద్యుత్తు సరఫరా పూర్తిగా దెబ్బతిందని , విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని కోరారు. త్రాగు నీటికి తీవ్ర ఇబ్బంది ఏర్పడిందని త్వరగా ఆ సమస్యను అధిగమించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. వరదల కారణంగా గ్రామంలో చెత్త చెదారం పేరుకుపోయిందని, పారిశుద్ధ్య కార్మికులు మరియు వైద్య శాఖ అధికారులతో మాట్లాడి అంటూ వ్యాధులు ప్రబలకుండా చూడాలని వారికి సూచించారు.

వర్షాలు, వరదల వల్ల దెబ్బతిన్న మండలాల్లో పర్యటించిన కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

విశ్వంభర, మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లాకలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ బుధవారం భారీ వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న డోర్నకల్, సిరోలు మండలాలలో విస్తృతంగా పర్యటించారు. సిరోలు మండలంలో దుబ్బతండ, మోదుగులగూడెం, డోర్నకల్ మండలం ములకలపల్లిలలో భారీ వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న, ప్రాంతాలు, ములకలపల్లి లోని (120), దుబ్బగడ్డ తండా, (45), మోదుగుగడ్డ తండా (40) గృహాలను ఇంటింటికి తిరిగి సందర్శించి దుప్పట్లు పంపిణీ చేశారు. ములకలపల్లి- తిరుమలాయపాలెం అప్రోచ్ రోడ్డు, ములకలపల్లి -ఖమ్మం రోడ్డు, వెంటనే మరమ్మత్తులు చేయుటకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించి నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గృహాల యొక్క స్థితిగతులు, తెలుసుకొని నిత్యవసర సరుకుల పంపిణీ చేశారు.గ్రామాలలో పక్కాగా సానిటేషన్ నిర్వహించి అంటువ్యాధులు, విషజ్వరాలు ప్రబలకుండా వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఇంటిలోని వ్యక్తులను వైద్య పరీక్షలు నిర్వహించాలని వారికి కావలసిన మందులు పంపిణీ చేయాలని, ప్రస్తుతం వారు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

కమ్యూనిస్టు యోధుడు పల్లపు జంగయ్య మృతి బాధాకరం : ఉజ్జిని యాదగిరిరావు

విశ్వంభర, చింతపల్లి : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) చింతపల్లి మండల సహాయ కార్యదర్శి పల్లపు లక్ష్మయ్య తండ్రి పల్లపు జంగయ్య మృతి బాధాకరమని మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరి రావు అన్నారు. మండల పరిధిలోని గోడకొండ గ్రామానికి చెందిన కమ్యూనిస్టు పార్టీ కార్యకర్త పల్లపు జంగయ్య బుధవారం మృతి చెందారు. ఆయన పార్థివ దేహానికి భారత కమ్యూనిస్టు పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో యాదగిరిరావు పూలమాలలు వేసి, నివాళులర్పించి, మృతుడి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పల్లపు లక్ష్మయ్యను ఓదార్చి ఆయన కుటుంబానికి సిపిఐ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, మండల సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్ రావు, గ్యార పరుశరాములు, గ్యార పెద్దయ్య, కొడుదూటి సైదులు, గిరి వెంకటమ్మ, పి ముత్యాలు, కే ముత్యాలు, కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అమ్మకానికి వినాయక విగ్రహాలు రెడీ

ఈఏడాది ఉత్సాహంగా పండుగ ఏర్పాట్లు

పెద్ద విగ్రహాల కొనుగోలుకు ఎక్కువ మంది ఆసక్తి

పూలు, పండ్లు, డెకరేషన్ దారులకు, పురోహితులకు డిమాండ్

విశ్వంభర, ఆమనగల్లు: వినాయక ఉత్సవాలకు పట్టణాలు, గ్రామాలు ముస్తాబయ్యాయి. ఆమనగల్, కడ్తాల్, తలకొండపల్లి, మాడుగుల మండలాల్లో యువకులు ఎంతో ఉత్సాహంగా నవరాత్రులు నిర్వహించేందుకు ఇప్పటికే పందిళ్లు వేస్తున్నారు. ప్రతి సంవత్సరం భాద్రపద శుక్ల చవితినాడు వినాయక చవితి పండుగగా జరుపుకోవటం, ఆ రోజు నుంచి నవరాత్రులు నిర్వహించుకోవడం ఆనవాయితీ. పండుగకు పూలు, పండ్లు, డెకరేషన్ దారులకు, పురోహితులకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. కల్వకుర్తి నియోజకవర్గం లోని ఈ నాలుగు మండలాల్లో కలిపి దాదాపు పదివేల విగ్రహాలు అమ్ముడు అవుతావని అమ్మకం దారులు తెలిపారు. ఆమనగల్ పట్టణంలోనే దాదాపు 500 విగ్రహాల మండపాలు ఏర్పాటు చేస్తారు. ఈ ఏడాది నవరాత్రి ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభమవుతున్నాయి. కనుక ఈసారి పండుగను ఘనంగా నిర్వహించేందుకు యువకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. నాలుగు మండలాల కూడలి అయిన ఆమనగల్లు పట్టణంలో గణేష్ విగ్రహాల అమ్మకాలు జోరుగా సాగుతాయి. పట్టణంలో పెద్ద ఎత్తున వినాయక ప్రతిమలు అమ్మకానికి పెట్టారు. 100 రూపాయల నుండి 30 వేల రూపాయల వరకు లభిస్తున్నాయని 12 ఫీట్ల ఎత్తైన విగ్రహాలు కూడా ఈసారి పెద్ద ఎత్తున తెప్పించామని పెద్ద విగ్రహాల కొనుగోలుకు ఎక్కువ యువత ఆసక్తి చూపిస్తున్నారని ఈ విషయం తయారీదారులకు ఊరట కలిగిస్తుందని పోయిన సంవత్సరం 60 శాతానికి పైగా విగ్రహాలు అమ్మకం జరిగిందని అమ్మకాలు బాగా తగ్గాయని దీంతో తయారీదారులు నష్టాలను చవిచూడాల్సి వచ్చిందని తెలిపారు. ఏడాదికి 6 నెలలు విగ్రహ తయారీ మీదనే ఆధారపడే కుటుంబాలు వారు అనేక కష్టాలను ఎదుర్కొన్నామని ఈసారైనా లాభాలు వస్తాయని తయారీదారులు, అమ్మకందారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కడ్తాల్ పట్టణంలో మట్టి వినాయక ప్రతిమలను గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ నుంచి 5వ తేదీన పాలసీ తలేకరణ కేంద్రం వద్ద ఉచితంగా పంచి పెడతామని ట్రస్ట్ చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా తెలిపారు.

మాజీ జర్నలిస్ట్‌కు బియ్యం అందచేత

విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం: అనారోగ్యానికి గురై ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న మాజీ జర్నలిస్టుకు భద్రాచలంకు చెందిన చేతన మీ సేవ నిర్వాహకులు, ఆంధ్రప్రభ క్రైమ్ రిపోర్టర్ భూక్యా రంజిత్ నాయక్ కు బియ్యం అందచేసి మరో సారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. భద్రాచలంలో జర్నలిస్టుగా, మెకానిక్‌గా పనిచేసిన కోడిరెక్కల శేఖర్ గతంలో ఓ యాక్సిడెంట్‌లో తీవ్రంగా గాయపడ్డాడు. తలకు శస్త్ర చికిత్సలు సైతం జరిగాయి. ఈ నేపథ్యంలో కుటుంబం నడిచే పరిస్థితుల లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. సాయం కోసం రంజిత్ నాయక్‌ను ఆశ్రయించటంతో 50 కేజీల బియ్యం, నిత్యవసర సామాగ్రిను బుధవారం ప్రముఖ అంతర్జాతీయ ఫోటోగ్రాఫర్ క్లాసిక్ షరీఫ్, కందుల రాము, మథర్‌థెరిస్సా ట్రస్టు నిర్వాహకులు కొప్పుల మురళీల చేతుల మీదుగా అందచేశారు. ఈ సందర్భంగా శేఖర్ రంజిత్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్ఓసి అందజేసిన కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ వినయ్ రెడ్డి

విశ్వంభర,నిజామాబాద్: ఆర్మూర్ పట్టణానికి చెందిన ముత్యాల మనోహర్ రెడ్డి గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపతున్నారన్న విషయం తెలుసుకున్న ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి బాధితులతో ఫోన్‌లో మాట్లాడి విషయం తెలుసుకు న్నారు. వెంటనే స్పందించి వారికి చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రెండు లక్షల యాభై వేల రూపాయల ఎల్ఓసి ని మంజూరు చేయించి వారి కుటుంబ సభ్యులకు అందించారు. అలాగే బాధితురాలి ఆరోగ్య పరిస్థితుల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వారికీ అండ గా ఉంటామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ వెంటనే స్పందించి తమ కుటుంబానికి అండగా నిలిచిన వినయ్ కుమార్ రెడ్డి కి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు.

నెల జీతాన్ని విరాళంగా ప్రకటించిన ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

విశ్వంభర,మెట్‌పల్లి: ప్రజలు ఆపదలో ఉన్నారని తెలిస్తే వెంటనే స్పందించి తనకు చేతనైన సహాయం చేసే గొప్ప మనసున్న నాయకుడు కల్వకుంట్ల సంజయ్ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నియోజకవర్గంలోని కార్యకర్తలను అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడంతో పాటు విదేశీ పర్యటనలో ఉన్న కూడా ముంపు కు గురైన ఖమ్మం వరద బాధితులకు నేనున్నాను అంటూ ఒక నెల జీతాన్ని ఖమ్మం వరద బాధితులకు విరాళం ప్రకటించిన కోరుట్ల నియోజకవర్గం ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్.

ఉత్తమ అధ్యాపకుడికి సన్మానం

విశ్వంభర, రామన్నపేట: రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ కృష్ణ కౌండిన్య రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికైనందున రామన్నపేట సాహితీ మిత్ర మండలి గౌరవాధ్యక్షులు డాక్టర్ కూరెళ్ళ విఠలాచార్య, ప్రధాన కార్యదర్శి బాసరాజు యాదగిరి, శ్రీ హిందూ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పనకంటి భాస్కరరావు సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో సాహితి మిత్ర మండలి సభ్యులు పాల్వంచ హరికిషన్, కంచి రవికుమార్, పెరుమాళ్ళ ఆనంద్, డాక్టర్ మండల స్వామి, గడ్డం శ్రీను, మాజీ మండల విద్యాధికారి బొడ్డు వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

నోదయ భానుడు ఉపాధ్యాయుడు

అజ్ఞాన అంధకారాన్ని తొలగించి
సుజ్ఞాన వెలుగులను అందించి
శిష్యునిలో జ్ఞానకిరణాలువెల్గించే
జ్ఞానోదయభానుడు!

మంచి చెడులను నేర్పుగా
ఓర్పుగా నేర్పించి
శిష్య గణమును ముందుకు
నడిపించి
వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే
వ్యక్తిత్వ వికాస నిపుణుడు!

శిలలా పడియున్న శిష్యునిలో
అవివేక జడత్వాన్ని దూరం చేసి
విజ్ఞాన చైతన్యాన్ని కలిగించి
అద్భుత శిల్పంలా తీర్చిదిద్దే
అభినవ శిల్పాచార్యుడు!

విలువలతో కూడిన జీవన
విధానాన్ని నేర్పించి
క్రమశిక్షణాయుతజి
గుణములను ఎద పెంచి
విద్యార్థులను,
జీవన యోగ్యతలను కలిగించి
ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి
శిష్యుని కొనిపోయే
ఉన్నత జీవిత మార్గదర్శకుడు!

తనను ఆశ్రయించిన శిష్యునికి
సద్గురువు కాగలడు
జ్ఞాన కల్పతరువు!
ఇహపర కోరికలు తీర్చే
కామధేనువు!

చదువుల తల్లి
ప్రతిరూపాలైనజి
నిరంతర విద్యా దానంతో
పునీతులైనజి
శిష్యులను పుత్ర సమానులుగా
ప్రేమించే ప్రేమ మూర్తులైన
సద్గురువుల ఆశలను పరువును
ఎల్లవేళలా శిష్యులు నిలబెట్టాలి!
గురువు రుణాన్ని తీర్చుకోవాలి!

"సాహిత్య కళా విభూషణ"
చౌడూరి నరసింహారావు
కవి,రచయిత,విమర్శకుడు
నంది అవార్డు గ్రహీత
ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత

గౌ.లు. డాక్టర్ కాచం
సత్యనారాయణ గారికి,
సంపాదకులు,
విశ్వంభర దిన పత్రిక,
సాదరపూర్వకజి
నమస్సుమాలు,
ఆర్యా!
మన పత్రిక విశ్వంభర దిన దిన
ప్రవర్ధమానమవుతూ విశ్వ వ్యాప్తంగా
విస్తరించాలని మనసారా కోరుకుంటున్నాను.
రేపు భారత ప్రథమ రాష్ట్రపతి, ఆదర్శ
ఉపాధ్యాయుడు డాక్టర్ సర్వే పల్లి రాధాకృష్ణన్
పండితుడి జన్మదినోత్సవం సందర్భంగా
ఉపాధ్యాయుని కీర్తిస్తూ, "జ్ఞానోదయ భానుడు
ఉపాధ్యాయుడు" అను శీర్షికతో ఒక కవితను
మన పత్రికలో ప్రచురణార్థం పంపుతున్నాను.
దయచేసి ప్రచురించగలరు.
ఈ కవిత నా స్వంతం అని హామీనిస్తున్నాను.
ధన్యవాదాలతో...

చౌడూరినరసింహారావు
ఉత్తమ ఉపాధ్యాయ
పురస్కార గ్రహీత
నంది అవార్డు గ్రహీత

డిండిలో సెంటర్ ఫర్ వరల్డ్ యువతి సమ్మేళనం

విశ్వంభర, డిండి : డిండి మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాలలో సెంటర్ ఫర్ వరల్డ్ పాలిడాంటీ గ్రామ్య సంస్థ కలిసి యువతి సమ్మేళనం ఏర్పాట్లు చేశారు. 350 మంది కిశోర బాలికలు హాజరైన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సై రాజు హాజరై మాట్లాడా రు.. ఆడి పిల్లలు అందరూ కూడా ధైర్యంగా ముందడుగు వేస్తూ ఆరోగ్యం గా ఉండాలని, ఏదైనా హెల్ప్ కావాలంటే తప్పకుండా పోలీస్ సాఫోట్ తీసుకోవాలన్నారు. సంస్థ ద్వారా రాజ్యాంగ హక్కులు నాయకత్వం పౌష్టికాహారం వేరిమడ్స్ సముదాయంలో వస్తున్నట్టు వంటి ఇబ్బందుల గురించి ఆడపిల్లలు యొక్క కలలను ఎలా సౌకర్యం చేసుకోవాలని అనేది వివరిం చారు. సేంద్రీయ వ్యవసాయ పద్ధతులపై అవగా హన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీడబ్ల్యూ ఎస్ ప్రతినిధి లక్ష్మీనారాయణ, గ్రామం నుండి, రుక్మిణి రావు, సుమలత, ఇందిరా, ఆంజనే యులు, వివిధ స్కూల్, టీచర్లు, సంఘం, సిబ్బం ది తదితరులు పాల్గొన్నారు

అస్తవ్యస్తంగా మారిన రోడ్లు

■ పట్టించుకోని ఆర్ అండ్ బి అధికారులు 03 ■ ఓవర్ రోడ్ల పట్ల ఎంవిఐ అధికారుల నిర్లక్ష్యం ■ ఇకనైనా స్పందిస్తారా లేదా? ■ రింగ్ రోడ్‌కి ఇరువైపులా స్పీడ్ బ్రేకర్లు అమర్చాలి

విశ్వంభర న్యూస్ ప్రతినిధి విజయ్ సెప్టెంబర్ 4 సంగారెడ్డి జిల్లా అధికారుల అలసత్వం పాలకుల నిర్లక్ష్యం వల్ల గ్రామాలకు వెళ్లే రోడ్లన్నీ గుంతల మయమయ్యాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు నియోజకవర్గం పటాన్ చేరు నుండి ఇంద్రేశం మీదుగా శివానగర్ మరియు దౌల్తాబాద్ వెళ్లే దారిలో గుంతలు మోకాళ్ళ లోతు దర్శనమిస్తున్నాయి. దాదాపుగా అన్ని గ్రామాలకు వెళ్లే గ్రామీణ రోడ్లు గుంతల మయం అయ్యాయి. సుమారుగా 10 సంవత్సరాలు క్రితం వేసిన బీటీ రోడ్లు క్రషర్ల నుండి వచ్చిన టిప్పర్ ఓవర్ లోడ్ లారీల వల్ల బిటి రోడ్లు పూర్తిగా ధ్వంసం కావడంతో వాహనదారులు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో గ్రామాలకు వెళ్లాలంటే ఆందోళన చెందుతున్నారు. గుంతల విషయం తెలియని కొత్తగా గ్రామాలకు వస్తున్న అనేకమంది వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతల మయంగా మారాయని పలుసార్లు పలు పత్రికలలో వరుస కథనాలు వస్తున్న ప్రజాప్రతినిధులలో కానీ అధికారులలో గానీ ఎలాంటి చలనం లేకపోయింది. ఇదే దారి గుండా అనునిత్యం అధికారులు ప్రజాప్రతినిధులు ప్రయాణం చేస్తున్నప్పటికీ గుంతలమైనరోడ్లు కనిపించడం లేదా అని ప్రజలు విమర్శిస్తూనే ఉన్నారు. గుంతలకు కారణమైన పలు కంకర క్రషర్ల నుండి వచ్చే టిప్పర్ లారీలలో 10 నుంచి 15 టన్నుల ఓవర్ లోడ్ తో రవాణా అవుతున్న రోడ్డు రవాణా అధికారులు మాత్రం ఇలాంటి చర్యలకు నోచుకోలేదు. ఓవర్ లోడ్ ల పట్ల రోడ్డు రవాణా అధికారులు నిర్లక్ష్యం వహించడం పట్ల వారికి తగిన మూల్యం అందుతున్నాయని పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక పోతే ఇటీవలే బిఆర్ఎస్ ఎన్నికల ముందు బిఆర్ఎస్ ప్రభుత్వం బీటీ రోడ్లు వేస్తామని ఉత్తర్వులు జారీ చేసిన పనులను మాత్రం ఎక్కడా కూడా ప్రారంభించలేదు. ఇప్పుడు బిఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో కి వచ్చింది.ఈ ప్రభుత్వంలో నైనా పటాన్ చేరు నుండి ఇంద్రేశం మీదుగా దౌల్తాబాద్ శివానగర్ రోడ్లనీ మరమ్మత్తులు చేయించగలరని వాహనదారులు ప్రజలు కోరుతున్నారు.

రింగ్ రోడ్డు వద్ద స్పీడ్ బ్రేకర్లు అమర్చాలి

పటాన్ చేరు నుండి ఇంద్రేశం వెళ్లే దారిలో ఔటర్ రింగ్ రోడ్ బ్రిడ్జ్ జంక్షన్లో ముత్తంగి నుండి సుల్తాన్పూర్ వెళ్ళే దారి కిష్టారెడ్డిపేట నుండి ముత్తంగి వెళ్లే దారి పటాన్‌చేరు నుండి ఇంద్రేశం వెళ్లే దారులలో స్పీడ్ బ్రేకర్లు అమర్చ కపోవడం వల్ల పలు ప్రమాదాలకు ప్రజలు గురిఅవుతున్నారని స్థానికులు మండిపడుతున్నారు. అధికారులు స్పందించి రింగ్‌రోడ్డుకు స్పీడ్ బ్రేకర్లు అమర్చగలరని ప్రజలు కోరుతున్నారు.

ఎంవిఐ అధికారుల నిర్లక్ష్యం

సోలక్ పల్లి,రెడ్డిపాలెం లో గల కంకర క్రషర్ల నుండి వచ్చే టిప్పర్ లారీల ఓవర్ లోడ్ 10 నుండి 15 టన్నుల ఓవర్ లోడ్ రవాణా అవుతున్న ఎంవి ఐ అధికారులు మాత్రం ఎలాంటి చర్యలకు నోచుకోలేదు. ఈ ఓవర్ లోడ్ల వల్ల రోడ్లు గుంతల మాయం అవుతున్నాయి. ఇకనైనా ఎంవిఐ అధికారులు స్పందించి ఓవర్ లోడ్ల పట్ల తగు చర్యలు తీసుకోగలరని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కరెంటు మీటర్ ?? లేని వారికీ శుభవార్త

విశ్వంభర మహబూబాబాద్: ఈనెల 17 నుండి అర్హులందరికీ జీరో కరెంటు బిల్లు కొరకై తెలంగాణ ప్రభుత్వం గృహజ్యోతి పథకంలో భాగంగా ... ఇంకా నిరుపేదలు ఎవరైనా కరెంటు మీటర్ లేకుండా ఉంటే కొత్త కరెంట్ మీటర్ మీకు కేవలం ?825 రూపాయలకే విద్యుత్‌లశాఖ వారు ఇవ్వదలిచారు. ఆసక్తి గల వారు మీసేవకి వెళ్లాల్సిన పనిలేదు, చలానా కట్టాల్సిన అవసరం లేకుండా కేవలం ఒక ఆధార్ కార్డు, పాస్ ఫోటో ,తీసుకోని సెప్టెంబర్ 1 తేది నుండి మీ దగ్గరలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో కలవండి. ఇలా మేము కుటుంబం మాకు కొత్త మీటర్ కావాలి అని చెపితే మీకు విద్యుత్ కనెక్షన్ కల్పిస్తారు. ఇంకా పూర్తి వివరాల కోసం సబ్ స్టేషన్ లోని విద్యుత్ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని విద్యుత్ శాఖ సహాయక ఇంజినీర్ తెలిపారు.

భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విశ్వంభర న్యూస్: ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ సెల్ఫీల కోసం వాగులు, వంకలు,నదులు వద్దకు వెళ్లి ప్రమాదాలకు గురి కావొద్దు. వరద నీటితో నిండిపోయిన రోడ్లను దాటడానికి ప్రయత్నించవద్దు. వర్షాల కారణంగా రోడ్లు బురదమయంగా మారాయి. వాహనాల టైర్లు జారి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉన్నది. కావున వాహనదారులు నెమ్మదిగా తమ వాహనాలతో ప్రయాణించాలి. భద్రాచలం వద్ద గోదావరినది పెరుగుతున్నది కావున పరిసర ప్రాంత ప్రజలు అధికారుల సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలి. జిల్లా అధికార యంత్రాంగం సూచించిన సూచనలు మేరకు ఎప్పటికప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అధికారులకు సహకరించాలి. ఏదైనా ప్రమాదం ఎదురైతే వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి పోలీసు వారి సహాయ సహకారాలు వినియోగించుకోవాలి.జిల్లా పోలీస్‌శాఖ 24/7 ప్రజలకు అందుబాటులో ఉంటుంది. ప్రజలరక్షణ కొరకు తప్పనిసరి పరిస్థితుల్లో పోలీసు వారు విధించిన ఆంక్షలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

ప్రభుత్వ పాఠశాలకు విరాళం

విశ్వంభర, రామన్నపేట, సెప్టెంబర్ 4: ఈ రోజు లగ్గాలస్వామి తమ కుమార్తె శివాని జ్ఞాపకార్థం ప్రాథమిక పాఠశాల, ఎన్నారంకు రూ.20,000 విరాళంగా ఇచ్చారు.ఈ మొత్తాన్ని ఫిక్స్ డిపాజిట్ చేసి, వచ్చే వడ్డీతో ఆగస్ట్ 15 జనవరి 26న విద్యార్థుల బహుమతుల కోసం వెచ్చించమని కోరారు. పుట్టెడు దుఃఖంలోనూతమవితరణను చాటుకున్నారు. పాఠశాలతరఫున కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాలలో పర్యటించిన ఎమ్మెల్యే మురళి నాయక్ గారు

విశ్వంభర ప్రతినిధి: మహబూబాబాద్ నియోజకవర్గం కేసముద్రం మండల కేంద్రంలోని,ఇంటికన్నే గ్రామంలో భారీ వర్షానికి చెరువు కట్ట తెగిపోవడంతో ఆ వర్షపు నీరు వరద ప్రవాహం పొలాల గుండా వెళ్లడంతో వందల ఎకరాలు నీట మునగడంతో రైతుల బోరున విలపించారు. ఈ విషయాన్ని తెలుసుకున్నటువంటి మహబూబాబాద్ శాసనసభ్యులు శ్రీ డాక్టర్ భూక్య మురళి నాయక్ గారు గారు వెంటనే ఆ గ్రామాన్ని సందర్శించి రైతులకు పరామర్శిస్తూ ధైర్యాన్నిచ్చి నష్టపోయిన ప్రతి రైతును కూడా ఆదుకుంటామని భరోసానిచ్చారు. ఎవరు అధైర్య పడవద్దని, వారికి అన్ని విధాలుగా ప్రభుత్వం అండదండగా ఉంటామన్నారు. నష్ట పోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం అందిస్తామన్నారు. ఇంటికన్నె చెరువు కట్ట ఉప్పొంగి వరద ప్రవాహం భారీగా పరిసర పొలాల్లోకి వెళ్లడంతో రైతులు భారీ నష్టాన్ని చూశారు. తక్షణమే ఎకరం కింద పది వేల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేస్తుందని రైతులెవ్వరు అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు.

మరో మూడు రోజులు భారీ వర్షాలు

సెప్టెంబర్ విశ్వంభర: మరో మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికతో టిఆర్ఎస్ నాయకులకు కార్యకర్తలకు సూచనలు చేసిన జగిత్యాల జిల్లా బి ఆర్ ఎస్ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు వాతావరణ శాఖ మరో మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించడంతో పట్టణాలు మరియు పల్లెల్లో ఉండే నాయకులకు కార్యకర్తలకు కోరుట్ల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు పలు సూచనలు చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆపదలో ఉన్న వారికి సహాయం చేయాలని గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో ఉన్న గొర్ల కాపరాలను, చేపలు పట్టే వారికి ప్రభుత్వం చేస్తున్న హెచ్చరికలను తప్పకుండా పాటించాలని తెలియజేస్తూ ఎలాంటి నష్టం జరగకుండా వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, విష జ్వరాల బారిన పడ్డ ప్రజలకు వైద్య సహాయానికి తోడ్పడాలని ప్రతి బిఆర్ఎస్ కార్యకర్తలు నాయకులు పోలీసు రెవెన్యూ వైద్య మున్సిపల్ శాఖ వారితో సమన్వయంగా ఉంటూ వార్డు ప్రజలకు గ్రామ ప్రజలకు ఎలాంటి ఆపద కలగకుండా చూడాలని పిలుపునిచ్చారు. వర్షాల కారణంగా పురాతన ఇండ్లలో నివసించే వారిని విష పురుగుల బారిన పడకుండా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కష్టకాలంలో ఉన్న ప్రజలను కాపాడడం మన బాధ్యత అని బిఆర్ఎస్ నాయకులను కార్యకర్తలను కోరారు.

వంతెన పున:ప్రారంభించిన ఎమ్మెల్యే కలెక్టర్

విశ్వంభర, భూపాలపల్లి: భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలోని టేకుమట్ల - రాఘవరెడి పేట గ్రామాల మధ్య చలివాగుపై పున:నిర్మాణమైన హై లెవల్ వంతెనను బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. గత ఏడాది జూలైలో కురిసిన భారీ వర్షాలకు టేకుమట్ల - రాఘవరెడ్డిపేట వంతెన పిల్లర్లు కుంగినట్లు తెలిపారు. ఆ రోజు వంతెనను పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో అంచనాలు రూపొందించి వంతెన నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపగా, రూ.4.70 కోట్లతో యుద్ధప్రాతిపదికన వంతెన పున:నిర్మాణ పనులను చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అతి తక్కువ సమయంలోనే వంతెన నిర్మాణంను పూర్తి చేసిన సదరు గుత్తేదారుడు (శ్రీ వేంకటేశ్వర కన్స్ట్రక్షన్) ను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ వంతెన అందుబాటులోకి రావడంతో టేకుమట్ల మండలంలోని వాగవతలి సుమారు తొమ్మిది నుండి పది గ్రామాల ప్రజలకు మార్గం సుగమం అయినట్లు తెలిపారు. అనంతరం గుత్తేదారు, అధికారులకు ఎమ్మెల్యే, కలెక్టర్ పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానించారు.

కళ్యాణలక్ష్మీ షాది ముబారక్ చెక్కులు అందజేత

విశ్వంభర, టేకుమట్ల: భూపాలపల్లి : టేకుమట్ల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 15 మంది కళ్యాణలక్ష్మీ, షాదీముబా రక్ లబ్ధిదారులకు రూ.15,01, 740 విలువ గల చెక్కులను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు ఎంతో అండగా కళ్యాణలక్ష్మి పథకం నిలుస్తుందని తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రజా ప్రభుత్వంలో నేరుగా లబ్ధిదారులకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకంతో రాష్ట్రంలోని ఎంతో మంది పేద, నిరుపేద కుటుంబాల ఆడపిల్లల పెండ్లికి ఆర్థికసాయం అందిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆర్ అండ్ బి ఈ ఈ వెంకటేశ్వర్లుల వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గణేష్ విగ్రహ నిర్వాహకులతో డీఎస్పీ సమావేశం

విశ్వంభర, భూపాలపల్లిల: రాబోవు వినాయక చవితిని పురస్కరించుకొని భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం, దాని పరిధిలోగల గ్రామాల్లో వినాయక విగ్రహాలను పెట్టదలుచుకున్న కమిటీలు, ఆర్గనైజేషన్లు మరియు ఇతర యూత్ కమిటీలతో బుధవారం మహాదేవపూర్ పోలీస్ స్టేషన్ లో కాటారం డీఎస్పీ జి.రామ్మోహన్ రెడ్డి, మహాదేవపూర్ సీఐ రామచంద్ర రావు మరియు ఎస్సై కే పవన్ కుమార్ లు సమావేశం అయ్యారు. ఇట్టి సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ శాంతియుతంగా, భద్రత వాతావరణంలో వినాయక చవితి మరియు నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించుకోవాలని, అందరూ విధిగా సంబంధిత వెబ్ సైట్లో విగ్రహం ఎత్తు, నిమజ్జనం సమయం, తేదీ, ప్రదేశం మరియు ఇతర వివరాలతో సంబంధిత వెబ్ సైట్లో పొందుపరచాలని ఎప్పటికీ విగ్రహం మండపం వద్ద ఇద్దరు పెద్దలు అందుబాటులో ఉండాలని రాత్రిపూట విగ్రహం దగ్గర కచ్చితంగా ఇద్దరు లేదా ముగ్గురు నిద్రించాలని, ఎటువంటి డీజేలకు పర్మిషన్ లేదని, అలాగే మైకులు లేదా బ్యాండులు పెట్టదల్చుకుంటే కచ్చితంగా పర్మిషన్ తీసుకోవాలని, వర్షాకాలం కావున మండపానికి కరెంటు కనెక్షన్ ఇచ్చేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని చిన్న పిల్లలను ఇటువంటి పనులలో ఉపయోగిం చవద్దని, రాత్రి సమయంలో పెద్ద పెద్ద సౌండ్ లు పెట్టవద్దని, ఇతర ఇతర విగ్రహ మండప నిర్వాహకులతో గొడవలు పెట్టుకోవద్దని, ఎటువంటి చిన్న సమస్య తలెత్తిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని తెలిపారు.

ప్రభుత్వం కళ్లు తెరిపించాలని ముక్తేశ్వర స్వామిని వేడుకోలు

విశ్వంభర, భూపాలపల్లి: భూపాలపల్లి జిల్లా లోని కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని బుధవారం బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ దర్శించు కున్నారు. గర్భగుడిలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేముల మహేందర్ గౌడ్ విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్ లో భాగంగా బీసీల కుల గణన చేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిం చేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిపించాలని దేవునికి విజ్ఞప్తి చేసినట్లు ఆయన తెలిపారు.

తల్లిదండ్రులు పిల్లలపై తీసుకోవలసిన జాగ్రత్తలు

విశ్వంభర, మహబూబాబాద్ :విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ఉదయం పాఠశాలకు వెళ్లి సాయంత్రం పాఠశాల నుండి వచ్చిన తర్వాత విద్యార్థులను బయట తిరగనీయరాదు.మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రుల పై కేసులు నమోదు, వాహనాలు సీజ్ చేయబడతాయిపాఠశాలలో విద్యార్థులు క్రమశిక్షణ రహితంగా ప్రవర్తించినా, ఆడపిల్లల పట్ల అనుచితంగా ప్రవర్తించినా అటువంటి కంప్లైంట్స్ స్కూల్ యాజమాన్యం నుండి వచ్చిన యెడల టీ.సీలు ఇచ్చి ఇంటికి పంపివేయబడతారు. మరే ఇతర స్కూల్లో జాయిన్ చేసుకొని విధంగా చర్యలు తీసుకోబడతాయి. విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతటివారైనా అందరికీ ఒకే విధంగా చర్యలు తీసుకోబడతాయి. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారు, ఏం చేస్తున్నారు, ఎలాంటి అలవాట్లు చేసుకుంటున్నారు, దుర్వ్యసనాలకు పాల్పడుతున్నారా అనే విషయాలపై పూర్తి స్పృహ కలిగి ఉండాలి, ఎప్పటికప్పుడు వారి కదలికలపై దృష్టి సారిస్తూ ఉండాలి. పిల్లలకు ఫోన్ లు ఇవ్వడం, పర్సనల్ కంప్యూటర్లు ఇవ్వడం చేయరాదు. ఇవ్వాల్సిన పరిస్థితులు వస్తే వాటి వినియోగం పై పూర్తి నిఘా ఉంచాలి. పిల్లలు ధరించే దుస్తులు హెయిర్ కటింగ్ పై శ్రద్ధవహించాలి. పాశ్చాత్య సంస్కృతులకు దూరంగా ఉంచాలి.పిల్లలు చేస్తున్న స్నేహాలపై మరియు స్నేహితుల అలవాట్లపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలి. శారీరకశ్రమ అందించే క్రీడలకు ప్రోత్సహించి, చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి.మీ పిల్లలు చెడు వ్యసనాలకు (తాగుడు, మత్తు మందులు ఇతరత్రా) అలవాటు పడకుండా చూడవలసిన బాధ్యత తల్లిదండ్రులదే జాగ్రత్తలు వహించండి. మీ పిల్లలను ఒక కంట కనిపెట్టండి. పిల్లలను ప్రేమగా చూసుకోవడం మంచిదే కానీ అతి ప్రేమతో వారిని మొండి వారిగా తయారు చేయడం వల్ల సమస్యలు ఎదురవుతాయి. మొక్కై వంగనిది మానై వంగదని తల్లిదండ్రులు గమనించాలి.

లారీ డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సహాయం

విశ్వంభర,నారాయణపూర్: సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన లారీ డ్రైవర్ అంతటి స్వామి గౌడ్ కు ప్రమాదవశాత్తు రెండు కాళ్లు విరిగాయి. ఈ సందర్భంగా గీతా పనివారాల సంఘం ఆధ్వర్యంలో అతని కుటుంబానికి 36,227 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గీతా పనివారాల సంఘం జిల్లా కార్యదర్శి పందుల యాదగిరి గౌడ్, గీతా పనివారాల సంఘం అధ్యక్షులు నీళ్ల గాలయ్య గౌడ్, గౌడ సంఘం మాజీ అధ్యక్షులు పాలకుర్ల యాదయ్య గౌడ్, కంఠ మహేశ్వర దేవాలయ మాజీ అధ్యక్షులు పాలకుర్ల సతీష్ గౌడ్, కొండ శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అవసరార్థుల తక్షణ సాయానికి నెలవు

విశ్వంభర, రాజన్న సిరిసిల్ల,: తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం- అవసరం ఎక్కడ ఉంటే అక్కడ ఉంటుంది, ఇది యావత్ తెలంగాణకు తెలిసిన సత్యం, ప్రస్తుతం రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలతో ఇబ్బందుల్లో ఉన్న వారికి తనవంతు సాయం అందించేందుకు కదిలివెళ్లింది, గత కొంత కాలంగా ఆక్సిజన్ పైన జీవనం కొనసాగిస్తున్న తల్లితో ఇబ్బందులు పడుతున్న రాజన్న సిరిసిల్ల జిల్లా, ముస్తాబాద్ మండలం ఆవునూర్ గ్రామానికి చెందిన పేద రైతు బత్తుల మల్లేశం (యాదవ్) పై అనుకోని పిడుగు పడింది. కుటుంబ ఆరోగ్య, ఆర్థిక ఇబ్బందులకు అదనంగా వర్షాల వల్ల విధ్యుద్ఘాతంతో జీవనోపాధికోసం పెంచుతున్న 13 గొర్రెలు చనిపోవడం అతన్ని నిస్సహాయున్ని చేసింది. ఈ విషయం తెలుసుకున్న బృందం సమాచారాన్ని సభ్యులందరికీ చేరవేసింది, ఈ క్రమంలో మాజీ అద్యక్షులు డా. దివేశ్ అనిరెడ్డి సహకారంతో తక్షణ సాయంగా 10వేల రూపాయలను బాధితుడైన బత్తుల మల్లేశంకు అందజేసింది. నిర్వహిస్తున్న జైకిసాన్ కార్యక్రమం కింద 5వేలు, ఆరోగ్యసేవ కార్యక్రమం కింద 5వేల చొప్పున ఈ రోజు అతని స్వగృహానికి వెళ్లి అందజేసింది. ఈ కార్యక్రమంలో ఇండియా అద్యక్షుడు మట్టా రాజేశ్వర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ గుండం నర్సయ్య, రైతులు బొమ్మెల ఎల్లారెడ్డి, చాకలి రవి, దాసరి విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం

విశ్వంభర,కామారెడ్డి: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో ఈరోజు బుధవారం సందర్భంగా దాదాపు 200 మందికి బీద వారికి అన్నదానం నిర్వహించారు. ఈరోజు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు నాస్కంటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గోనె శ్రీనివాస్ మరియు అన్న ప్రసాద్ కమిటీ కార్యదర్శి రఘుకుమార్ మరియు ఆర్గనైజింగ్ సెక్రటరీ కూర శ్రీనివాస్ ఉపాధ్యక్షులు వీరమల్లి శ్రీనివాస్ పంపరి లక్ష్మణ్ సతీష్ పాల్గొన్నారు.

సెప్టెంబర్ విశ్వంభర: ప్రతినిధి మహబూబాబాద్ ఇంటికన్నె వద్ద వరద తాకిడికి కొట్టుకపోయిన రైలు ట్రాక్ మరమ్మతులు పూర్తి...ట్రయల్ రన్ లో వెళ్ళిన ఒక రైలు

కంటోన్మెంట్ బోర్డుకు అదనపు నీటి సరఫరా

■ ఒక ఎంజీడీ నీరు సరఫరా చేయాలని నిర్ణయం ■ స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్, కంటోన్మెంట్ సీఈవోతో ఎండీ భేటీ

విశ్వంభర, హైదరాబాద్: కంటోన్మెంట్ జీహెచ్ఎంసీ పరిధిలోకి విలీనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో వివిధ ప్రభుత్వ శాఖలు కంటోన్మెంట్ కు కావలసిన అవసరాలను సమకూర్చడంలో నిమగ్నమయ్యాయి. ఇందులో భాగంగా కంటోన్మెంట్ బోర్డుకు అదనంగా 1 ఎంజీడీల నీరు కేటాయించినట్లు ఎండీ అశోక్ రెడ్డి వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ తో పాటు కంటోన్మెంట్ బోర్డు ఉన్నతాధికారులతో ఆయన బుధవారం భేటీ అయ్యారు. కొంత కాలంగా కంటోన్మెంట్ ప్రాంతానికి సరిపడా నీరు సరఫరా కావడం లేదని విషయాన్ని ఎమ్మెల్యే శ్రీ గణేష్ సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అదనపు నీటి సరఫరాకు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో ఎమ్మెల్యే గణేష్, సీఈవో మధుకర్ నాయక్, సీఈ రాజ్ కుమార్, ఉన్నతాధికారులతో జలమండలి ఎండీ సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో సుమారు 40 వేల నల్లా కనెక్షన్లు ఉన్నాయని తెలిపారు. వీరికి ప్రస్తుతం 5.9 ఎంజీడీల నీరు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అదనంగా ఏయే ప్రాంతాల్లో ఎంత నీరు సరఫరా పెంచే విషయమై వారితో చర్చించారు. సాధ్యా సాధ్యాల్ని పరిశీలించిన అనంతరం ప్రస్తుతం సరఫరా చేస్తున్న నీటితోపాటు అదనంగా ఇంకో ఎంజీడీ నీటిని సరఫరా చేసేందుకు సిద్ధమన్నారు. దీంతో ఇక నుంచి కంటోన్మెంట్ ప్రాంతానికి మొత్తం 6.9 ఎంజీడీల నీరు జలమండలి సరఫరా చేయనుంది. ఇప్పటికే గత వారం రోజుల నుంచి 0.54 ఎంజీడీల నీరు అందిస్తుండగా.. మిగిలిన 0.46 ఎంజీడీల నీటిని మరో మూడు నాలుగు రోజుల్లో సరఫరా చేస్తామని ఎండీ తెలిపారు. ఈ నేపథ్యంలో కంటోన్మెంట్ బోర్డు పంపిణీ వ్యవస్థ తోపాటు నిల్వ సామర్థ్యం మెరుగు పర్చుకోవాలని ఎండీ అశోక్ రెడ్డి సూచించారు. కంటోన్మెంట్ పరిధిలో ఉన్న అక్రమ నల్లా కనెక్షన్ లపై సర్వే చేసి వాటిని రెగ్యులర్ చేసుకోవాలన్నారు.

జలమండలి ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి సుదూర ప్రాంతాల నుంచి నీరు సరఫరా చేస్తున్నందున నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని చెప్పారు. ఇన్ లెట్ల వద్ద వాటర్ ఫ్లో మీటర్లు ఏర్పాటు చేసుకోవాలని ఎండీ అశోక్ రెడ్డి సూచించగా.. కంటోన్మెంట్ బోర్డు అధికారులు సుముఖత వ్యక్తం చేశారు.

రూ. ఐదు లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా

విశ్వంభర, హైదరాబాద భారీ వర్షాలతో పోటెత్తిన వరదల్లో కొట్టుకునిపోయి మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన ఐదు లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియాను తెలంగాణ రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ లతో కలిసి బుధవారం అందజేశారు. కారేపల్లి మండలం గంగారాం తండా కు చెందిన మోతీలాల్, ఆయన కుమార్తె యువ శాస్త్రవేత్త అశ్విని వరదల్లో కారుతో సహా కొట్టుకుపోయి మృతి చెందగా, వారి కుటుంబాన్ని పరామర్శించి ఒక వ్యక్తికి ఐదు లక్షల రూపాయల చొప్పున రు. 10 లక్షల ఎక్స్ గ్రేషియా చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎక్స్ గ్రేషియా తో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి, పత్రాన్ని అందజేశారు. అశ్విని మరణంతో దేశం, ప్రపంచం ఒక యువ శాస్త్రవేత్తను కోల్పోయిందని మంత్రి అన్నారు. ప్రభుత్వం మృతుల కుటుంబాన్ని అన్ని విధాలు గా ఆదుకుంటుందని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మోతీలాల్, అశ్విని చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు.

బైకు అదుపుతప్పి వ్యక్తి మృతి

విశ్వంభర, పెద్ద శంకరం : పేట శంకరంపేట మండలంలో మార్చేట్పపల్లి గ్రామానికి చెందిన కాయితి రమేష్ బైక్‌పై ప్రయాణిస్తుండగా అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో తీవ్రగాయాలపాలై అధిక రక్త శ్రావం జరిగి అక్కడికక్కడే మరణించాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మార్చేట్ పల్లి గ్రామానికి చెందిన కాయితి రమేశ్ వయసు 38 గ్రామాలు తిరుగుతూ ఎలక్ట్రిక్ పనులు చేస్తూ జీవనం గడుపుతున్నాడు. ఎప్పటిలాగే మంగళవారం ఉదయం ఇంటి నుంచి పనులకు బైక్ బజాజ్ ప్లాటినాఆయన రాత్రి పది గంటల సమయంలో శంకరంపేట నుంచి తన గ్రామానికి వెళుతూ మార్గమధ్యంలో ఉత్తులురు గేటు వద్ద బైకు అదుపుతప్పడంతో కిందపడడంతో తలకు తీవ్ర గాయమై అధిక రక్త శ్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాయితి రమేష్ భార్య కాయితి స్వప్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శంకర్ పేర్కొన్నారు.

ఇద్దరికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

విశ్వంభర, పెద్ద శంకరంపేట: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ మండలాల్లోని ఉపాధ్యాయులను జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు. అందులో పెద్ద శంకరం పేట మండలంలోని ఎంపీపీస్ బాలికల ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు గజ వాడ చంద్ర ప్రకాష్, మల్క పూర్ ప్రాథమిక ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్‌జీటీ ఉపాధ్యాయుడు శేఖర్‌గౌడ్‌లు ఈ అవార్డ్ లు పొందిన వారిలో ఉన్నారు. వారు జిల్లా అవార్డులకు ఎంపికైనందుకు మండల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తపరిచారు. ఇలాంటి అవార్డులు మరెన్నో తీసుకువచ్చి మండలానికి వన్నె తేవాలని మండల ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో జిల్లా పీఆర్‌టీయూ మాజీ గౌరవ అధ్యక్షులు, రామచంద్ర చారి, రాష్ట్ర పీఆర్‌టీయూ అసోసియేట్ అధ్యక్షుడు కరణం వెంకట రవీందర్, నాయకులు సత్యకుమార్, ప్రసన్న, గోపీ తదితరులు ఉన్నారు.

సెయింట్ జాన్స్ పాఠశాలలో ఐపీఎస్ అధికారి అభిషేక్ మొహంతి సందర్శన

విశ్వంభర, కరీంనగర్ : ఐపీఎస్ అధికారి అభిషేక్ మొహంతి సెయింట్ జాన్స్ పాఠశాలను సందర్శించారు. అక్కడ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందితో ఆయన మాట్లాడారు. ఈ సందర్శన విద్యార్థులను ఉజ్వల భవిష్యత్తు వైపు ప్రోత్సహించడం, మార్గనిర్దేశం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నదని ఆయన అన్నారు. ఈ సందర్భంగా అభిషేక్ మొహంతి విద్యార్థులకు చదువుతోపాటు క్రడల్లోనూ రాణించాలని సూచించారు. విజయవంతమైన భవిష్యత్తు కోసం చదువులపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్ సిస్టర్ ఇనలు, ప్రైమరి బ్లాక్ ఇంచార్జి ఆర్ సిస్టర్ ఆరోగయ్య మెర్రి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగికి పదోన్నతులు బదిలీలు సర్వసాధారణం

విశ్వంభర, భూపాలపల్లి : ప్రణాళిక శాఖకు వన్నె తెచ్చిన వ్యక్తి కొంగర శామ్యూల్ అని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయపు సమావేశపు హాలులో ఉప సంచాలకులుగా పదోన్నతి పొంది యాదాద్రి భువనగిరి జిల్లాకు బదిలీపై వెళ్లిన కొంగర శామ్యూల్ ఆత్మీయ అభినందన వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. తనకు అప్పగించిన విధులు నిర్వహణలో అంకితభావం ప్రదర్శించారని అన్నారు. ఉద్యోగికి పదోన్నతులు, బదిలీలు సర్వ సాధారణమని వెళ్లిన చోట కూడా మన్ననలు పొందాలని సూచించారు. అనంతరం మెమెంటోలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. అందరితో స్నేహపూర్వకంగా ఉండేవారని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ముడిపడి ఉన్న పదవి సిపిఓ పదవి అని, అంకెలతో కూడుకున్న విధులని, చాలా అప్రమత్తంగా ఉండేవారని తెలిపారు. శామ్యూల్ మాట్లాడుతూ విధుల నిర్వహణలో ఉద్యోగికి తగ్గింపు, సిబ్బందితో భేషజాలకు వెళ్లకుండా అందరిని కలుపుకుని పోయే నేర్పు, సహనం, అంశాలపై విషదీకరించే స్థాయి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, టీజీవో కార్యదర్శి సంజీవరావు, వైస్ ప్రెసిడెంట్ అవినాష్, మాజీ కార్యదర్శి ఆంజనేయులు, టీఎన్జీవో అధ్యక్షుడు రవి, నాల్గవ తరగతి ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.రి

అలుగు పోస్తున్న నూతనంగా నిర్మించిన చెక్ డ్యామ్

విశ్వంభర, ఆత్మకూరు(ఎం) : యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం కోరటికల్ గ్రామం ఆత్మకూరు గ్రామాల మధ్య ఉన్న బిక్కేరు వాగుపైన నిర్మించిన చెక్ డ్యామ్ గతకొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు నిండి అలుగు పోస్తుంది. నీళ్లు నిండిన చెక్ డ్యామ్ను చూసిన పరిసరప్రాంత రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకి కృతజ్ఞతలు తెలియజేశారు. నిర్మాణం త్వరగా పూర్తి అయ్యేలా కృషిచేసిన ఇరిగేషన్ శాఖ డీఇ సునీల్ ప్రసాద్ వలన ఈరోజు చెక్ డ్యామ్ నిండి అలుగు పోస్తుంది అని రైతులు, నాయకులు తెలిపారు.

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత

విశ్వంభర. మేడిపల్లి : మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో 26వ డివిజన్‌కు సంబంధించిన సీఎం సహాయనిధి చెక్కులను మేయర్ అమర్ సింగ్, డిప్యూటీ మేయర్ శివకుమార్ గౌడ్ లబ్ధిదారులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో సీఎం సహాయనిధి ఆపద్బాంధవుడిలా ఆదుకుంటుందన్నారు. పేద పరిస్థితిలో ఉండి వైద్యం చేయించుకోలేని వారు సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఈ నెల 7, 17న సెలవు ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం

విశ్వంభర, మహబూబాబాద్ : 2024, సెప్టెంబర్ నెలలో.. 7, 17వ తేదీలను సెలవు దినాలుగా ప్రకటిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. మిలాద్ ఉన్ నబీ, గణేష్ చతుర్థి పండుగలకు తెలంగాణ ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. సెప్టెంబర్ 7వ తేదీ గణేష్ చతుర్థి, సెప్టెంబర్ 17న మిలాద్ ఉన్ నబీకి హాలీడే ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, తెలంగాణ సాధారణ సెలవుల క్యాలెండర్ ప్రకారం.. 7వ తేదీ గణేష్ చతుర్థి, సెప్టెంబర్ 16న మిలాద్ ఉన్ నబీకి సెలవుగా డిక్లేర్ చేశారు.అయితే, నెలవంక దర్శనం తేదీని బట్టి మిలాద్ ఉన్ నబీ హాలీడే డేట్ మారింది. మొదట నిర్ణయించిన 16న కాకుండా.. 17వ తేదీని మిలాద్ ఉన్ నబీ హాలీడే గా ప్రభుత్వం తాజాగా డిక్లేర్ చేసింది. ఈ నెల 7వ తేదీన గణేష్ వినాయక చవిత ప్రారంభం కానుండగా.. 17న నిమజ్జనం జరగనుంది. 17న వినాయక నిమజ్జనం జరగనుండటం తో అదే తేదీన జరగాల్సిన మిలాద్ ఉన్ నబీ ఊరేగింపు ర్యాలీ వాయిదా పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. 19వ తేదీన మిలాద్ ఉన్ నబీ ఊరేగింపు ర్యాలీ జరిగే ఛాన్స్ ఉన్నట్లు సమాచారం.

వరద బాధితులకు ఒక రోజు జీతం

విశ్వంభర, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్, సభ్యులు ఏ.సత్యనారాయణ,డా.ఎస్.ఎం.హుస్సేని (ముజీబ్) ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖ మాత్యులు, ఉప ముఖ్యమంత్రి శ్రీ.మల్లు భట్టి విక్రమార్క గారిని కలిసి ఒకరోజు వేతనం వరద బాధితుల సహాయ నిధికి సెప్టెంబర్ జీతంలో తీసుకోవాల్సిందిగా వినతి పత్రం సమర్పించడం జరిగింది. కార్యక్రమంలో సభ్యులు శ్యామ్, కస్తూరి వెంకట్, ముత్యాల సత్యనారాయణ గౌడ్, చంద్రశేఖర్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

మట్టి గణనాథులను ప్రతిష్ఠించాలి ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

విశ్వంభర, దేవరకొండ : పర్యావరణ పరిరక్షణలో భాగంగా గణపతి ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం దేవరకొండ పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాలతో పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతున్నదన్నారు. ప్రతి ఒక్కరూ మట్టి గణనాథులను ప్రతిష్ఠించి పూజించాలని పిలుపు నిచ్చారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేస్తే పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, కమీషనర్ భాస్కర్ రెడ్డి, డిఎస్పి గిరిబాబు, ఆర్డీవో శ్రీరాములు, తహసీల్దార్ సంతోష్ కిరణ్, కౌన్సిలర్లు సైదులు, కొండ్ర మల్లీశ్వరి శ్రీశైలం యాదవ్, పిఎసిఎస్ చైర్మన్ శ్రీశైలం యాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుక్కల గోవర్ధన్ రెడ్డి, మాజి మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కమల్ల వెంకటయ్య, సతీష్ రెడ్డి, ప్రదీప్, గాజుల మురళి, మున్సిపల్ సిబ్బది తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ ఏరోబిక్స్, డాన్స్, జుంబ ఫిట్నెస్ స్టూడియోను ప్రారంభించిన సీనియర్ నాయకులు దాన గళ్ళ

విశ్వంభర, మేడిపల్లి: ఎన్ఎస్ ఎరబిక్స్, డాన్స్, జుంబ ఫిట్నెస్ స్టూడియోను ప్రారంభించిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ రిలయన్స్ స్మార్ట్ పై భాగంలో నాలుగవ అంతస్తులో ఎన్ఎస్ నట శివ ఫిట్నెస్ స్టూడియో స్థాపకులు అనిల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దానగళ్ళ యాదగిరి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థాపకులు అనిల్ మాట్లాడుతూ నట శివ ఫిట్నెస్ స్టూడియోలు లో ఏరబిక్స్, జుంబా మరియు డాన్స్ కూడా నేర్పించబడుతుందని, ఈరోజుల్లో కలుషిత పదార్థాలు తినడం వలన చాలామంది అనారోగ్యానికి గురవుతున్నారని, హార్ట్ ఎటాకులు చిన్నవయసులో కూడా వస్తున్నాయని, దానిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండడం బాడీ ఫిట్నెస్ లో ఉండడం ఎంతో అవసరమని గుర్తు చేశారు. ఈ ఫిట్నెస్ స్టూడియో ద్వారా ఆటపాటలతో వయసుతో సంబంధం లేకుండా శారీరక ధృఢత్వాన్ని పెంచుకుంటూ బాడీని మోల్డ్ చేసుకునే అవకాశం ఉందని, అతి తక్కువ ధరతో అందరికి అందుబాటులో ఉండే విధంగా ఈ ఎన్ఎస్ స్టూడియోను ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ యాజమాన్యం కే మంజుల, అంజమ్మ,గోపు రాములు, నానాజీ ,శ్రీనివాస్, శంకర్, భగవాన్, సాల నరసింహ, వేణు, కృష్ణ ,కిషోర్, భీమ్రావు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ స్థల పరిశీలన

విశ్వంభర, మేడ్చల్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంబిపూర్, మల్లంపేట్ మరియు బౌరంపేట్ గ్రామంలో 3 -ఫేస్ కరెంటు ఒడిదుడుకులు మరియు కరెంటు రాకపోవడంతో గత నెల కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి గారి దృష్టికి కె .వి ఆర్ ,స్ప్రింగ్ వుడ్స్ , ప్రణీత్ నతురల్ బౌంటీ, ల్యక్ రిడ్జ్ కాలనీ వాసులు విన్నపించగా వారు వెంటనే స్పందించి మరియు గార్లతో మాట్లాడి సబ్ స్టేషన్ మంజూరు చేయించారు. ఈ సందర్భంగా బుధవారం శంబిపూర్, మల్లంపేట్, బౌరంపేట్ గ్రామంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు స్థలాన్ని పై అధికారులతో పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, ట్రాన్స్కో రంజీ, అరుణ్, రవికుమార్, జీడిమెట్ల విష్ణువర్ధన్ రెడ్డి, బాచుపల్లి- శాంత కుమార్, కూకట్ పల్లి -చక్రవర్తి ,మియాపూర్-హరికృష్ణ,భౌరంపేట్- సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు యోధుడు పల్లపు జంగయ్య మృతి బాధాకరం ఉజ్జిని యాదగిరిరావు

విశ్వంభర, చింతపల్లి : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) చింతపల్లి మండల సహాయ కార్యదర్శి పల్లపు లక్ష్మయ్య తండ్రి పల్లపు జంగయ్య మృతి బాధాకరమని మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరి రావు అన్నారు. మండల పరిధిలోని గోడకొండ గ్రామానికి చెందిన కమ్యూనిస్టు పార్టీ కార్యకర్త పల్లపు జంగయ్య బుధవారం మృతి చెందారు. ఆయన పార్థివ దేహానికి భారత కమ్యూనిస్టు పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో యాదగిరిరావు పూలమాలలు వేసి, నివాళులర్పించి, మృతుడి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పల్లపు లక్ష్మయ్యను ఓదార్చి ఆయన కుటుంబానికి సిపిఐ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, మండల సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్ రావు, గ్యార పరుశరాములు, గ్యార పెద్దయ్య, కొడుదూటి సైదులు, గిరి వెంకటమ్మ, పి ముత్యాలు, కే ముత్యాలు, కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

డిండిలో సెంటర్ ఫర్ వరల్డ్ యువతి సమ్మేళనం

విశ్వంభర, డిండి : డిండి మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాలలో సెంటర్ ఫర్ వరల్డ్ పాలిడాంటీ గ్రామ్య సంస్థ కలిసి యువతి సమ్మేళనం ఏర్పాట్లు చేశారు. 350 మంది కిశోర బాలికలు హాజరైన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సై రాజు హాజరై మాట్లాడారు.. ఆడి పిల్లలు అందరూ కూడా ధైర్యంగా ముందడుగు వేస్తూ ఆరోగ్యం గా ఉండాలని, ఏదైనా హెల్ప్ కావాలంటే తప్పకుండా పోలీస్ సాఫోట్ తీసుకోవాలన్నారు. సంస్థ ద్వారా రాజ్యాంగ హక్కులు నాయకత్వం పౌష్టికాహారం వేరిమడ్స్ సముదాయంలో వస్తున్నట్టు వంటి ఇబ్బందుల గురించి ఆడపిల్లలు యొక్క కలలను ఎలా సాకర్యం చేసుకోవాలని అనేది వివరించారు. సేంద్రీయ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీడబ్ల్యూఎస్ ప్రతినిధి లక్ష్మీనారాయణ, గ్రామం నుండి, రుక్మిణి రావు, సుమలత, ఇందిరా, ఆంజనేయులు, వివిధ స్కూల్, టీచర్లు, సంఘం, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ మంజూరు చేయించారు

విశ్వంభర, మేడ్చల్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంబిపూర్, మల్లంపేట్ మరియు బౌరంపేట్ గ్రామంలో 3 -ఫేస్ కరెంటు ఒడిదుడుకులు మరియు కరెంటు రాకపోవడంతో గత నెల కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి గారి దృష్టికి కె .వి ఆర్ ,స్ప్రింగ్ వుడ్స్, ప్రణీత్ నతురల్ బౌంటీ, ల్యక్ రిడ్జ్ కాలనీ వాసులు విన్నపించగా వారు వెంటనే స్పందించి మరియుగార్లతో మాట్లాడి సబ్ స్టేషన్ మంజూరు చేయించారు. ఈ సందర్భంగా బుధవారం శంబిపూర్, మల్లంపేట్, బౌరంపేట్ గ్రామంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు స్థలాన్ని పై అధికారులతో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, ట్రాన్స్కో రంజీ,అరుణ్, రవికుమార్, -జీడిమెట్ల విష్ణువర్ధన్ రెడ్డి,బాచుపల్లి- శాంత కుమార్, కూకట్ పల్లి -చక్రవర్తి మియాపూర్-హరికృష్ణ,బౌరంపేట్- సాయికుమార్ పాల్గొన్నారు.

రాత్రివేళల్లో పేలుళ్లా?

జూబ్లీహిల్స్‌లో కొండ రాళ్ల తొలగింపుపై హైకోర్టులో విచారణ : ప్రతివాదులకు నోటీసులు

విశ్వంభర,తెలంగాణ బ్యూరో: జూబ్లీహిల్స్ ప్రాంతంలో కొండ రాళ్ల తొలగింపునకు పేలుళ్లు జరపడంపై తెలంగాణ హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. వాదనల సందర్భంగా ప్రతివాదులకు సీజే ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. కొండ రాళ్ల తొలగింపునకు రాత్రి వేళల్లో పేలుళ్లు జరుపుతున్నారని మీడియాలో ఇటీవల కథనం వచ్చింది. దీని ఆధారంగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి న్యాయమూర్తి జస్టిస్ భీమపాక నగేశ్ లేఖ రాశారు. రాత్రి వేళ్లల్లో భారీ పేలుళ్లు జరుపుతున్నారని అందులో పేర్కొన్నారు. దీనిపల్ల న్యాయవిహార్, భరణి లేఅవుట్, రామానాయుడు స్టూడియో ప్రాంతంలో నివాసముండే వాళ్లకు నిద్ర ఉండటం లేదని చెప్పారు. పేలుళ్ల తర్వాత బండరాళ్లను రాత్రి వేళల్లో భారీ వాహనాల్లో తరలిస్తున్నారని జస్టిస్ భీమపాక నగేశ్ వివరించారు. దీంతో ఆ లేఖను సీజే ధర్మాసనం ప్రజాప్రయోజన వ్యాజ్యంగా స్వీకరించి విచారణ చేపట్టింది. భూగర్భ గనులు, పర్యావరణ శాఖ, పురపాలక శాఖల ముఖ్య కార్యదర్శులు, కాలుష్య నియంత్రణ మండలి, జీహెచ్ఎంసీ కమిషనర్‌కు నోటీసులు జారీచేసింది. అనంతరం విచారణను వాయిదా వేసింది.

హైదరాబాద్ విజయవాడ మధ్య ప్రయాణించేవారికి 10% రాయితీ ప్రయాణికులకు ఊరట కల్పించిన టీజీ ఆర్టీసీ

విశ్వంభర ,తెలంగాణ బ్యూరో: భారీ వర్షాలు, వరదలు తెలుగు రాష్ట్రాలను అతలాకుతలం చేస్తున్న వేళ టీజీఎస్ ఆర్టీసీ కొంత ఊరట కల్పించే నిర్ణయం తీసుకుంది. గత కొన్ని రోజులుగా రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ - విజయవాడ మధ్య రాకపోకలు సాగించే ప్రయాణికులకు టికెట్ ధరలో 10 శాతం డిస్కౌంట్ ఇవ్వనున్నట్లు ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. ఈ 10 శాతం రాయితీ ఆఫర్ ఈ నెల 30వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని అధికారులు తెలిపారు. హైదరాబాద్, విజయవాడ నగరాల మధ్య ప్రయాణించే వారు ఈ డిస్కౌంట్ సదుపాయాన్ని వినియోగించుకోవాలని టీజీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.

సమస్యలు వినడానికి, పరిష్కారానికి సిద్ధంగా ఉన్నాం ఉద్యోగ సంఘాల నేతలతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

విశ్వంభర, హైదరాబాద్: ఉద్యోగుల పట్ల ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం అత్యంత సానుకూల దృక్పథంతో ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.బుధవారం సచివాలయంలో బాబా సాహెబ్ అంబేద్కర్ తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసీ) సభ్యులు ఉప ముఖ్యమంత్రిని కలిసి తమ సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసిన టీజీఈజేఏసీ ఛైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ ఏలూరి శ్రీపివాసన రావు, తెలంగాణ జేఏసీ స్టీరింగ్ కమిటీ మెంబర్ దేవరకొండ సైదులు ఇతర ముఖ్యనాయకులు 39 డిమాండ్లను ఆయన ముందుంచారు. ఉప ముఖ్యమంత్రి ముందుంచిన డిమాండ్లలో ప్రధానంగా పెండింగ్ లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరారు. పే రివిజన్ కమిషన్ రిపోర్టును వెంటనే తెప్పించుకుని అమలు, ఉద్యోగులకు 51 శాతం పిట్ మెంట్ ను అమలు చేయాలని కోరారు. ఉద్యోగులకు హెల్త్ కార్డులు జారీ చేయడంతో పాటు, ఉద్యోగులకు సంబంధించిన ఈ కుబేర్ లో ఉన్న పెండింగ్ బిల్లులను వెంటను క్లియర్ చేయాలి. ఈ కుబేర్ సిస్టమ్ ను రద్దు చేయాలని వారు ఉప ముఖ్యమంత్రిని కోరారు. ఎన్నికల సందర్భంగా బదిలీ చేసిన ఉద్యోగులను తిరిగివారిన పాత స్టేషన్ కు బదిలీ చేయాలి. సీపీఎస్ ను రద్దు చేయాలి. జీఓ 317ను సమస్యలను వెంటనే పరిష్కరింయాలి. ఎంప్లాయిస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ను పునరుద్దరించాలని కోరారు. జేఏసీ నాయకుల డిమాండ్లపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పందిస్తూ.. ఇది ప్రజా ప్రభుత్వం, ప్రజల కోసం పనిచేస్తున్న ప్రభుత్వం అని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం సానుకూలంగా ఉంటుందని స్పష్టంగా చెప్పారు. సమస్యల ఆపరిష్కారానికి ఉద్యోగులతో ప్రభుత్వం ఎన్నిసార్లు అయినా చర్చించేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు.

డీఎస్సి ఫైనల్ కీ వాయిదాల పర్వం పై అభ్యర్థుల ఆగ్రహం

విశ్వంభర ,తెలంగాణ బ్యూరో : గత వారం రోజుల నుండి ఈ రోజు లేదా రేపు ఫైనల్ కీ అంటూ విద్యాశాఖ పేర్కొంటూ...మళ్ళీ వాయిదాలు వేయడం పట్ల అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. ఇస్తే ఇస్తామని ఒక ఖచ్చిత మైన తేదీ ఇవ్వాలని అలా కాకుండా ఇదిగో అదిగో అంటూ డీఎస్సి అభ్యర్థులను గందర గోళ పరచడం సరికాదని అభ్యర్థులు విద్యాశాఖ పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.డీఎస్సి ఫైనల్ కీ వెంటనే విడుదల చేయాలని అలాగే త్వరగా జిల్లాల వారీగా జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. 11062 టీచర్ పోస్టులకు డీఎస్సి పరీక్షలు జులై 18 నుండి ఆగస్ట్ 5 వరకు ఆన్ లైన్ విధానం లో నిర్వహించారు. 2.45 లక్షల మంది అభ్యర్థులు హాజారు అయ్యారు. ప్రాథమిక కీ ఆగస్ట్ 13 న విడుదల చేశారు. వీటిపై అభ్యర్థులు 28 వేల అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కానీ ఇప్పటివరకు ఫైనల్ కీ విడుదల చేయలేదు అదిగో ఇదిగో అంటూ ప్రకటనలు... గత వారం రోజులుగా ఫైనల్ కీ పై విద్యాశాఖ అధికారులు పూటకో మాట చెప్తున్నారని అభ్యర్థులు మండి పడుతున్నారు. ఇప్పటికైన ఫైనల్ కీ విడుదల చేసి వెంటనే జనరల్ ర్యాంకింగ్ లిస్టు విడుదల చేసి డీఎస్సి ఫలితాలు ప్రకటించాలని దసరా లోపే నియామక ప్రక్రియ పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూన్నారు.

పంచాయతీ కార్యదర్శి తీరుపై ఎంపీడీఓకు ఫిర్యాదు

విశ్వంభర, తలకొండపల్లి : తలకొండపల్లి మండలంలోని గడ్డమీది తాండ పంచాయతీ కార్యదర్శి రాణి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందంటూ స్థానిక ఎంపీడీఓకు గ్రామానికి చెందిన పలువురు నాయకులు బుధవారం ఫిర్యాదు చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తండాలో ఒక వ్యక్తి ఇల్లు కూలిపోయిందని ఈ విషయంపై సమాచారం ఇవ్వాలంటే ఆమె ఫోన్ ఎత్తడం లేదని ఎన్ఎస్ఈయూఐ మండల ప్రెసిడెంట్ రమేశ్ నాయక్ తెలిపారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఐపీఎస్ అధికారి అభిషేక్ మొహంతి సందర్శన

విశ్వంభర, కరీంనగర్ : ఐపీఎస్ అధికారి అభిషేక్ మొహంతి సెయింట్ జాన్స్ పాఠశాలను సందర్శించారు. అక్కడ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందితో ఆయన మాట్లాడారు. ఈ సందర్శన విద్యార్థులను ఉజ్వల భవిష్యత్తు వైపు ప్రోత్సహించడం, మార్గనిర్దేశం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నదని ఆయన అన్నారు. ఈ సందర్భంగా అభిషేక్ మొహంతి విద్యార్థులకు చదువుతోపాటు క్రడల్లోనూ రాణించాలని సూచించారు. విజయవంతమైన భవిష్యత్తు కోసం చదువులపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్ సిస్టర్ ఇనలు, ప్రైమరి బ్లాక్ ఇంచార్జి ఆర్ సిస్టర్ ఆరోగయ్య మెర్రి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండండి: కలెక్టర్ రాహుల్ శర్మ

విశ్వంభర,భూపాలపల్లి : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అత్యవసరమైతే తప్ప ఇండ్ల నుండి బయటకు రావద్దని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. క్షేత్రస్థాయి నుండి ప్రజలు, అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. సహాయక చర్యలు, పునరావాస కేంద్రాలు ఏర్పాట్లలో అలసత్వం వహించొద్దని సూచించారు. ముంపు ప్రాంతాల ప్రజల రక్షణలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. అధికార యంత్రాంగం అన్ని సమయాలలోను అప్రమత్తంగా ఉండాలని, భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు అత్యవసర సేవలకు కలెక్టరేట్ తో పాటు అన్ని మండలాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర సేవలకు ప్రజలు కలెక్టరేట్ నందు 24 గంటలు పనిచేయు విధంగా ఏర్పాటు చేసిన 9030632608, 18004251123 కంట్రోల్ రూము నంబర్లకు ఫోన్ చేయాలని అన్నారు. గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అధికార యంత్రాంగం అప్రమత్తంగా, అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వ సిబ్బంది అత్యవసర సేవల్లో ఉన్నందున ఎలాంటి సెలవులు అనుమతించ బడవని తెలిపారు. ప్రజలు విపత్కర పరిస్థితుల్లో ఉన్నారని యంత్రాంగం అన్ని తానై పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యత ఉందని ఆయన పేర్కొన్నారు. ఎడతెరిపి లేని వర్షాల వల్ల జిల్లాలోని అన్ని చెరువులు, వాగులు ప్రమాదకర స్థాయిలో పొంగి పొర్లుతున్నాయని, చెరువులు, వాగులు చూసేందుకు ప్రజలు వెళ్ళొద్దని సూచించారు. గత ఐదు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు చిన్నా, పెద్ద చెరువులు, వాగులు నిండుకుని ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయని, పొంగి పొర్లుతున్న చెరువులు, వాగులు, వంకలు చూసేందుకు, సెల్ఫీలు, ఫోటోల కోసం ప్రజలు వస్తుంటారని, నీటి ప్రవాహం వల్ల ప్రమాదం పొంచి ఉందని, పడిపోయే అవకాశాలున్నాయని ఎవరూ వెళ్ళొద్దని ఆయన అన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా వుండాలని అన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్ళొద్దని సూచించారు. అలాగే పశువులను మేతకు బయటికి వదలొద్దని ఆయన తెలిపారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ముందస్తు ప్రణాళికలతో చేపట్టిన చర్యల్లో ప్రభుత్వ యంత్రాంగపు విధులను కలెక్టర్ అభినందించారు. పూర్తిగా

వర్షాలు వరదలు తగ్గి పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చే వరకు ఇదే పనితీరును కనబరిచాలని అన్నారు. విపత్కర పరిస్థితిల్లో ప్రజలు యంత్రాంగపు సలహాలు, సూచనలు పాటించాలని కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు.

కేసీఆర్ కనబడుట లేదు

■ హైదరాబాద్‌లో వెలిసిన పోస్టర్లు ■ వరదలపై స్పందించని వైనంపై విమర్శలు

విశ్వంభర ,తెలంగాణ బ్యూరో: తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ 'కనబడుట లేదు'.. అంటూ హైదరాబాద్‌లో పోస్టర్లు వెలిశాయి. కేసీఆర్ ఫొటోని ముద్రించి ఈ పోస్టర్లను రూపొందించారు. "రెండుసార్లు అధికారం ఇచ్చిన ప్రజలు వరదల్లో నానా ఇబ్బందులు పడుతుంటే పత్తాలేని ప్రతిపక్ష నేత కేసీఆర్" అని పోస్టర్‌పై రాసుకొచ్చారు. కాగా ఇటీవల రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు, వరదలతో పలు ప్రాంతాలు అతలాకుతలం అయ్యాయి. ముఖ్యంగా ఖమ్మం జిల్లా ఎన్నడూ చూడని వరదల అల్లకల్లోలాన్ని చవిచూసింది. అయినప్పటికీ ఈ వరదల విలయంపై మాజీ సీఎం కేసీఆర్ ఇప్పటివరకు ఒక్కసారి కూడా స్పందించలేదు. ప్రభావిత ప్రాంతాల సందర్శనలకు వెళ్ల లేదు సరికదా.. కనీసం సోషల్ మీడియాలోనైనా ఒక ప్రకటన విడుదల చేయలేదు. ఈ నేపథ్యంలో 'కేసీఆర్ కనబడుట లేదు' అంటూ పోస్టర్లు వెలిశాయి. ఈ పోస్టర్లు ఎవరు అతికించారనే విషయం తెలియరాలేదు. కానీ కేసీఆర్ వైఖరి చర్చనీయాంశమైంది.

కేసీఆర్‌పై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు

వరద బాధితులను పరామర్శించేందుకు కేసీఆర్ ఎందుకు బయటకు రావడం లేదని కాంగ్రెస్ శ్రేణులు ప్రశ్నిస్తున్నాయి. దాదాపు రెండు మూడు రోజులు కురిసిన భారీ వర్షాలతో ముంచెత్తిన వరదలతో ఖమ్మం పట్టణం, పరిసర ప్రాంతాలు, మహబూబాబాద్ ప్రాంతాలు విలవిల్లాడిపోయారు. ఆ ప్రాంత ప్రజలు హడలెత్తిపోయాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఇతర మంత్రులు ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. సీఎం ఒకరోజు రాత్రి ఖమ్మంలోనే ఉండి కలెక్టరేట్ కార్యాలయం నుంచి పరిస్థితిని సమీక్షించారు. ఎన్నడూ చూడని వరదలు వచ్చాయని, బాధితులను ఆదుకునేందుకు విరాళాలు అందించాలని ఆయన కోరారు. అయితే ఇంత జరుగుతున్న మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుతం ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్ నుంచి కనీస స్పందనలేకపోవడంపై కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు. ఇక సోషల్ మీడియాలో ఈ మేరకు మీమ్స్ కూడా పేలుతున్నాయి.

బీఆరెస్‌నేతలు పర్యటిస్తున్నా..

మాజీ మంత్రి హరీశ్ రావు, ఎమ్మెల్యేలు, పలువురు మాజీ మంత్రులు క్షేత్ర స్థాయిలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించినప్పటికీ.. మాజీ ముఖ్యమంత్రిగా, బీఆర్ఎస్ అధినేతగా ఉండి కనీసం స్పందించకపోవడం ఏంటనే ప్రశ్నలు కేసీఆర్‌కు ఎదురవుతున్నాయి. ప్రజలు కష్టకాలంలో ఉన్నప్పుడు కనీసం పరామర్శకు వెళ్లకపోవడం ఏమిటని అధికార పక్షం తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది. మరోవైపు మాజీ మంత్రి, పార్టీ కార్యనిర్వహక అధ్యక్షుడు

కేటీఆర్ విదేశీ పర్యటనలో ఉండడంపై కూడా కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నాయి. అమెరికాలోజల్సాలు చేస్తూ ప్రభుత్వాన్ని కేటీఆర్ విమర్శిస్తున్నారంటూ కాంగ్రెస్ మంత్రులు ఆగ్రహం వ్యకం చేస్తున్నారు. నిజానికి బీఆర్ఎస్ నేతలు, మాజీ మంత్రులు వరద ప్రాంతాల్లో పర్యటించినప్పటికీ పార్టీకి అగ్రనేతలైన కేసీఆర్,కేటీఆర్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించకపోవడం విమర్శలకు తావిస్తోంది. సీఎంగా పదేళ్లపాటు అవకాశం కల్పిస్తే జనం కష్టాలపై కనీసం స్పందించరా అంటూ కాంగ్రెస్ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి.

గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి

విశ్వంభర, ఆమనగల్లు: ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని శంషాబాద్ డీసీపీ బి.రాజేష్ అన్నారు. ఆమనగల్లు పట్టణ కేంద్రంలో బుధవారం శ్రీలక్ష్మి గార్డెన్లో సీఐ ప్రమోద్ కుమార్ అధ్యక్షతన గణేష్ ఉత్సవాలపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పట్టణంలో, గ్రామాల్లోనెలకొల్పనున్న వినాయక మండపాలకు పోలీస్ శాఖ అనుమతి కోసం ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని, మండపాల వద్ద, ఊరేగింపుల్లో డీజేలకు అనుమతి లేదని తెలిపారు. రాత్రి 10గంటలలోపే మైక్ సెట్లను బంద్ చేయాలని ఆయన తెలిపారు. సమన్వయంతో ఎలాంటి అవాంఛనీయ సంఘ టనలు జరగకుండా ఉత్సవాలు నిర్వహించుకోవాలని సూచించారు. ఎస్సై వెంక టేష్, ఎమ్మార్వో సీహెచ్ లలిత, ఎంపీడీవో కుసుమ మాదిరి, మున్సిపల్ కమిషనర్ వసంత, సంఘ సేవకులు పాపిశెట్టి రాము, గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆహార పొట్లల పంపిణీ

విశ్వంభర, ఆత్మకూరు(ఎం): అకాలవర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాలకు సహాయం అందించడంలో ప్రభుత్వం వేగం పెంచాలని బీజేపీ మహిళ మోర్చ యాదాద్రి భువనగిరి జిల్లా ఉప అధ్యక్షురాలు శామకూర చిత్రమధు ముదిరాజ్ అన్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా పోచారం మునిసిపాలిటీ పరిధిలోని జోడిమెట్లలో స్వర్ణగిరి కాలనిలో మంగళవారం భారీ వర్షం కురిసి ఇళ్లలోకి నీరు చేరడంతో రాత్రంతా ఇళ్లలో నివాసం ఉంటున్న వారు సహాయం చేసే వారు లేక తిండి, నిద్ర లేకుండా పడిగాపులు గాసారు. విషయం తెలుసుకున్న బీజేపి మహిళ మోర్చ జిల్లా ఉప అధ్యక్షురాలు శామకూర చిత్రమధు వారిని నేరుగా కలిసి వారి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వారికి ఆహార ప్యాకెట్లను పంపిణీ చేసి ధైర్యంగా ఉండాలని సూచించారు. వర్షాల కారణంగా రాష్ట్రంలో పలు ప్రాంతాలు నీట మునిగాయని తిండి నిద్ర లేకుండా ఎన్నో కుటుంబాలు సహాయం కోసం ఎదురుచూస్తూ పడిగాపులు కాస్తున్నారని అన్నారు. ప్రభుత్వం సహాయ చర్యలు వేగవంతం చేసి బాధితులకు వెంటనే రక్షణ కల్పించి పునరావాసం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

సెయింట్ జాన్స్ పాఠశాలలో ఐపీఎస్ అధికారి అభిషేక్ మొహంతి సందర్శన

విశ్వంభర, కరీంనగర్: ఐపీఎస్ అధికారి అభిషేక్ మొహంతి సెయింట్ జాన్స్ పాఠశాలను సందర్శించారు. అక్కడ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందితో ఆయన మాట్లాడారు. ఈ సందర్శన విద్యార్థులను ఉజ్వల భవిష్యత్తు వైపు ప్రోత్సహించడం, మార్గనిర్దేశం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నదని ఆయన అన్నారు. ఈ సందర్భంగా అభిషేక్ మొహంతి విద్యార్థులకు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. విజయవంతమైన భవిష్యత్తు కోసం చదువులపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్ సిస్టర్ ఇనలు, ప్రైమరి బ్లాక్ ఇంచార్జి ఆర్ సిస్టర్ ఆరోగయ్య మెర్రి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యను పరిష్కరించిన ఇరిగేషన్ అధికారి

విశ్వంభర, ఆత్మకూరు(ఎం): చెక్ డ్యాం నుంచి నీరు లీకేజ్ అవుతుందని వాట్సాప్ ద్వారా సమాచారాన్ని తెలుసుకున్న ఇరిగేషన్ శాఖ డీఇ సునీల్ ప్రసాద్ రాత్రికి రాత్రి సమస్యను పరిష్కరించారు. మంగళవారం ఆత్మకూరు(ఎం)మండలం తుర్కల రేపాక గ్రామంలోని బిక్కెరు వాగులో చెక్ డ్యాంకు బుంగ పడి నీరు లీకేజి అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారని వాట్సాప్‌లో వచ్చిన సమాచారాన్ని తెలుసుకొని రాత్రి 10:00 గం.ల సమయంలో తన సహచర అధికార సిబ్బంది, స్థానికుల సహకారంతో సమస్యను పరిష్కరించారు. డీఇ సునీల్ ప్రసాద్ మాట్లాడుతూ.. తుర్కల రేపాక గ్రామం బిక్కెరు వాగులో నీటి నిల్వ కోసం ఉపాధిహామీ పనిలో భాగంగా కట్టిన కరకట్ట అని అది చెక్ డ్యాం కాదని, అయినా రైతుల కోసం భూ గర్భ జలాల రక్షణ నిమిత్తం కట్టిన కరకట్ట నీటి లీకేజిని అరికట్టుటకు ప్రయత్నించామని,శాశ్వతపరిష్కారం కోసం ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నట్లు తెలిపారు.

పౌష్టికాహారంతోనే పిల్లల్లో ఎదుగుదల: సూపర్వైజర్ భాగ్యమ్మ

విశ్వంభర, పెద్ద శంకరంపేట: అంగన్వాడీ కేంద్రాల్లో అందించే సంపూర్ణ పౌష్టికాహారంతో పిల్లల ఎదుగుదల ఉంటుందని శంకరంపేట్ సూపర్వైజర్ భాగ్యమ్మ అన్నారు. పోషణ మాసం సందర్భంగా పెద్ద శంకరంపేట కేంద్రంలోని తొమ్మిదవ అంగన్వాడీ కేంద్రంలో పిల్లల బరువులను తీసి తక్కువ బరువులు ఉన్న పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రుల సమక్షంలో తల్లి పాలతో పాటు అంగన్వాడీ కేంద్రంలో అందించే అనుబంధ పోషకాహారమైన బాలామృతం పాలు గుడ్లు పిల్లల ఎదుగుదలలో వాటి అవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ భాగ్యమ్మ, ఏఎన్ఎం సునీత, జ్యోతి, ఆశ వర్కర్ సౌందర్య, అంగన్వాడీ సరళ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బైకు అదుపుతప్పి వ్యక్తి మృతి

విశ్వంభర, పెద్ద శంకరం: పేట శంకరంపేట మండలంలో మార్చేట్పపల్లి గ్రామానికి చెందిన కాయితి రమేష్ బైక్‌పై ప్రయాణిస్తుండగా అదుపుతప్పి కిందప డ్డాడు. దీంతో తీవ్రగాయాలపాలై అధిక రక్త శ్రావం జరిగి అక్కడికక్కడే మరణించాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మార్చేట్ పల్లి గ్రామానికి చెందిన కాయితి రమేశ్ వయసు 38 గ్రామాలు తిరుగుతూ ఎలక్ట్రిక్ పను లు చేస్తూ జీవనం గడుపుతున్నాడు. ఎప్పటిలాగే మంగ ళవారం ఉదయం ఇంటి నుంచి పనులకు బైక్ బజాజ్ ఆయన రాత్రి పది గంటల సమయంలో శంకరంపేట నుంచి తన గ్రామానికి వెళుతూ మార్గమధ్యంలో ఉత్తులురు గేటు వద్ద బైకు అదుపుతప్పడంతో కిందపడడంతో తలకు తీవ్ర గాయమై అధిక రక్త శ్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాయితి రమేష్ భార్య కాయితి స్వప్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శంకర్ పేర్కొన్నారు.

ఇద్దరికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

విశ్వంభర, పెద్ద శంకరంపేట : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ మండలాల్లోని ఉపాధ్యాయులను జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు. అందులో పెద్ద శంకరం పేట మండలంలోని ఎంపీపీస్ బాలికల ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు గజవాడ చంద్ర ప్రకాష్, మల్కా పూర్ ప్రాథమిక ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్జీటీ ఉపాధ్యాయుడు శేఖర్‌గౌడ్‌లు ఈ అవార్డ్ లు పొందిన వారిలో ఉన్నారు. వారు జిల్లా అవార్డులకు ఎంపికైనందుకు మండల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తపరిచారు. ఇలాంటి అవార్డులు మరెన్నో తీసుకువచ్చి మండలానికి వన్నె తేవాలని మండల ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో జిల్లా పీఆర్‌టీయూ మాజీ గౌరవ అధ్యక్షులు, రామచంద్ర చారి, రాష్ట్ర పీఆర్‌టీయూ అసోసియేట్ అధ్యక్షుడు కరణం వెంకట రవీందర్, నాయకులు సత్యకుమార్, ప్రసన్న, గోపీ తదితరులు ఉన్నారు.

డీఎస్సీ ఫైనల్ కీ వాయిదాల పర్వం పై అభ్యర్థుల ఆగ్రహం

విశ్వంభర,తెలంగాణ బ్యూరో: గత వారం రోజుల నుండి ఈ రోజు లేదా రేపు ఫైనల్ కీ అంటూ విద్యాశాఖ పేర్కొంటూ...మళ్ళీ వాయిదాలు వేయడం పట్ల అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. ఇస్తే ఇస్తామని ఒక ఖచ్చిత మైన తేదీ ఇవ్వాలని అలా కాకుండా ఇదిగో అదిగో అంటూ డీఎస్సీ అభ్యర్థులను గందరగోళ పరచడం సరికాదని అభ్యర్థులు విద్యాశాఖ పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డీఎస్సి ఫైనల్ కీ వెంటనే విడుదల చేయాలని అలాగే త్వరగా జిల్లాల వారీగా జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. 11062 టీచర్ పోస్టులకు డీఎస్సి పరీక్షలు జులై 18 నుండి ఆగస్ట్ 5 వరకు ఆన్ లైన్ విధానం లో నిర్వహించారు. 2.45 లక్షల మంది అభ్యర్థులు హజారు అయ్యారు. ప్రాథమిక కీ ఆగస్ట్ 13 న విడుదల చేశారు. వీటిపై అభ్యర్థులు 28 వేల అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కానీ ఇప్పటివరకు ఫైనల్ కీ విడుదల చేయలేదు అదిగో ఇదిగో అంటూ ప్రకటనలు... గత వారం రోజులుగా ఫైనల్ కీ పై విద్యాశాఖ అధికారులు పూటకో మాట చెప్తున్నారని అభ్యర్థులు మండి పడుతున్నారు. ఇప్పటికైన ఫైనల్ కీ విడుదల చేసి వెంటనే జనరల్ ర్యాంకింగ్ లిస్టు విడుదల చేసి డీఎస్సి ఫలితాలు ప్రకటించాలని దసరా లోపే నియామక ప్రక్రియ పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

గడువులోపు పూర్తి చేయాలి

ఆరాంఘర్- జూ పార్క్‌పై ఓవర్‌ను సందర్శించిన కమిషనర్ ఆమ్రపాలి

విశ్వంభర,హైదరాబాద్: పాత బస్తీ నుంచి శివారు ప్రాంతాలకు వెళ్లే రహదారుల్లో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఆరాంఘర్ నుంచి జూ పార్క్ వరకు నిర్మించ తలపెట్టిన ఫ్లైఓవర్ ను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఆదేశించారు. చార్మినార్ జోన్ లో పలు ప్రాంతాల్లో చెపట్టిన రోడ్డు పనులు ను పరిశీలనలో భాగంగా ఆరాంఘర్ నుండి జూ పార్కు వరకు చేపట్టిన ఫ్లై ఓవర్ పనులను పరిశీలించారు. ఫ్లై ఓవర్ సర్వీస్ రోడ్డు కావల్సిన భూసేకరణ పూర్తిచేయాలని టౌన్ ప్లానింగ్ ప్రాజెక్టు ఇంజనీర్ల ను కమిషనర్ ఆదేశించారు. ఫ్లై ఓవర్ పనులను నిర్దేశించిన కాలవ్యవధిలో పూర్తి చేయాలని ఏజెన్సీని ఆదేశించారు. చాంద్రాయణ గుట్ట, శివారంపల్లి, రాజేంద్రనగర్, బండ్లగూడ ప్రాంతాల్లో పర్యటించి ప్రతిపాదిత రోడ్లని నిర్మాణ పనులను కమిషనర్ పరిశీలించారు. చీఫ్ ఇంజనీర్ (ప్రాజెక్టులు) దేవానంద్ పాల్గొన్నారు.

మేడారం ప్రాంతంలో టోర్నడో తరహా బీభత్సం..

నేలకొరిగిన 50వేల చెట్లు

విశ్వంభర,ములుగు: ములుగు జిల్లాలో టోర్నడో తరహా గాలులు బీభత్సం సృష్టించాయి. దీంతో అటవీ ప్రాంతానికి తీవ్ర నష్టం వాటిల్లింది. దీనికి సంబంధించిన వివరాలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. ఆగస్టు 31 సాయంత్రం 6 నుంచి 7 గంటల మధ్య మేడారం ప్రాంతంలో భారీ వర్షంతో పాటు బలమైన ఈదురు గాలులు వీచాయి. దీంతో ఏటూరు నాగారం మండలం కొండాయి నుంచి మేడారం మీదుగా తాడ్వాయి మండలం గోనెపల్లి వరకు నష్టం జరిగింది. సుమారు 15 కి.మీ వ్యవధిలో దాదాపు 150 హెక్టార్ల విస్తీర్ణంలో సుమారు 50వేల చెట్లు నేలకూలాయి. విషయం తెలుసుకున్న అటవీశాఖ సీసీఎఫ్ ప్రభాకర్, డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్, ఇతర అధికారులు అడవిలో సర్వే చేపట్టారు. ఆ మార్గంలో రోడ్లపై పడిన చెట్లను యంత్రాలతో తొలగిస్తున్నారు. ఏటూరు నాగారం మండలం కొండాయి నుంచి మేడారం మీదుగా తాడ్వాయి మండలం గోనెపల్లి వరకు సుమారుగా 15 కి.మీ వ్యవధిలో 50 వేల చెట్లు నేలకూలాయి. ఘటనపై అటవీ శాఖ అధికారులు ఆరా తీస్తున్నారు.

పలు రైళ్ల రద్దు: ఆలస్యంగా గరీబ్ రథ్, గోదావరి ఎక్స్‌ప్రెస్

విశ్వంభర ,తెలంగాణ బ్యూరో: తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరదలతో రైల్వే ట్రాక్ దెబ్బతినడంతో హైదరాబాద్- విజయవాడ మార్గంలో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిన విషయం తెలిసిందే. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం సమీపంలో ట్రాక్ మరమ్మతులు పూర్తి కావడంతో ఈ మార్గంలో రైలు సర్వీసులను పునరుద్ధరించారు. అయితే, బుధ, గురువారాల్లో కొన్ని రైళ్ల సర్వీసులను రద్దు చేయగా.. మరికొన్ని రైళ్లను దారిమళ్లించినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో హైదరాబాద్/సికింద్రాబాద్ నుంచి విశాఖ వెళ్లే గోదావరి, గరీబ్‌రథ్ రైళ్లు రెండు గంటలు ఆలస్యంగా బయల్దేరనున్నాయి.

గుంటూరు మీదుగా వెళ్లనున్న గోదావరి..

హైదరాబాద్/సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే గోదావరి ఎక్స్‌ప్రెస్, గరీబ్‌రథ్ రైళ్లు ఆలస్యంగా నడవనున్నాయి. గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలును ఖాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం స్టేషన్ల మీదుగా కాకుండా.. పిడుగురాళ్ల, గుంటూరు, విజయవాడ మీదుగా మళ్లించనున్నారు. దీంతో పాటు మహబూబ్‌నగర్- విశాఖ, ముంబయి ఎల్‌టీటీ- విశాఖ, సికింద్రాబాద్-కాకినాడ టౌన్, బీదర్ -మచిలీపట్నం రైళ్లను సైతం పిడుగురాళ్ల, గుంటూరు, విజయవాడ మీదుగా మళ్లించనున్నారు. సికింద్రాబాద్- విశాఖపట్నం (12740) గరీబ్‌రథ్ రైలు ఈ రాత్రి 8.30గంటలకు బయల్దేరాల్సి ఉండగా.. దాన్ని రాత్రి 10.30గంటలకు రీషెడ్యూల్ చేశారు. అలాగే, హైదరాబాద్- విశాఖపట్నం గోదావరి ఎక్స్‌ప్రెస్ (12728) రైలు ఈ సాయంత్రం 5.05గంటలకు నాంపల్లి స్టేషన్ నుంచి బయల్దేరాల్సి ఉండగా.. సాయంత్రం 6.35గంటలకు రీషెడ్యూల్ చేశారు. హైదరాబాద్- పట్నా ఎక్స్‌ప్రెస్ (07255) రైలు ఈ రాత్రి 10.50 గంటలకు బయల్దేరాల్సి ఉండగా.. అర్ధరాత్రి 1.30గంటలకుబీ సిర్పూర్ -కాగజ్‌నగర్ రైలు (17233) ఈ మధ్యాహ్నం 3.35 గంటలకు బయల్దేరాల్సి ఉండగా.. రాత్రి 7.35గంటలకు రీషెడ్యూల్ చేసినట్లు అధికారులు తెలిపారు.

ఏఈఓ ప్రవీణ్‌కు రైతుల సన్మానం

విశ్వంభర, చేగుంట: చేగుంట మండలం బోనాల గ్రామంలో రైతు వేదికలో చేగుంట వ్యవసాయ కార్యాలయం నుంచి బదిలీపై రామాయంపేటకు వెళ్లిన ఏఈఓ ప్రవీణ్‌కు బోనాల రైతులు రైతు వేదికలో ఘనంగా సన్మానించారు. రైతులు మాట్లాడుతూ ప్రవీణ్ కుమార్ మాకు పంటల గురించి ఎప్పుడెప్పుడు ఏ పంటలు వేయాలో ఆయన సూచించేవాడని, పిచికారి మందులు ఎప్పుడు స్ప్రే చేయాలో అతను చెప్పేవాడని బోనాల రైతులతో మమేకమై మెదిలే వారని రైతు మల్లయ్య అన్నారు. రైతు అశోక్ మాట్లాడుతూ.. ఏఈఓ ప్రవీణ్ కుమార్ మా బోనాల గ్రామం నుంచి వెళ్లిపోతుంటే మాకు ఎంతో బాధ కలుగుతుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు మల్లయ్య, అశోక్, లచ్చి, వెంకటరమణ, నాగులు, సంతోష్, జగదీశ్వర్, శ్రీనివాస్, స్వామి, రామచంద్రం, జనార్ధన్, చిన్నరాజం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

విశ్వంభర,చేగుంట: చేగుంట మండల కేంద్రంలో అనారోగ్యంతో మరణించిన భయ్యా సత్యనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించిన సామాజిక సేవకుడు అయిత పరంజ్యోతి తన వంతు సహాయంగా బాధిత కుటుంబానికి 3000 రూపాయలు నగదు, 50 కేజీల బియ్యం అందజేశారు. అలాగే భయ్యా సత్యనారాయణ పార్థివదేహం వద్ద మాసుల శ్రీనివాస్ నివాళులు అర్పించి బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, కిష్టయ్య, కర్రె పోశెట్టి, దశరథం, మాదాసు, రమేష్ గౌడ్, బాబు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం విశ్వంభర: మహేశ్వరం మండల పరిధిలో మంజూరైన 96 సీఎం ఆర్ఎఫ్ చెక్కులను మహేశ్వరం మండల సర్వసభ్య సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయా గ్రామాల తాజా మాజీ ప్రజా ప్రతినిధులు పిఏసీఎస్ చైర్మన్ పాండు యాదవ్,వైస్ చైర్మన్ వెంకటేశ్వర రెడ్డి,ఎంపిడిఓ తో కలిసి లబ్ధిదారులకు అందజేసిన మాజీ మంత్రివర్యులు మహేశ్వరం నియోజకవర్గ శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి బి ఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రెహనా బేగంకు ఉత్తమ ఉపధ్యాయురాలిగా అవార్డు

సంతోషం వ్యక్తం చేసిన విద్యార్థులు

మహేశ్వరం విశ్వంభర: మహేశ్వరం లోని తెలంగాణ మోడల్ స్కూల్ పీజీటీ జువాలజీగా విధులు నిర్వహిస్తున్న రెహనా బేగంకు 2024 విద్యా సంవత్సరానికి రంగారెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించిందని ప్రిన్సిపల్ ధనుంజయ్ ప్రకటనలు తెలిపారు ఈ సందర్భంగా ఉత్తమ అవార్డు సాధించిన రెహనా బేగం మాట్లాడుతూ ఎవడు రావడం తనపై మరింత బాధ్యత పెంచిందన్నారు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు అవార్డు రావడం పట్ల రాశి ఫలితాలు నుంచి

ప్రాథమిక పాఠశాలను సందర్శించిన సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం విశ్వంభర: మహేశ్వరం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించిన సబితమ్మ విద్యార్థిని విద్యార్థులతో కాసేపు ముచ్చటించి అక్కడ మధ్యనబోజనం వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు, అనంతరం ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు సబితా ఇంద్రారెడ్డి తో అక్కడ ఉన్న చిన్న చిన్న సమస్యలగురించి వివరించగా సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిస్కారనికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు

మహేశ్వరం సీహెచ్సీని సందర్శించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం విశ్వంభర: రాష్ట్రంలో నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో, మహేశ్వరం మండల కేంద్రం లోగల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి హాస్పిటల్ సూపరింటెండెంట్ అమీర్ సిద్దిఖ్ తో హాస్పిటల్ కు సంబంధించిన వైద్య వివరములు, వైద్య సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు, సిబ్బంది వచ్చే రోగుల సంఖ్య సంబంధించిన విషయాలు కూడా క్షుణంగా తెలుసుకున్నారు .ఈ సందర్భంగా సబితా ఇంద్రా రెడ్డి మాట్లాడుతూ వర్షాభావ ప్రభావం వలన ప్రజలు డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్ సంబంధిత ఆరోగ్య సమస్యలతో వచ్చిన వారికి మంచి వైద్య సదుపాయం కల్పించాలని కోరారు.

ఆందోళన వద్దు, దోషులను కఠినంగా శిక్షిస్తాం : మంత్రి సీతక్క

విశ్వంభర, హైదరాబాద్ : ఆసిఫాబాద్ జిల్లాలో ఆటో డ్రైవర్ దాడిలో తీవ్రంగా గాయపడి గాంధి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మహిళను మంత్రి సీతక్క పరామర్శించారు. బాధితురాలికి అందుతున్న చికిత్సపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. హాస్పిటల్ నుంచే జిల్లా ఎస్పీతో మాట్లాడారు. నిందితుడిపై తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితురాలి కుటుంబానికి అండగా ఉంటామని హామీనిచ్చారు. నిందితులు ఎంతటి వారైనా వదిలి పెట్టేది లేదని స్పష్టం చేశారు.దాడి ఘటన వెలుగులోకి రాగానే నిందితుడిని అరెస్టు చేసాం. నిందితుడికి కఠిన శిక్ష పడేలా ఇప్పటికే చర్యలు చేపట్టామన్నారు. జైనూరు ఆదివాసీ యువత సంయమనంతో ఉండాలని కోరారు. ఆందోళన అవసరం లేదు. నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని భరోసానిచ్చారు. కాగా, ఆటో డ్రైవర్ దాడిలో మహిళ గాయపడటంపై జైనూర్‌లో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. జైనురు మండల కేంద్రంలో పలు దుకాణాల సముదాయాలకు నిప్పు పెట్టారు. పలు వాహనాలను సైతం తగలబెట్టారు.

రాష్ట్ర ప్రభుత్వం పేరు మార్చి బీఆర్ఎస్ విధానాలనే అమలుపరుస్తోంది

సర్వే నంబర్ 523లో ఇల్లు కూల్చడం సరైనది కాదు

విశ్వంభర, మహబూబ్ నగర్: రాష్ట్ర ప్రభుత్వం పేరు మార్చి బీఆర్ఎస్ విధానాలనే అమలుపరుస్తుందని బాధిత ప్రజలను ఓదారిస్తే కేసులు పెడతామనడం ప్రజా పాలన కాదని పాలమూరు అధ్యయన వేదిక, టీఎఫ్టియు నాయకులు విమర్శించారు. బుధవారం మహబూబ్ నగర్ పట్టణంలోని టీఎన్జీవో భవనంలో పాలమూరు అధ్యయన వేదిక, టి ఎఫ్ టి యు నాయకుల సంయుక్త ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలమూరు రంగారెడ్డి పై సమగ్ర విధానాన్ని ప్రకటించాలి. కృష్ణానది నుండి కనీసం వర్ద నీటిని కూడా పూర్తిస్థాయిలో వినియోగించటంలో విఫలమైందన్నారు. మహబూబ్నగర్ అర్బన్ తాసిల్దార్ కార్యాలయం లో సమాచార హక్కు చట్టం నిర్వీర్యం చేయబడుతుందని ఆక్రమణదారులంతా టిఆర్ఎస్ ను వదిలి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారన్నారు. రాజకీయ నాయకుల దళారుల ఆక్రమణ నుండి దృష్టి మళ్లించడం కొరకే 523 కూల్చివేతలన్నారు. శ్రీశైలం వరద పెరిగే కొద్దీ కల్వకుర్తి లిఫ్ట్ ప్రమాదంలో పడుతుందన్నారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. మహబూబ్నగర్ పట్టణంలోని 523 సర్వే నంబర్లు సుమారు 78 ఇండ్లను కూల్చివేశారని ఇది తీవ్ర అభ్యంతరకరమైన విషయమని వారు తెలిపారు. 523 సర్వే నంబర్లో 2002 నుండి నివాస స్థలాల కొరకు పేద ప్రజలు పోరాటం చేశారని వారు గుర్తు చేశారు. అరెస్టులకు కేసులకు గురై ఆ భూమిని సాధించుకున్నారని వారు తెలిపారు. అట్టి భూమిలో అర్హులను విచారణ జరిపి ఇండ్ల స్థలాలకై పట్టాలు 2004లో ఇచ్చారని వారు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత టిఆర్ఎస్ ప్రభుత్వం ఇంటి పట్టా స్థలాల పట్టాలను స్వాధీనపరచుకొని డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తామని హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు. వారికి డబల్ బెడ్ రూంలో ఇవ్వకుండా అర్హులు కాని వారికి, మహబూబ్నగర్ నియోజకవర్గంలో సంబంధం లేని ఇతర ప్రాంతాల వారికి అక్రమంగా అప్పటి ప్రజా ప్రతినిధుల ప్రోద్భలంతో మహబూబ్నగర్ అర్బన్ తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది కుమ్మక్కై అవినీతికి పాల్పడ్డారని వారు విమర్శించారు. తాసిల్దార్ కార్యాలయంలో ఈ విషయమై సమాచారం కోరుతూ ఎన్ని వినతి పత్రాలు ఇచ్చినా వాటికి ఎలాంటి సమాధానం ఇవ్వటం లేదని వారు తెలిపారు. జిల్లా కలెక్టర్ స్పందించి తగు చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఇండ్లు కూల్చడం అనేది ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదయోగ్యం కాదని వారు తెలిపారు. ఇల్లు కట్టుకున్న వారు అర్హులు కాకుంటే ఆ ఇళ్లను స్వాధీన పరచుకొని అర్హులైన వారికి ఇవ్వాలి తప్ప కూల్చడం ద్వారా ప్రకృతి విధ్వంసాన్ని పాల్పడం అవుతుందని వారు ఆవేదన వెలిబుచ్చారు. కాలేశ్వరం ప్రాజెక్టు మీద ఉన్న శ్రద్ధ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పై ప్రభుత్వానికి లేకపోవడం విచారకరమన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పై సమగ్ర విధానాన్ని రూపొందించాలని వారు కోరారు.కల్వకుర్తి లిఫ్ట్ శ్రీశైలం వరద జలాలు పెరిగిన కొద్ది ప్రమాదంలో పడుతుందని దానిని రక్షించుటకై తక్షణం చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.వరదలు అకస్మాత్తుగా వస్తాయని ప్రభుత్వాలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో విఫలం కావడం వల్లే ప్రజల ఆస్తి నష్టము, ప్రాణ నష్టం జరుగుతుందని వారు తెలిపారు.స్థానిక మాజీ మంత్రివర్యులు వారు అధికారంలో ఉన్నప్పుడు అనేకసార్లు 523 సర్వే నెంబర్లు ఇండ్ల కూల్చి చేతకు పాల్పడ్డారని, డబల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపుల్లో తీవ్రమైన అవినీతి జరిగిందని వాటిపై ఆత్మ విమర్శ చేసుకోకుండా ఇవాళ ప్రజలపక్షం ఉన్నట్టు నటించడం మానుకోవాలని హితవు పలికారు.మహబూబ్నగర్లో డబల్ బెడ్ రూమ్ మంజూరు చేయడంలో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరపాలని, అవినీతికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, రోనాల్ రోస్ కలెక్టర్ గా ఉన్నప్పుడు రూపొందించిన అర్హుల జాబితా లోని లబ్ధిదారులకు తక్షణం డబల్ బెడ్ రూమ్ లు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. గత పది సంవత్సరాల లో టిఆర్ఎస్ ప్రభుత్వం పెట్టిన కేసుల్ని నూతన ప్రభుత్వం ఎత్తివేయడం లేదని వారు ఆవేదన వెలిబుచ్చారు. ఇంకా కొత్త కేసులు పెట్టడం విడ్డూరమన్నారు. తక్షణం టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పోరాడిన ప్రజలపై పెట్టిన కేసులన్నింటినీ ఉపసంహరించాలని వారు కోరారు..ఈ సమావేశంలో పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం రాఘవచారి, టి ఎఫ్ టి యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్, అధ్యయన వేదిక మహబూబ్నగర్ జిల్లా కన్వీనర్ ఏ.తిమ్మప్ప, కేసి.వెంకటేశ్వర్లు, టి ఎఫ్ టి యు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పి.విజయ్ కుమార్, డిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వామన్ కుమార్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌కు వ్యంగ్యం తప్ప..

పరిపాలన వ్యవహారం లేదు : హరీశ్‌రావు

విశ్వంభర, సిద్దిపేట: ముఖ్యమంత్రి రేవంత్ వద్ద వ్యంగం తప్ప పరిపాలన వ్యవహారం లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఊపిరి ఉన్నంతవరకు సిద్దిపేట అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. సిద్దిపేటను ఓర్వలేక ఇక్కడి అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని.. అసెంబ్లీలో కొట్లాడి సిద్దిపేట అభివృద్ధిని కొనసాగిస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పక్షాల మీద దాడులు, కక్ష సాధింపులకు పాల్పడుతుందని.. హామీల అమలు లేదు.. పరిపాలనపై పట్టింపులేదని మండిపడ్డారు. అరచేతిలో వైకుంఠం చూపించి.. అధికారంలోకి రాగానే పాలనను కాంగ్రెస్ ఆగం చేస్తుందని విమర్శించారు.ఆపదలో పార్టీ పక్షాన ఆదుకునేందుకు వెళ్తే ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ పార్టీ దాడులకు పాల్పడిందని ఆరోపించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని.. పాలు, నీళ్లు ప్రజలే తేలుస్తారన్నారు. రైతు రుణమాఫీ సగం చేసి చేతి ముదుచుకున్నాడని.. వానాకాలం ఐపోతున్నా రైతుబంధు లేదన్నారు. అవ్వాతాతలకు, వికలాంగులకు పెన్షన్ ఇవ్వక కాంగ్రెస్ ప్రభుత్వం ఆగం చేస్తుందని మండిపడ్డారు. ప్రజలు కష్టాల్లో, ఆపదల్లో ప్రైవేట్ హాస్పిటల్లో ఖరీదైన వైద్యం పొందితే కొంత మొత్తాన్ని ఉడతాభక్తిగా సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం చేసేవాళ్లమని.. ఇందుకు తమ వంతు కృషి చేసిన స్థానిక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులకు అభినందనలు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో, కేసీఆర్ నాయకత్వంలో సిద్దిపేటను తెలంగాణాలోనే బెస్ట్ నియోజకవర్గంగా అందరి సహకారంతో అభివృద్ధి చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 9నెలల కాలంలో అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని.. కేసీఆర్ ఆశీర్వాదంతో రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా సిద్దిపేట తీర్చిదిద్దుకున్నామన్నారు.
పదేళ్లలో సిద్దిపేట రూపురేఖలు మార్చుకున్నామని.. సిద్దిపేటలో అనేక విద్యాలయాలు తెచ్చుకున్నామని.. సిద్దిపేటకు మెడికల్ కాలేజ్, మహిళా డిగ్రీ కళాశాల, వెటర్నరీ కాలేజీలను సాధించుకున్నామన్నారు. సిద్దిపేటలో విద్యార్థులకు అన్ని రకాల చదువులు అందాలనే ఉద్దేశంతో సిద్దిపేటకు అనేక విద్యాలయాలు తెచ్చామన్నారు. ఇందులో సగం నిర్మాణం పూర్తయిన వెటర్నరీ కాలేజీని కాంగ్రెస్ ప్రభుత్వం కొడంగల్‌కు తరలించుకుపోయిందని ధ్వజమెత్తారు. కొడంగల్‌కు అవసరమైతే కొత్త కాలేజీని నిర్మించుకోవాలని.. సిద్దిపేటకు అన్యాయం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రూ.150కోట్లతో నిర్మిస్తున్న వెటర్నరీ కాలేజీని గద్దలా తన్నుకుపోతున్న సీఎం రేవంత్ రెడ్డి తీరును ప్రజలు గమనించాలని కోరుతున్నానన్నారు. 9 నెలలు అయింది కోమటి చెరువు దగ్గర శిల్పారామం పనులు ఆగిపోయాయని.. పనులు కాకుండా అడ్డుకుంటున్నారన్నారు. అసెంబ్లీలో కొట్లాడి సిద్దిపేటకు రావాల్సిన పనులను హక్కుగా తీసుకొని వస్తానని.. తన ఊపిరి ఉన్నంతవరకు సిద్దిపేట అభివృద్ధి కోసం కృషి చేస్తానని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

ముందస్తు సమాచారం ఇవ్వడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం

పువ్వాడ అజయ్

విశ్వంభర, హైదరాబాద్ : వరద వస్తుందని ఖమ్మం ప్రజలకు ముందు చెప్పలేదు. ఇదే ప్రభుత్వ ఫెయిల్యూర్ అని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. శనివారం 21 అడుగులకు నీటిమట్టం చేరింది, 21 అడుగులకు చేరిన ఒక ఇల్లు కూడా మునగదన్నారు. కాకపోతే నీటిమట్టం 18 అడుగులకు చేరగానే మైకులలో అనౌన్స్‌మెంట్ ఇచ్చి ట్రాక్టర్లు వ్యాన్లు తీసుకొచ్చి ప్రజలను సామగ్రితో సురక్షిత ప్రాంతాలకు తరలించాలి.ఆదివారం ఉదయం 33 అడుగులకు నీటిమట్టం చేరింది.అప్పటికి ప్రభుత్వం ఎలాంటి హెచ్చరికలు చేయలేదని ఆరోపించారు. ప్రజలే స్వచ్ఛందంగా అయ్యో రామచంద్ర అని అనుకుంటూ వారి సామాగ్రిని వదిలేసి వేరే ప్రాంతంలోకి వెళ్లిపోయారన్నారు. మాకు ముందస్తు సమాచారం ఇవ్వలేదని ప్రజల నుంచి వస్తున్న ప్రధాన ఆరోపణ. రిలీఫ్ మెజర్స్ తీసుకోవడంలో బాధితులకు ఆహారం, నీళ్లు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. సమస్యల నుంచి డైవర్ట్ చేయడానికి ముఖ్యమంత్రి నాపై తప్పుడు ఆరోపణలు చేశారని పువ్వాడ అన్నారు.

కార్యకర్త పాడే మోసిన మాజీ ఎమ్మెల్యే బీరం

విశ్వంభర, నాగర్‌కర్నూల్ : పార్టీని నమ్ముకున్న వారికి అండగా ఉంటామని మరోసారి నిరూపించారు. కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి.వివరాల్లోకి వెళ్తే..నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సున్నపుతాండకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు సీతారాం నాయక్ మంగళవారం సాయంత్రం వ్యవసాయ పొలం వద్ద విద్యుత్ ఘాతంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బీరం బుధవారం సున్నపుతాండ గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.మృతుడు సీతారామ నాయక్ మృతదేహానికి పూలమాలేసి ఘనంగా నివాళులర్పించారు. సీతారామ నాయక్ మృతి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని అన్నారు. మంచి కార్యకర్తను కోల్పోవడం చాలా బాధగా ఉందన్నారు. ఈ సందర్భంగా సీతారాం నాయక్ పాడెను మాజీ ఎమ్మెల్యే మోయడంతో బీఆర్ఎస్ కార్యకర్తలు భావోద్వేగానికి లోనయ్యారు. కార్యకర్తల ప్రతి కష్టంలోనూ తోడుగా అండగా ఉంటున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డిని చూసి గర్వపడ్డారు.

తల్లుల దీవెనలతోనే బయటపడ్డాం : మంత్రి సీతక్క

విశ్వంభర, హైదరాబాద్ : ములుగు అటవీ ప్రాంతంలో 500 ఎకరాల్లో చెట్లు నేలకూలడంపై మంత్రి సీతక్క విస్మయం వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితమే చెట్లు నెలకొరిగిన ప్రాంతాన్ని సందర్శించినప్పటికి ఈ స్థాయిలో లక్ష చెట్ల వరకు కూలిపోయాయని ఊహించలేదన్నారు. జరిగిన నష్టాన్ని డ్రోన్ కెమెరాల సహాయంతో అంచనా వేసే క్రమంలో జరిగిన విధ్వంసం బయటపడిందన్నారు. ఘటనపై బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి పీసీసీఎఫ్, డీఎఫ్ఓ, స్థానిక అధికారులతో మంత్రి టెలిఫోన్లో మాట్లాడారు. 500 ఎకరాల్లో అటవీ సంపద నేల కూలిందని ఆవేదన వ్యక్తం చేశారు. వేల సంఖ్యలో భారీ వృక్షాలు నేల కూలడంపై సమగ్ర విచారణకు ఆదేశించారు.ఘటన ప్రాంతాన్ని సందర్శించి పీసీసీఎఫ్ నివేదిక సిద్ధం చేస్తున్నారని తెలిపారు. అడవిలో సుడిగాలి రావడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం అదృష్టమన్నారు. ఈ సుడిగాలి గ్రామాల్లో సంభవించి ఉంటే పెను విధ్వంసం జరిగేదని ఆందోళన వ్యక్తం చేశారు. సమక్క, సారలమ్మ తల్లుల దయ వల్లే సుడిగాలి ఊర్ల మీదకు మల్లలేదన్నారు. తల్లుల దీవేనతోనే ప్రజలు సురక్షితంగా బయటపడ్డారని వెల్లడించారు.చెట్లు నెలకూలడంపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కేంద్రం నుంచి ప్రత్యేక బృందాలను పంపి పరిశోధన జరిపించి కారణాలు గుర్తించేలా కేంద్ర మంత్రులు చొరవ చూపాలన్నారు. అటవీ ప్రాంతంలో చెట్లు కూలిన చోట తిరిగి చెట్లు పెంచేలా ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాకి విజ్ఞప్తి చేశారు.

కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలి

మంత్రి జూపల్లి

విశ్వంభర, నాగర్‌కర్నూల్ : వరద బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, ఎవరూ కూడా అధైర్యపడొద్దని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మూడు రోజుల క్రితం కురిసిన అతి భారీ వర్షాలతో నాగర్‌కర్నూల్ జిల్లాఅతలాకుతలమై, ఆస్తి, పంట నష్టం జరిగిన నేపథ్యంలో మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. కొల్లాపూర్ మున్సిపాలిటీ పరధిలోని చౌటబెట్ల, నర్సింగరావుపల్లి, తాళ్ల నర్సింగాపూర్ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు.ముంపుబారిన పడ్డ పంట పొలాలు, కోతకు గురైన రోడ్లు, తెగిపోయిన బ్రిడ్జిలను క్షేత్రస్తాయిలో పరిశీలించారు.రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.6 వేల కోట్ల నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా అని, ఇది ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు. ఇంతటి విపత్తుపై తక్షణమే కేంద్ర ప్రభుత్వం స్పందించి జాతీయ విపత్తుగా ప్రకటించాలన్నారు ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణలో పర్యటించి సాయాన్ని ప్రకటించాలని కోరారు.

అల్లరి మూకలకు వత్తాసు పలికేవారు బుల్డోజర్ ముందు నిలవలేరు

అఖిలేష్‌కు యూపీ సీఎం కౌంటర్

లక్నో: యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్, ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. అమాయకులను, ప్రత్యర్థులను టార్గెట్ చేసేందుకు యూపీ ప్రభుత్వం బుల్డోజర్లను నడుపుతోందని, 2027 అసెంబ్లీ ఎన్నికల అనంతరం బుల్డోజర్లు గోరఖ్‌పూర్ మళ్లుతాయని యోగి టార్గెట్‌గా అఖిలేష్ యాదవ్ విమర్శలు గుప్పించారు. బుల్డోజర్లకు మెదడు అవసరం లేదని, స్టీరింగ్ ఉంటే చాలని అన్నారు.బుల్డోజర్ స్టీరింగ్‌ను యూపీ ప్రజలు మార్చేస్తారని యోగిపై విరుచుకుపడ్డారు. అయితే అఖిలేష్ వ్యాఖ్యలకు యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ దీటుగా బదులిచ్చారు. బుల్డోజర్‌ను హ్యాండిల్ చేసే ప్రతిఒక్కరికీ ఆ సామర్థ్యం, సత్తా ఉండవని వ్యాఖ్యానించారు. బుల్డోజర్‌ను నిర్వహించాలంటే హృదయం, మనసు రెండూ అవసరమని స్పష్టం చేశారు. దమ్ము, అంకితభావం కలిగిన వారే ఇలాంటి టాస్క్‌లను నెగ్గుకురాగలరని పేర్కొన్నారు.
ఇవాళ వీరు సరికొత్త రూపంలో ప్రజలను తప్పుదారిపట్టించేందుకు వస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరి చేతులు బుల్డోజర్‌కు ఫిట్ కావని చెప్పుకొచ్చారు. అల్లరి మూకల ముందు సాగిలపడే వారు బుల్డోజర్ ముందు నిలవలేరని ఎద్దేవా చేశారు. సుల్తాన్ కావాలనే వారి కలలు ఫలించబోవని అఖిలేష్ పేరును పరోక్షంగా ప్రస్తావిస్తూ యోగి పేర్కొన్నారు. ఎస్పీ హయాంలో అఖిలేష్ యాదవ్, శివపాల్ యాదవ్ దోపిడీ యదేచ్ఛగా సాగిందని ఆరోపించారు. వాటాల కోసం ఊర్లను పంచుకున్నారని, మనుషులను తినే తోడేళ్ల వలే 2017కు ముందు పాలన సాగిందని యోగి ఆదిత్యానాథ్ దుయ్యబట్టారు.

ప్రమాదాల్లో చనిపోతున్నారు

- హెల్మెట్లపై డిస్కౌంట్ ఇవ్వొచ్చు కదా
- ద్విచక్ర వాహన తయారీదారులను కోరిన
- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ..

ఢిల్లీ: దేశంలో హెల్మెట్ ధరించకపోవడం వల్లే రోడ్డు ప్రమాదాల్లో అనేకమంది మరణిస్తున్నారని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల ద్విచక్ర వాహన తయారీదారులు వాహన కొనుగోలుదారులకు తగ్గింపు ధర లేదా సహేతుకమైన ధరలకు హెల్మెట్లను అందించాలని కోరారు. బుధవారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. "2022లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 50,029మంది హెల్మెట్ ధరించకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోయారు. అందువల్ల, ద్విచక్ర వాహన తయారీదారులకు నా అభ్యర్థన ఏంటంటే.. వాహనం కొనుగోలు చేసేవారికి హెల్మెట్లపై కొంత డిస్కౌంట్ ఇవ్వగలిగితే ప్రజల ప్రాణాల్ని కాపాడగలం అనిపించింది" అన్నారు.

ప్రతి తాలుకాలో ఒక డ్రైవింగ్ స్కూల్ నా ఆశయం..

పాఠశాల బస్సులకు కూడా పార్కింగ్ ఏర్పాటుకు సంబంధించి ఒక ప్లాన్ రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. మోటారు వాహనాల (సవరణ) చట్టం, 2019 ట్రాఫిక్ నేరాలపై భారీగా ఫైన్లను అమలు చేసిందన్న ఆయన.. నిజానికి దీన్ని సమర్థంగా అమలుచేయడం కూడా పెద్ద సవాల్ ఉందన్నారు. దేశంలోని ప్రతి తాలుకాలో డ్రైవింగ్ స్కూల్ ప్రారంభించాలన్నది తన ఆశయమని తెలిపారు.

తెలంగాణ రుణం తీర్చుకునే సమయమిదే

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: కేంద్రంలోని బిజెపి సంకీర్ణ ప్రభుత్వం తెలంగాణ ప్రజల రుణం తీర్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఇటీవలి పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు 8 లోక్ సభ స్థానాలిచ్చి బీజేపీకి ప్రాణం పోసారని ఆయన తెలిపారు. అసాధారణ రీతిలో కురిసిన కుండపోత వర్షాలకు 14 జిల్లాలు జల ప్రళయానికి గురయ్యాయని, 16 మంది ప్రాణాలు కోల్పోగా, దాదాపు 15 లక్షల ఎకరాల్లో పంట, ఆస్తుల నష్టం జరిగిందని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం తక్షణం తెలంగాణ వరద బీభత్సాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించి, ఉదారంగా సాయం అందించాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో త్వరలో కేంద్ర ప్రభుత్వ పెద్దల్ని కలసి జాతీయ విపత్తు డిమాండును ముందుంచుతామని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. నిర్మల్. ఆదిలాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాలో పర్యటిస్తున్న శ్రీధర్ బాబు బుధవారం ఈ మేరకు ఒక ప్రకటనలో కోరారు. రెండు వేల కోట్లు తక్షణం విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నడూ 30-40 సెంటీమీటర్ల వర్షపాత నమోదు కాలేదని ఆయన తెలిపారు. క్లౌడ్ బరస్ట్ అయినట్టుగా కొద్ది గంటల్లోనే నెల రోజుల వర్షం కురిసిందని శ్రీధర్ బాబు వివరించారు. తమ ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించి, అధికారులను మోహరించడం వల్ల మృతుల సంఖ్య తగ్గిందని ఆయన పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణలో పర్యటించి జాతీయ విపత్తుగా ప్రకటించి ప్రత్యేక నిధులు అందజేయాలని కోరారు. బీజేపీకి రహస్య మిత్రుడిగా కొనసాగుతున్న బీఆర్ఎస్ కూడా జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండు చేయాలని అన్నారు. బురద రాజకీయాలు మాని చేతనైతే వరద బాధితులకు సాయం చేయాలని గులాబీ పార్టీకి సూచించారు. ఇళ్లలో కూర్చుని మీడియాలో చెలరేగిపోతే ప్రయోజనం ఉండదని ఆయన ఎద్దేవా చేసారు. ఉత్తర తెలంగాణలోని నీటి ప్రాజెక్టులైన కడెం, స్వర్ణ, వట్టివాగు, సాత్నాల, ఎన్టీఆర్ ప్రాజెక్ట్, గడ్డెన్న వాగు, పాల్వాయి పురుషోత్తమరావు ప్రాజెక్టుల నీటి విడుదల (డిస్చార్జి) సామర్థ్యం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు అందించి సహకరించాలని కోరారు. ఆకస్మిక వరదల సమయంలో ఈ ప్రాజెక్టుల భద్రత ఆందోళన కలిగిస్తోందని తెలిపారు.

ఎలాంటి అవసరమొచ్చినా అండగా ఉంటాం

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వందకుపైగా ఫైరింజన్లు సహాయక చర్యలో పాల్గొన్నాయని, పొక్లెయిన్లు, టిప్పర్ల ద్వారా వేస్టేజ్ను తరలిస్తున్నామని తెలిపారు. "సహాయచర్యల్లో 32 మంది ఐఏఎస్ లు పనిచేస్తున్నారు. 179 సచివాలయాలకు 179 మంది సీనియర్ అధికారులను ఇన్చార్జులుగా పెట్టాం. ఎవరైనా చనిపోతే మృతదేహాలను బంధువులకు అప్పగిస్తున్నాం. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల పరిహారం అందించాలని ఆదేశాలిచ్చాం. మంగళవారం 9,09,191 ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశాం. ఇవాళ ఇప్పటి వరకు 6లక్షల ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశాం. 8.50లక్షల వాటర్ బాటిళ్లు, 3లక్షల లీటర్ల పాలు, 5 లక్షల బిస్కెట్ ప్యాకెట్లు అందించాం. 5 లక్షల మందికి భోజన ఏర్పాట్లు చేశాం. గర్భిణిలకు ప్రత్యేక వైద్యం అందించాలని ఆదేశాలిచ్చాం.

విజయవాడకు బుడమేరే ప్రధాన సమస్య..

విజయవాడకు బుడమేరు ప్రధాన సమస్యగా తయారైంది. చిన్న చిన్న వాగులన్నీ కలిసి బుడమేరు పెద్దదిగా మారింది. అటు కృష్ణానది, ఇటు బుడమేరు కలిసి విజయవాడను ముంచెత్తాయి. బుడమేరును గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఐదేళ్లపాటు ఏం చేశారని వైకాపా నేతల్ని ప్రశ్నిస్తున్నాం. వాగులను కబ్జా చేయడమే ఈ దుస్థితికి కారణం. ఆఖరికి పోలవరం కాలువలోనూ మట్టిని తవ్వేశారు. బుడమేరు నీరు కొల్లేరు. కృష్ణానదికి వెళ్లేలా చర్యలు తీసుకుంటాం. బుడమేరు ప్రవాహ దారిలో కాలువలు, వాగుల్లో కబ్జాలు తొలగిస్తాం. ఇలాంటి విపత్తులను అందరూ సమష్టిగా ఎదుర్కోవాలి. వరద బాధితులు అందరికీ న్యాయం చేస్తాం. రేపు ఉదయానికి వరద పూర్తిగా తగ్గిపోతుంది"అని చంద్రబాబు తెలిపారు.

సాయం చేయకపోగా నిందలేస్తారా?

అమరావతి మునిగిపోయిందని తప్పుడు ప్రచారం చేయడం సరికాదు. ఇలాంటి రాజకీయ నేరస్థులు, తప్పుడు ప్రచారం చేసేవారిని సంఘ బహిష్కరణ చేయాలి. వైకాపాలాంటి పార్టీకి రాష్ట్రంలో ఉండే అర్హత లేదు. సాయం చేయకపోగా నిందలేసి.. తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రజల కోసం నేను యజ్ఞం చేస్తుంటే.. వైకాపా నేతలు రాక్షసుల్లా అడ్డం పడుతున్నారు. ప్రజలకు సేవ చేస్తూ.. రాక్షసులతో యుద్ధం చేయాల్సి వస్తోంది. ఇకనైనా బురద జల్లడం ఆపి ప్రజలకు క్షమాపణ చెప్పాలి.

ఏపీకి రావాలని అమిత్ షాను కోరా

కేంద్రమంత్రి అమిత్ షాతో ఫోన్లో మాట్లాడాను. వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాలని కోరా. విజయవాడ, అమరావతి ముంపు బారిన పడకుండా కార్యాచరణ రూపొందిస్తాం. వరద బాధితులను బోట్లలో తీసుకెళ్లడం కోసం డబ్బులు అడిగితే అరెస్టు చేసి కేసులు పెడతాం. ప్రైవేటు బోట్ల వాళ్లు కూడా డబ్బులు వసూలు చేయొద్దని చెప్పారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచకుండా ఉండేలా ప్రణాళిక రూపొందించాం. కూరగాయల ధరలకు ప్రభుత్వమే ఫిక్స్ రేట్ పెడుతుంది. సాయంత్రం లేదా గురువారం నుంచి నిత్యావసర వస్తువుల పంపిణీ చేపడతాం. వివిధ ఉద్యోగ సంఘాలు ఒక్క రోజు జీతం విరాళం ఇవ్వడానికి ముందుకొచ్చాయి" అని చంద్రబాబు తెలిపారు.

వరద బాధితుల కోసం వెల్లువెత్తుతున్న విరాళాలు

(మొదటి పేజీ తరువాయి)

అనన్య నాగళ్ల రూ.2.5లక్షలు విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు.సూపర్ స్టార్ మహేశ్ బాబు కూడా ఏపీ, తెలంగాణకు చెరో రూ.50 లక్షలు విరాళంగా ఇచ్చారు.

పవన్ భారీ విరాళం

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ వరద బాధితుల కోసం ఏపీ, తెలంగాణ సీఎం సహాయ నిధులకు చెరో రూ.కోటి విరాళం ప్రకటించారు. అలాగే వరదల వల్ల ప్రభావితమైన 400 పంచాయతీలకు చెరో రూ.లక్ష సాయాన్ని అందించనున్నట్టు వెల్లడించారు. అంటే పవన్ కల్యాణ్ మొత్తంగా రూ.6కోట్ల భారీ విరాళాన్ని వరద బాధితుల కోసం ఇవ్వనున్నారు. అలాగే, ఏపీలో వరద సహాయ కార్యక్రమాలపై అధికారులతో వరుసగా ఆయన సమీక్షలు నిర్వహిస్తున్నారు. దిశానిర్దేశం చేస్తున్నారు. కాగా, వరదల వల్ల సెప్టెంబర్ 2న ఆయన పుట్టిన రోజు వేడుకలను కూడా రద్దు చేసుకున్నారు. వరద పరిస్థితులు ఉన్నందున తన సినిమాలకు సంబంధించిన అప్డేట్స్ ఇవ్వొద్దని కూడా ఆయా మూవీ టీమ్లకు ఆయన సూచించారు.

అండగా ఉండాల్సిన సమయమిది: రామ్ చరణ్

"వర్షాలు, వరదల వల్ల ఇబ్బందులు పడుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు మనం తోడుగా, అండగా ఉన్నామంటూ చేయూత అందించాల్సిన సమయం ఇది. నా వంతు బాధ్యతగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల సీఎం రిలీఫ్ ఫండ్ కు కోటి రూపాయలు విరాళంగా ప్రకటిస్తున్నాను. తెలుగు రాష్ట్రాల ప్రజలు ఈ పరిస్థితి నుంచి త్వరగా బయటపడాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను." అని ఎక్స్లో రామ్చరణ్ పోస్ట్ చేశారు.

ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఉండాలి: అల్లు అర్జున్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఏపీ, తెలంగాణకు కలిపి రూ.కోటి విరాళం ప్రకటించారు. ఈ విషయాన్ని నేడు ఇన్స్టాగ్రామ్లో స్టోరీ పోస్ట్ చేసి వెల్లడించారు. "ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో భారీ వర్షాల వల్ల నష్టపోయిన, ఇబ్బందులు పడుతున్న వారి పట్ల చాలా బాధగా ఉంది. ఈ కఠినమైన పరిస్థితుల్లో సహాయక చర్యల కోసం ఇరు రాష్ట్రాల సీఎం సహాయ నిధులకు మొత్తంగా రూ.కోటిని అందజేస్తున్నా. ప్రతీ ఒక్కరు సురక్షితంగా ఉండాలని ప్రార్థిస్తున్నా" అని అల్లు అర్జున్ ట్వీట్ చేశారు.

అందరూ సహాయ చర్యల్లో పాలు పంచుకోవాలి: చిరంజీవి

తెలుగు రాష్ట్రాల్లో వరద ప్రభావం వల్ల ప్రజలకు కలిగిన, కలుగుతున్న కష్టాలు తనను కలిచి వేస్తున్నాయంటూ నేడు ట్వీట్ చేశారు చిరంజీవి. పరిస్థితిని మెరుగుపరిచేందుకు ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు శాయశక్తులా కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. అందరూ ఏదో విధంగా సహాయక చర్యల్లో పాల్పంచుకోవాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సీఎం సహాయ నిధులకు చెరో రూ.50లక్షలను ప్రకటిస్తున్నాని తెలిపారు. విపత్కర పరిస్థితులు తొలగి, ప్రజలంతా సురక్షితంగా ఉండాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్టు చిరంజీవి ట్వీట్ చేశారు.

వరద బాధితులకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీల నెల జీతం విరాళం

రాష్ట్రంలో వరద బాధితులను ఆదుకోవాలని కేసీఆర్ నిర్ణయించారని మాజీమంత్రి హరీశ్ రావు తెలిపారు.సర్వం కోల్పోయిన ప్రజలకు అండగా నిలవాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. బాధితులను ఆదుకోవడానికి ప్రజలు ముందుకు రావాలని సూచించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రకటించారు. అందులో భాగంగా తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు ఒక నెల వేతనాన్ని విరాళంగా ఇవ్వాలని నిర్ణయించామన్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వరదల వల్ల సర్వం కోల్పోయి ఇబ్బందిపడుతున్న ప్రజలకు అండగా నిలవాలని, ఇప్పటికే బీఆర్ఎస్ పక్షాన సహాయక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దీనికి తోడుగా బీఆర్ఎస్ శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, పార్లమెంట్ సభ్యుల ఒక నెల జీతాన్ని వారికి అందించనున్నట్లు చెప్పారు.

కల్లెడలో ఎల్లెడలా సంతోషం

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : పారిస్ పారాలింపిక్స్లో దీప్తి జీవాంజీ కాంస్య పతకం సాధించడంపై వరంగల్ జిల్లాలో సంబురాలు జరిగాయి. దీప్తి విజయాన్ని హర్షిస్తూ ఆమె స్వగ్రామం కల్లెడలో గ్రామస్థులు, పాఠశాల నిర్వాహకులు విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. వరంగల్ జిల్లా నుంచి పారా ఒలింపిక్స్ చరిత్రలో పతకం సాధించిన తొలి తెలుగు క్రీడాకారిణిగా తెలంగాణ అథ్లెట్ దీప్తి జీవాంజీ రికార్డు సృష్టించింది. మంగళవారం రాత్రి పారిస్లో జరిగిన 400 మీటర్ల టీ-20 విభాగం ఫైనల్లో దీప్తి 55.82 సెకన్లలో లక్ష్యాన్ని ఛేదించి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించింది.దీప్తి జీవాంజీ పారాలింపిక్స్లో కాంస్య పతకం సాధించడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు . మహిళల టీ-20 400 మీటర్ల పరుగులో దీప్తి ప్రస్థానమంతా సంచలనమే. గతేడాది పారా ఆసియా క్రీడల్లో రికార్డుతో బంగారు పతకం సాధించింది. ఈ ఏడాది ప్రపంచ ఛాంపియన్షిప్లో అద్భుతాన్ని సృష్టించి, 55.07 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తిచేసి ప్రపంచ రికార్డుతో స్వర్ణ పతకం సొంతం చేసుకుంది. ఆఖరి పోటీలోనూ అదరగొట్టిన దీప్తి కాంస్యం సొంతం చేసుకుంది. ఇదంతా ఒక్క రోజులోనే సాధ్యం కాలేదు. ఎనిమిదేళ్లుగా చేసిన కఠోర శ్రమ ఫలితం. తల్లిదండ్రులు యాదగిరి, ధనలక్ష్మిల తపనతో పాటు ఆర్డీఎఫ్ పాఠశాల పీఈటీ ప్రోత్సాహంతో నిరంతర శ్రమ చేయడం వల్ల దీప్తిని విజయం వరించింది. జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ సూచనలతో ఈ ఘనతకు మరింత తోడ్పాటునందించింది. అంతర్జాతీయ స్థాయి వసతులతో పాటు అత్యున్నత ప్రమాణాలతో శిక్షణ దీప్తి ఒలింపిక్స్ ప్రయాణాన్ని మరింత సులువు చేసింది. ప్రపంచ పారా అథ్లెటిక్స్లో రికార్డు నెలకొల్పి స్వర్ణంతో మెరిసిన దీప్తి పారాలింపిక్స్లో తనదైన ముద్ర వేసింది. వరంగల్ జిల్లాలోని పర్వతగిరి మండలం కల్లెడ గ్రామంలోని సాధారణ నిరుపేద రైతు కుటుంబంలో దీప్తి జన్మించింది. అంతర్జాతీయ స్థాయిలో రాణించి ఒలింపిక్స్ లో బ్రాంజ్ మెడల్ సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో పారా ఒలింపిక్స్లో ప్రతిభ కనబరిచి దేశానికి పేరు తెచ్చిన తమ కూతురిని ప్రభుత్వం గుర్తించి ఆర్థికంగా నిలదొక్కుకునేలా సహకరించాలని ఈ సందర్భంగా దీప్తి తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరారు.

రోజువారి కూలీ పనులకు వెళుతూ జీవనం కొనసాగిస్తున్నామని తెలిపారు. దేశానికే పేరు తెచ్చిన దీప్తికి అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉండి ఉద్యోగం కల్పించాలని కోరారు. కొంత మంది దాతలు దీప్తిలో ఉన్న ప్రతిభను గుర్తించి ఆర్థిక సహకారం అందించారని తెలిపారు.

వయనాడ్ బాధితులకు నెల జీతాన్ని విరాళంగా ఇచ్చిన రాహుల్ గాంధీ

వయనాడ్: కాంగ్రెస్ అగ్రనేత, లోక్సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పెద్ద మనసు చాటుకున్నారు. ఇటీవలే కుంభవృష్టితో తీవ్రంగా దెబ్బతిన్న కేరళలోని వయనాడ్ కోసం విరాళం ప్రకటించారు. తన ఒక నెల జీతం రూ.2.3 లక్షలు విరాళంగా ఇస్తున్నట్లు వెల్లడించారు. వయనాడ్లో పునరావాసం కోసం కార్యక్రమాలు చేపడుతున్న కేరళప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి (కేపీసీసీ) ఈ సాయాన్ని అందజేశారు. "వయనాడ్లోని మా సోదర, సోదరీమణులు వినాశకరమైన విషాదాన్ని చవిచూశారు. వారు ఎదుర్కొన్న ఈ నష్టాల నుంచి కోలుకునేందుకు మన మద్దతు అవసరం. అందుకే బాధితుల సహాయార్థం, పునరావాస ప్రయత్నాలకు నా వంతు సాయంగా నెల మొత్తం జీతాన్ని విరాళంగా ఇచ్చాను' అని రాహుల్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ తమకు తోచిన సాయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. కాగా, ప్రకృతి విపత్తులో సర్వం కోల్పోయిన బాధితుల కోసం ఆ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ విరాళాలు సేకరిస్తున్న విషయం తెలిసిందే. విరాళాల సేకరణ కోసం ప్రత్యేకంగా 'స్టాండ్ విత్ వయనాడ్ – ఐఎన్సీ' అనే యాప్ను రూపొందించింది. వయనాడ్లో పునరావాస పనులకు సంబంధించిన పురోగతిని కాంగ్రెస్ ఎంపీ కే సుధాకరన్ స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు కేపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎం లిజు తెలిపారు.

కాగా, జూలై నెల చివర్లో భారీ వర్షాలు వయనాడ్ను అతలాకుతలం చేసిన విషయం తెలిసిందే. ఈ వర్షాలకు మెరుపు వరదలు సంభవించాయి. దీంతో వయనాడ్లో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ప్రకృతి విపత్తులో గ్రామాలకు గ్రామాలే తుడిచిపెట్టుకుపోయాయి. ఈ విలయంలో సుమారు 400 మంది వరకూ ప్రాణాలు కోల్పోయినట్లు అంచనా. రోడ్లు, కమ్యూనికేషన్ వ్యవస్థ అన్నీ తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో ఆ ప్రాంతాన్ని పునర్నిర్మించేందుకు కేరళ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో కేరళ సర్కార్కు పలువురు ఆపన్న హస్తం అందిస్తున్నారు. ఇక వయనాడ్లో బాధితులకు కాంగ్రెస్ పార్టీ కూడా 100 ఇళ్లు నిర్మించాలని తలపెట్టింది. ఇందుకోసం పార్టీ విరాళాలు సేకరిస్తోంది. దీనికి రాహుల్ కూడా తన వంతు సాయం అందించారు.

విశ్వంభర V3 NEWS

సినీ తారల విరాళాలు

అత్యధికంగా రెండుకోట్లు ప్రకటించిన ప్రభాస్

రెండు తెలుగు రాష్ట్రాల్లో వరదల నేపథ్యంలో తెలుగు సినీ పరిశ్రమ నుంచి విరాళాలు వెల్లువెత్తు తున్నాయి. జూ. ఎన్టీఆర్‌తో ప్రారంభమైన ఈ సాయం కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే మంగళవారం రోజున జూ. ఎన్టీఆర్, సూపర్ స్టార్ మహేశ్ బాబు, పవన్ కల్యాణ్, బాలకృష్ణ, విశ్వక్ సేన్, సిద్దు జొన్నలగడ్డ, కథానాయిక అనన్య నాగళ్ల, యాంకర్ స్రవంతి, దర్శకుడు త్రివిక్రమ్, నిర్మాతలు రాధాకృష్ణ, వంశీ, ఆయ్ మూవీ టీం తమవంతు సాయంగా ప్రకటించిన ఇషయం తెలిసిందే. తాజాగా బుధవారం మెగాస్టార్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెరో రూ.50 లక్షల సాయం ప్రకటించగా, అదేబాటలో అల్లు అర్జున్ కూడా తనవంతుగా రెండు రాష్ట్రాలకు రూ.50 లక్షల చొప్పున సాయం ప్రకటించారు. ఇక పాన్ ఇండియా సూపర్ స్టార్ ప్రభాస్ కోటి చొప్పున రెండు కోట్ల విరాళం ప్రకటించి తన సేవాగుణాన్ని మరో సారి చాటుకున్నాడు. అదే విధంగా కమెడియన్ అలీ ఆంధ్రప్రదేశ్‌కు రూ.3 లక్షలు, తెలంగాణకు రూ.3 లక్షల చొప్పున రూ.6లక్షల విరాళం ప్రకటించారు. కోట శ్రీనివాసరావు లక్ష సాయం ప్రకటించారు.

దర్శకుడు హరీశ్ శంకర్ పెద్దమనసు

మిస్టర్ బచ్చన్ ఫెయిల్యూర్‌తో 2కోట్లు వాపస్

మాస్ మహారాజ రవితేజ, దర్శకుడు హరీశ్ శంకర్ కాంబోలో వచ్చిన తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్' 'నామ్ తో సునా హోగా' అనేది ఈ సినిమా ట్యాగ్‌లైన్. షాక్, మిరపకాయ్ వంటి సూపర్ హిట్ సినిమాల తర్వాత రవితేజ, హరీశ్ శంకర్ కాంబోలో ఈ సినిమా రావడంతో మూవీపై భారీ అంచనాలు ఉన్న విషయం తెలిసిందే. అయితే ఈ అంచనాలను అందుకోలేక పోయింది ఈ చిత్రం. ఇండిపెండెన్స్ కానుకగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాగా.. ఫస్ట్ షో నుంచే మిక్స్‌డ్ టాక్ రావడంతో బాక్సాఫీస్ వద్ద డిజాస్టార్ అందుకోవడమే కాకుండా.. సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోల్ అయ్యింది ఈ చిత్రం. అయితే ఈ సినిమాకు వచ్చిన నష్టాల వలన దర్శకుడు హరీశ్ శంకర్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలస్తుంది. ఈ మూవీ వలన నష్టపోయిన నిర్మాతకు హరీశ్ శంకర్ తన రెమ్యూనరేషన్ నుంచి రూ.2 కోట్లు వెనక్కి ఇచ్చినట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఈ సినిమాకు హరీశ్ శంకర్ దర్శకుడిగా రూ.10 కోట్ల రెమ్యూనరేషన్ తీసుకున్నట్లు సమాచారం. ఇందులో నుంచే నిర్మాతకు రూ.2 కోట్లు తిరిగి ఇచ్చినట్లు టాక్. అయితే హరీశ్ శంకర్ చేసిన పనికి రవితేజ అభిమానులతో పాటు నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మించగా.. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించింది.

దేవర నుంచి కొత్త పోస్టర్ విడుదల

ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'దేవర' జనతా గ్యారేజ్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత వీరిద్దరి కాంబోలో ఈ సినిమా రానుండటంతో భారీ అంచనాలు ఉన్నాయి. ఇక రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ నటుడు సైఫ్ అలీఖాన్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాను సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. విడుదల తేదీ దగ్గర పడటంతో వరుస అప్‌డేట్‌లను ప్రకటిస్తుంది చిత్రబృందం. ఇప్పటికే మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ ఫియర్ సాంగ్‌తో పాటు సెకండ్ సింగిల్ చుట్టమల్లే పాటలను విడుదల చేయగా.. ఈ రెండు పాటలు యూట్యూబ్‌లో దూసుకుపోతున్నాయి. అయితే తాజాగా ఈ మూవీ నుంచి థర్డ్ సింగిల్ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ మూవీ నుంచి థర్డ్ సింగిల్ 'దావుడి' సాంగ్‌ను ఈరోజు సాయంత్రం 5.04 గంటలకు విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది.

హేమ కమిటీ రిపోర్ట్ గురించి అడక్కండి: హీరోయిన్ ఆండ్రియా జెర్మయ్య

మలయాళ చిత్రపరిశ్రమలో అవకాశాల పేరుతో 'అడ్జెస్ట్‌మెంట్'పై జస్టిస్ హేమ కమిషన్ ఇచ్చిన నివేదికపై తనను ప్రశ్నించవద్దంటూ సింగర్, హీరోయిన్ ఆండ్రియా జెర్మయ్య స్పష్టంచేశారు. తిరువాన్మియూరులో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో ఆమె పాల్గొంది. ఈ సందర్భంగా ఆమెను మీడియా జస్టిస్ హేమ కమిషన్‌పై ప్రశ్నలు సంధించింది. దీనికి ఆండ్రియా జెర్మయ్య సమాధానమిస్తూ, చిత్రపరిశ్రమలో మహిళల లైంగిక వేధింపులపై జస్టిస్ హేమ కమిషన్ ఇచ్చిన నివేదికపై నో కామెంట్స్, ఈ అంశంలో ఎలాంటి ప్రశ్నలు అడగొద్దు' అంటూ కోరారు. నిజానికి ప్రతి అంశంలో ఎంతో బోల్డ్‌గా స్పందించే నటి ఆండ్రియా.. జస్టిస్ హేమ కమిషన్‌పై మాట్లాడేందుకు నిరాకరించడం ఇపుడు చర్చనీయాంశంగా మారింది.

శరవేగంగా గుడ్ బ్యాడ్ అగ్లీ మూవీ షూటింగ్

కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ తో పాన్ ఇండియా ప్రొడక్షన్ హౌస్ మైత్రీ మూవీ మేకర్స్ రూపొందిస్తున్న బి÷-గగెస్ట్ ఎంటర్‌టైనర్ చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ఈ తెలుగు-తమిళ ద్విభాషా చిత్రానికి అధిక్ రవిచంద్రన్ రచన, దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ మూవీ హైదరాబాద్‌లో శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన లుక్ పోస్టర్స్ మంచి స్పందనను రాబట్టుకోగా తాజాగా ఇంట్రెస్టింగ్ అప్డేట్ బయటకు వచ్చింది. అయితే.. ఈసినిమాలో ఇప్పటివరకు హీరోయిన్‌ను ఇంకా ఎంపిక చేయలేదు. ఈ నేపథ్యంలో తాజాగా ఈ మూవీ కోసం త్రిష(÷సతిబరజీ)ను ఎంపిక చేశారు. ఈ మేరకు ఒప్పంద పత్రాలపై సంతకాలు కూడా పూర్తి చేశారు. త్వరలోనే అజిత్ - త్రిష కాంబినేషన్‌లో తెరకెక్కించే సన్నివేశాలను షూట్ చేసేలా దర్శకుడు ఆధిక్ రవిచంద్రన్ ప్లాన్ చేస్తున్నారు.



జనక అయితే గనక విడుదల వాయిదా

దిల్ రాజు ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందుతోన్న సినిమా'జనక అయితే గనక' విడుదల వాయిదా పడింది.. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. అంబాజీపేట మ్యారేజ్ బ్యూరో, ప్రసన్నవదనం వంటి వరుస హిట్ చిత్రాల తర్వాత సుహాస్ హీరోగా నటించగా సంకీర్తన కథానాయికగా చేసింది. సందీప్ రెడ్డి బండ్ల దర్శకత్వం వహించారు. విజయ్ బుల్గానిన్ సంగీతం అందించారు. ఇటీవల విడుదల చేసిన సినిమా ట్రైలర్ మంచి ఆదరణను కూడా దక్కించుకుంది. అయితే అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అయింది. ఈక్రమంలో సెప్టెంబర్ 7న థియేటర్లలో రిలీజ్ చేస్తున్నట్లు విడుదల తేదీని కూడా ప్రకటించి ప్రమోషన్ కార్యక్రమాలు సైతం ప్రారంభించారు. ఇదిలావుండగా ఏపీ, తెంగాణ రాష్ట్రాల్లో తుఫాన్ వల్ల వరద భీభత్సం జరగడం, చాలామంది చనిపోవడం, ఇండ్లు మునగడం, తదితర సమస్యలు తలెత్తాయి.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com